


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




వరంగల్ | 16-07-2026 గురువారం | సంపుటి : 11 | సంచిక : 29 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur
Follow us on

రూ.1000 కోట్లతో విద్యా కిట్లు | సీఎం రేవంత్ రెడ్డి

# కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం.. గ్రేడింగ్‌లో పురోగతి
- అంతర్జాతీయ విద్యావిధానంపై ఉపాధ్యాయులకు విదేశీ శిక్షణ
- ఒక్కో విద్యార్థిపై రూ. 1.08 లక్షల వ్యయం.. క్రీడలకూ ప్రోత్సాహం





**వనపర్తి, జూలై 15 (వుదయం) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. "పలుగు, పార పట్టిన చేతులే.. కలాలు పట్టి తెలంగాణ రాత మార్చాలి" అని ఆకాంక్షించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ముఖ్యమంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం పాఠశాల విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం విద్యాశాఖ సరికొత్త ప్రణాళికతో ముందుకు వెళ్తోందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాబోయే ఆగస్టు 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27.50 లక్షల మంది విద్యార్థులకు 9 రకాల వస్తువులతో కూడిన 'తెలంగాణ ఎడ్యుకేషన్ కిట్లను' అందజేస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు అందే ఈ వస్తువుల నాణ్యత ఎలా ఉందో నేరుగా విద్యాశాఖకు వాట్సాప్ వేదికగా ఫీడ్‌బ్యాక్ ఇచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

గతంలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని ముఖ్యమంత్రి విశ్లేషించారు. "సర్కారు బడులను బలోపేతం చేయకపోతే వందేళ్లయినా విద్యావ్యవస్థలో సమస్యలు తీరవు. అందుకే మా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించింది. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా వీటిని తీర్చిదిద్దాలని శపథం పూని పని చేస్తున్నాం" అని సీఎం స్పష్టం చేశారు. మొత్తం వ్యవస్థ మారడానికి ఒకటి రెండేళ్ల సమయం పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని సీఎం గుర్తుచేశారు. 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, పదేళ్లుగా నిలిచిపోయిన బదిలీలను పారదర్శకంగా చేపట్టామన్నారు. 317 జీవో బాధితులకు ఊరటనిస్తూ చెదిరిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలను ఒకచోటికి చేర్చామని, దీని వల్ల వారు ప్రశాంతమైన వాతావరణంలో బోధన సాగిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల కష్టానికి ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన 'పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్'లో తెలంగాణ 36వ స్థానం నుంచి 18వ స్థానానికి ఎగబాకిందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచేలా శ్రమించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచే ఉపాధ్యాయులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున అవార్డులు ఇస్తామని ప్రకటించారు.

ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావిధానాలను అధ్యయనం చేయడం కోసం ఇప్పటికే 50 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశాలకు పంపామని ముఖ్యమంత్రి తెలిపారు. వచ్చే ఏడాది ఈ సంఖ్యను 150కి పెంచుతామన్నారు. ఐటీ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విప్లవం వల్ల భవిష్యత్తులో వైట్ కాలర్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అందుకే యువతలో నైపుణ్యాలు (Skills) పెంచి బ్లూ కాలర్ ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే జర్మన్, జపనీస్ వంటి అంతర్జాతీయ భాషలను నేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

## తెలంగాణలో ఓటర్ల సవరణ గడువు పొడిగింపు

**హైదరాబాద్, జూలై 15 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఇందుకు సంబంధించి సవరించిన సరికొత్త షెడ్యూల్‌ను ఈసీఐ విడుదల చేసింది. ఇప్పటికే పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఓటర్ల జాబితా సవరణ గడువును ఈనెల (జూలై) 24వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణలోనూ గడువు పొడిగిస్తూ ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసీఐ వెల్లడించిన తాజా షెడ్యూల్ ప్రకారం.. రాష్ట్రంలో అర్హులైన పౌరుల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించే గడువును వచ్చే నెల ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించారు. కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలనుకునే వారు, తమ ఓటు వివరాలలో తప్పుల సవరణలు చేసుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ల జాబితా దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిన అనంతరం, ఆగస్టు 10వ తేదీన రాష్ట్రంలో ముసాయిదా ఓటర్ల జాబితా ను అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత, దానిపై సవరణలు లేదా అభ్యంతరాలు తెలపడానికి ప్రజలకు నెల రోజుల సమయం ఇచ్చారు. ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులన్నింటినీ కూలంకషంగా పరిశీలించి, వాటిపై తుది విచారణ జరిపేందుకు జిల్లా ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 8వ తేదీని తుది గడువుగా విధించింది. ఆ లోపు అర్హులైన ఓటర్లందరికీ న్యాయం జరిగేలా జాబితాను సిద్ధం చేయనున్నారు.

## అమెరికాలో తెలంగాణ యువకుడి హత్య



**ఫిలడెల్ఫియా:** అమెరికాలో దారుణ హత్యకు గురైన తెలంగాణ యువకుడు కుంచ అన్షుల్ (28) కేసులో కీలక పురోగతి లభించింది. అగ్రరాజ్య పోలీసులు ఈ ఘాతుకానికి పాల్పడిన ఓ 14 ఏళ్ల మైనర్ బాలుడిని అరెస్ట్ చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసులు తాజాగా మీడియాకు వెల్లడించారు. ఫిలడెల్ఫియాకు చెందిన 14 ఏళ్ల బాలుడిని హత్య, దోపిడీ (దొంగతనం) అభియోగాలపై జూలై 10వ తేదీన అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే, హత్య జరిగిన సమయంలో ఈ మైనర్ బాలుడితో పాటు మరో వ్యక్తి కూడా ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఆ రెండో వ్యక్తి ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని, నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పోలీసులు వివరించారు. నార్త్ ఫిలడెల్ఫియా పరిధిలోని ఎడ్గ్లీ స్ట్రీట్‌లో జూన్ 5వ తేదీన ఈ ఘోరం జరిగింది. ఒక నిర్మానుష్యంగా ఉన్న ఇంటికి పిజ్జాలు డెలివరీ ఇచ్చేందుకు వెళ్లిన అన్షుల్‌ను టార్గెట్ చేస్తూ దుండగులు దాడికి తెగబడ్డారు.

## ఏపీలో పట్టిసీమ జలాలు తెలంగాణలో నిర్లక్ష్యం



**న్యూఢిల్లీ, జూలై 15 (వుదయం ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాగునీటి విధానాన్ని, పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కొనియాడారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న జల విధానాలను ప్రశంసించడంతో పాటు, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై, కేంద్ర పరిధిలోని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ద్వంద్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**ఏపీలో పట్టిసీమ జలాలు.. తెలంగాణలో నిర్లక్ష్యం**

ఎల్‌నినో వంటి తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లోనూ సాగునీటి ఎద్దడి రాకుండా ఏపీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని కేటీఆర్ అభినందించారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోస్తూ అక్కడి ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గుర్తుచేశారు. సముద్రంలోకి వృథాగా పోయే నీటిని వాడుకునేందుకు ఏపీ అన్ని ప్రయత్నాలూ చేస్తూ నీటిపారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తోందని.. కానీ, దురదృష్టవశాత్తూ మన తెలంగాణ ప్రభుత్వానికి ఆ ప్రాధాన్యత లేదని ఆయన విమర్శించారు. కేంద్ర పరిధిలోని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "గతంలో ఏపీలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నప్పుడు పట్టించుకోని ఎన్డీఎస్ఏ.. తెలంగాణలోని మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపించింది. నిజానికి మేడిగడ్డపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం" అని ఆరోపించారు. కేంద్ర సంస్థ ప్రాథమిక నివేదికకు, తుది నివేదికకు మధ్య ఎందుకింత వ్యత్యాసం ఉందో సమాధానం చెప్పాలన్నారు. మేడిగడ్డపై చూపిన అతి ఉత్సాహాన్ని ఇతర రాష్ట్రాల ప్రాజెక్టులపై ఎందుకు చూపడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఉడాన్ స్కీంతోనే వరంగల్ విమానాశ్రయం


**హైదరాబాద్, జూలై 15 (వుదయం) :** వరంగల్ ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, దీనిని 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని బీజేపీ రాష్ట్ర నేత ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ చొరవతోనే వరంగల్ ఎయిర్‌పోర్టు పనులు సాగుతున్నాయని, అయితే ఆ క్రెడిట్‌ను దక్కించుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.



గతంలో ఎయిర్‌పోర్టుల నిర్మాణాలపై జరిగిన అధ్యయనాలను రామచందర్‌రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. "2011లో 'రైట్స్' (RITES) కంపెనీ దేశంలో విమానాశ్రయాల నిర్మాణ సాధ్యసాధ్యాలపై నిర్వహించిన సర్వేలో వరంగల్, కడప ప్రాంతాల పేర్లు స్పష్టంగా ఉన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశవ్యాప్తంగా విమానాశ్రయాల విస్తరణకు 'ఉడాన్' (UDAN) స్కీమ్ ద్వారా శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద దేశంలో కొత్తగా 88 ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలపగా.. అందులో వరంగల్ కూడా ఒకటి" అని ఆయన వివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు పనులు ఇన్నాళ్లూ నెమ్మదించడానికి గల కారణాలను ఆయన విశ్లేషించారు. గత ప్రభుత్వాల హయాంలో భూసేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి కాకపోవడం వల్లే విమానాశ్రయ నిర్మాణం ఇంతగా ఆలస్యమైందని మండిపడ్డారు.

## పశ్చిమాసియాలో రగులుతున్న మంటలు

## వైట్‌హౌస్ 'సిచువేషన్ రూమ్'లో ట్రంప్



**వాషింగ్టన్ :** పశ్చిమాసియా లో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి' దిగ్బంధనం, ఇరాన్‌తో తలెత్తిన తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కీలకమైన అడుగు వేశారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితులపై చర్చించేందుకు వైట్‌హౌస్‌లో ఉన్నత స్థాయి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైట్‌హౌస్ 'సిచువేషన్ రూమ్'లో ట్రంప్ భేటీఈ క్లిష్ట సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని అత్యంత సురక్షితమైన 'సిచువేషన్ రూమ్'లో భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ అత్యవసర భేటీకి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌తో పాటు అమెరికా రక్షణ, నిఘా విభాగాలకు చెందిన అత్యున్నత స్థాయి అధికారులు హాజరయ్యారు. హర్మూజ్ జలసంధి గుండా అంతర్జాతీయ నౌకల ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడటం, అలాగే అణు ఒప్పంద డిమాండ్లను అంగీకరించేలా ఇరాన్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా అడుగులు వేస్తోంది. అవసరమైతే ఇరాన్ సైనిక స్థావరాలపై ప్రత్యక్ష దాడులకు దిగడానికి కూడా అధ్యక్షుడు ట్రంప్ సుముఖంగా ఉన్నట్లు వైట్‌హౌస్ వర్గాల సమాచారాన్ని ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

## సభలో స్మార్ట్ గాడ్జెట్లకు అనుమతి లేదు



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఎంపీలకు పలు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. సభకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసులు వంటి ఆధునిక గ్యాడ్జెట్లను ధరించకూడదని స్పష్టం చేసింది. ఈ నెల 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సచివాలయం ఈ మేరకు ప్రత్యేక బులెటిన్‌ను విడుదల చేసింది. ప్రస్తుతం మార్కెట్లో విరివిగా లభ్యమవుతున్న స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్‌గ్లాసెస్, పెన్ కెమెరాల వంటి హైటెక్ పరికరాల వల్ల సభ భద్రతకు, సభ్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని లోక్‌సభ సచివాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ తరహా పరికరాలను తోటి ఎంపీల హక్కులను ఉల్లంఘించేలా దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున, వాటిని సభలోకి తీసుకురావద్దని సభ్యులకు విజ్ఞప్తి చేసింది. ఈసారి నిబంధనలలో సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ప్రస్తావనను తీసుకువచ్చారు. కృత్రిమ మేధస్సు (AI) సాంకేతికతతో సృష్టించిన చిత్రాలు, అనుచిత పోస్టర్లు, ఎగతాళి చేసే రీతిలో ఉండే స్లోగన్లతో కూడిన ప్లకార్డులు లేదా బ్యానర్లను సభలోకి తీసుకురావద్దని లోక్‌సభ సచివాలయం ఆదేశించింది. గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా సస్పెన్షన్‌కు గురైన పలువురు ఎంపీలు పార్లమెంట్ ప్రధాన ద్వారాల వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టిన విషయాన్ని సచివాలయం ఈ సందర్భంగా ప్రస్తావించింది. సమావేశాల సమయంలో తోటి ఎంపీలు తమ ఛాంబర్లలోకి ప్రశాంతంగా వెళ్లడానికి వీలుగా ప్రవేశ ద్వారాల వద్ద ఎలాంటి నిరసన ప్రదర్శనలు చేపట్టవద్దని సభ్యులను కోరింది. సభా మర్యాదలను, నిబంధనలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని స్పష్టం చేసింది.




## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకూడదు



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు సంబంధించి జరుగుతున్న ప్రచారంపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ సుప్రియా సూలే స్పష్టతనిచ్చారు. ఈ బిల్లుపై తమ పార్టీ ఇంకా ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో వస్తున్న వార్తలన్నీ కేవలం "టీకప్పులో తుపాను" లాంటివేనని కొట్టిపారేశారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమి తీసుకొచ్చే డీలిమిటేషన్ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇవ్వబోతోందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని సుప్రియా సూలే పేర్కొన్నారు. ఒక జర్నలిస్టు మిత్రుడితో వాట్సప్‌లో తాను జరిపిన వ్యక్తిగత సంభాషణను బయటపెట్టి, దాన్నే పార్టీ అధికారిక నిర్ణయంగా ప్రచారం చేయడం దురదృష్టకరమని, అది ఎంతమాత్రం సరి కాదని ఆమె ఆక్షేపించారు. డీలిమిటేషన్ వ్యవహారంలో దక్షిణాది రాష్ట్రాలు వ్యక్తపరుస్తున్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రియా సూలే డిమాండ్ చేశారు. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో ఎలాంటి అన్యాయం జరగకూడదన్నదే తమ పార్టీ ప్రధాన ఆకాంక్ష అని ఆమె స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై ఎన్సీపీ (ఎస్పీ) వైఖరిని వివరిస్తూ.. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచి, ఆ ప్రక్రియను ఏ విధంగా అమలు చేస్తారనే దానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉందన్నారు. అసలు బిల్లు ముసాయిదాను చూడకుండా, దానిపై పూర్తి అవగాహన లేకుండా ముందే స్పందించడం సమంజసం కాదన్నారు. పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడైన తర్వాతే పార్టీ తరఫున కూర్చొని చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని సుప్రియా సూలే వెల్లడించారు.

# మంత్రుల పర్యటన వాయిదా



- 16 నుండి 18 వ తేదీకి మార్పు
- యాలాల మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్

యాలాల జులై 15 (వుదయం ప్రతినిధి):-

పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాల్లో భాగంగా తాండూరు కు రానున్న మంత్రుల పర్యటన వాయిదా పడినట్లు యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్ తెలిపారు. తాండూర్ నియోజకవర్గం లోని వివిధ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఐటీ శాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఈనెల 16న హాజరై వివిధ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయాల్సి కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే 16న ఉన్న కార్యక్రమాన్ని స్వల్ప మార్పుతో ఈ కార్యక్రమాన్ని ఈనెల 8న నిర్వహిస్తారని తెలిపారు. కావున పార్టీ కార్యకర్తలు స్వల్ప మార్పుని గమనించి 18న పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. మంత్రుల పర్యటన పర్యటన ఈనెల 18కి వాయిదా పడినట్లు వివరించారు. 18,వ తేదీన శనివారం యధావిధిగా కార్యక్రమం ఉంటుందని చెప్పారు.



# కోకట్ గ్రామంలో సిసి కెమెరాలో ఏర్పాటు

- 70000 విరాళం అందజేసిన సర్పంచ్

యాలాల జులై 15 (వుదయం ప్రతినిది):

యాలా ల మండలం కోకట్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి 70 వేల రూపాయలు బుధవారం విరాళంగా అందజేశారు. కోకట్ గ్రామంలో 22 సిసి కెమెరాలు ఏర్పాటు చేయుటకు 1,60,000 వ్యయం కాగా అందులో రూ 76 వేలు అందజేశారు. శాంతి భద్రతల నివారణకు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి నటువంటి సర్పంచుకు పోలీసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ యాలాల పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



# కారుతో ఢీకొట్టి వ్యక్తి హత్య

- నిందితుడు అరెస్ట్

కంది, వుదయం :

కంది మండలం జుల్కల్ గ్రామం అంబేద్కర్ కాలనీలో సోమవారం అర్ధ రాత్రి జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 14న రాత్రి సుమారు 11:30 గంటలకు కాశీపురం ఆంజనేయులు తన ఎర్టిగా కారు (TS07JP8776)లో వెళ్తుండగా, బూడిద రమేష్ కుమారుడు చక్రి రోడ్డుపై నిలబడటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది.ఈ సమయంలో అక్కడికి వచ్చిన బూడిద రమేష్.. "నా కొడుకుతో ఎందుకు గొడవ పడుతున్నావు" అని ప్రశ్నించగా, ఆంజనేయులు కారుతో ముందుకు వెళ్లి తిరిగి వచ్చి రమేష్‌ను కారుతో ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.తీవ్రంగా గాయపడిన రమేష్‌ను తొలుత బాలాజీ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వెల్లడించారు.ఘటనపై సమాచారం అందుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మంగళవారం తెల్లవారు జామున సుమారు 1:30 గంటలకు నిందితుడు కాశీపురం ఆంజనేయులు (43), కంది గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



# తార కళాశాల 49వ వార్షికోత్సవం

సంగారెడ్డి, వుదయం:

తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో కళాశాల యొక్క 49వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు.

తారా ప్రభుత్వ కళాశాల జులై 15 1977లో కళాశాల దాత శ్రీమతి తారా స్వరూప్ ఆనాడు రెండు లక్షల కార్పస్ పండును కట్టి, 23 ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని, నాడు ఏర్పడిన ఆ కళాశాల నేడు మహావృక్షమై అనేక మంది విద్యార్థిని విద్యార్థులకు విద్యను అందించడంలో సరస్వతి మందిరంగా వెలుగుందుతుందని పేర్కొన్నారు. ఆనాడు బిఏ మరియు బీకాం అనే రెండు గ్రూపులు 232 విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల నేడు 46 కోర్సులు మరియు 10 పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం తో ఒక మినీ యూనివర్సిటీగా వెలుగొందుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఏ ప్లస్ గ్రేడ్ పొందిన కళాశాలలో తారా కళాశాల ఒకటని, తెలంగాణలోని 10 ప్రభుత్వ కళాశాలలో కళాశాల ఒకటని పేర్కొన్నారు. తారా ప్రభుత్వ కళాశాలకు రాష్ట్రస్థాయిలోనే కాకుండా, జాతీయస్థాయిలో మంచి గుర్తింపు ఉందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా లైన్స్ క్లబ్ ఆదర్శ అధ్యక్షుడు లయన్ విజయేందర్ రెడ్డి, రీజినల్ చైర్మన్ లయన్ వెంకన్న, రీజినల్ కార్యదర్శి లయన్ వెంకటేశం, సంగారెడ్డి జిల్లా లైన్స్ క్లబ్ ఆదర్శ కార్యదర్శి లయన్ రామప్ప, సభ్యులు లయన్ ప్రకాష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిర్మల, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందము, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా ప్రధాన రహదారి

వట్ పల్లి, జూలై 15, (వుదయం ప్రతినిధి):




దేవనూర్ గ్రామ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు, సోషల్ మీడియా కార్యకర్త బేలూరి చిన్న (డీపీఎస్ చిన్నోడు) తెలిపారు.వర్షాకాలంలో రహదారి పై గుంతల్లో నీరు నిలిచి బురదగా మారడంతో విద్యార్థులు, రైతులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వంటి సేవలు కూడా గ్రామానికి సకాలంలో చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దేవనూర్ గ్రామ ప్రధాన రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని రాష్ట్ర మంత్రిని డీపీఎస్ చిన్న కోరారు.

# మిషన్ భగీరథ నీరు కలుషితం

- పైపులైను లీకేజీలతో ఏరులై పారుతున్న త్రాగు నీరు
- లీకేజీల వద్ద మారిన మురుగు గుంటలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- అంటువ్యాధుల నివారణ పై అధికారుల సమావేశం ఎప్పుడు

యాలాల జులై 10 (వుదయం ప్రతినిధ ):-

వర్షాకాలంలో అంటూ వ్యాధులు వ్యాపించకుండా జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయి అధికారులు మాత్రం ప్రజాప్రతిని సంబంధిత నీటి శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయలేదు. జిల్లా స్థాయి అధికారులు మాత్రం త్రాగునీటి సంపుల వద్ద శుభ్రంగా ఉంచుకోనె విధంగా బ్లీచింగ్ పౌడర్ చల్లుకోవాలని సూచనలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాలలో ఎక్కడ కూడా అమలు కావడం లేదు. గ్రామ పంచాయతీలో ఉన్న త్రాగునీటి (ఓహెచ్ఎస్ఆర్) ట్యాంకులు శుభ్రం, చేసి పైపులైన్ల లీకేజీలు వెంటనే పూర్తిచేయాలని జిల్లా స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులకు, సిబ్బందికి ఇప్పటి వరకే ఆదేశాలు జారీ చేశారు. కానీ గ్రామాలలో ఎక్కడ కూడా ట్యాంకుల శుభ్రంగాని పైపుల పైప్ లైన్ లో లీకేజీ వరమత్తులు చేపట్టడం లేదు. మిషన్ భగీరథ నుండి సరఫరా అయ్యే నీరు అక్కడక్కడ పైపులైన్లు లీకేజీలతో మురుగు గుంటలుగా మారాయి. మిషన్ భగీరథ అధికారులు లీకేజీలను చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నరని విమర్శలు ఉన్నాయి. యాలాల మండలంలో తాండూర్ నియోజకవర్గానికి సంబంధించిన మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు అందించేందుకు యాలాల మండల పరిధిలోని పగిడ్యాల గ్రామం సమీపంలో నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ఆ ట్యాంకు ద్వారా వివిధ గ్రామాలకు త్రాగునీరు సరఫరా అవుతుంది. నియోజకవర్గానికి త్రాగునీరు అందించే మేం పైప్ లైన్ లీకేజీలతో గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు కేజీలను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేపడుతున్న సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో చేసేదేమి లేక అదే నీరును మీద గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. లీకేజీల ద్వారా మురుగునీరు ట్యాంకు వెళ్లి కలుషిత నీరుగా మారి గ్రామాలకు సరఫరా అవుతుంది అని గ్రామస్తులు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీరు త్రాగునీరుగా ఉన్న త్రాగటానికి ప్రజలు భయపడుతున్నారు. అక్కడక్కడ అయినా లీకేజీలను చూసి మిషన్ భగీరథ నీరు తాగాలంటే ప్రజలు ఇష్టపడడం లేదు. కొన్ని గ్రామాలలో మిషన్ భగీరథ నీరును త్రాగటానికి కాకుండా ఇతర పనులకు ఉపయోగిస్తున్నారు. బోరు బావుల నుండి నీరు తెచ్చుకొని త్రాగటానికి వినియోగించుకుంటున్నారు. కొన్ని గ్రామాలలో త్రాగునీటి సిబ్బంది వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులు గ్రామాలను పర్యటించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వర్షాకాలంలో పరిశుభ్రత పాటించకపోతే వివిధ అంటూ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని కొందరు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల స్థాయిలో ప్రజా ప్రతినిధులకు, సిబ్బందితో సమావేశం నిర్వహించి ట్యాంకుల శుభ్రం చేయడం లీకేజీల మరమ్మతులు చేపట్టాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





# గ్రామపంచాయతీ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి

- రాయపోల్ ఎంపీడీవోకు సీఐటీయూ వినతిపత్రం

దౌల్తాబాద్, జూలై 15 (వుదయం):

గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచడంతో పాటు, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం రాయపోల్ మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.ఈ సందర్భంగా సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం, గృహ అవసరాల ఖర్చులు గణనీయంగా పెరగడంతో గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్ల క్రితం వేతనాలను రూ.9,500కు పెంచిందని, ప్రస్తుతం పెరిగిన జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని కోరారు.అలాగే గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల సకాలంలో వేతనాలు చెల్లించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నెల సబ్బులు, నూనె పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ.25 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మట్టి ఖర్చులను రూ.25 వేలకు పెంచాలని, ప్రతి సంవత్సరం రెండు జతల యూనిఫాంలు అందించాలని కోరారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అన్ని హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వామి, రైతు సంఘం నాయకుడు మహేందర్ రెడ్డి, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నర్సింలు, బాబు, బాలరాజు, సత్తయ్య, స్వామి, బాలమణి, లక్ష్మి, స్వరూప, చిన్న లక్ష్మి, కవిత, స్వప్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

- అనాజీపూర్ వద్ద ప్రమాదం
- 108 సిబ్బంది సకాలంలో స్పందన

దౌల్తాబాద్, జూలై 15 (వుదయం):

రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది.

108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం, తొగుట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన అక్కారం రాజలింగం అనాజీపూర్ గ్రామం నుంచి స్వగ్రామమైన లింగాపూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న దౌల్తాబాద్ 108 అంబులెన్స్ సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ భాను ప్రకాష్, పైలెట్ నర్సింలు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ సందర్భంగా జిల్లా 108 ప్రోగ్రాం మేనేజర్ సంపత్, కోఆర్డినేటర్ నరేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, ప్రసవాలు తదితర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఆలస్యం చేయకుండా ఉచిత 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో సమాచారం అందిస్తే బాధితులకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు 108 సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలిపారు.

# గుడిలో పెళ్లి... వీధిలో మళ్లీ!

- తాళి కట్టిన చేతులే... తోసేశాయి!
- భర్త ఇంటి ముందు నవవధువు కన్నీటి ధర్నా
- భీచుపల్లిలో కల్యాణం.. మరుసటి రోజే గృహ బహిష్కారం
- జోగులాంబ గద్వాల జిల్లా అనంతపురంలో హైడ్రామా

గద్వాల, జూలై 15 (వుదయం బ్యూరో):

ప్రేమించాడు... పెళ్లాడాడు... తీరా అత్తగారింటి గడప తొక్కేసరికి ముఖం చాటేశాడు! మూడు ముళ్ల బంధంతో ఏకమైన అర్ధాంగిని, కన్నవారి కుటుంబం కోసం కట్టెదుటే నడిరోడ్డుపై వదిలేశాడు. "నా న్యాయమైన హక్కును కాలరాయకండి.. భార్యగా నన్ను ఇంట్లోకి రానివ్వండి" అంటూ ఆ క్షోభిత నారి పెళ్లి బట్టలతోనే భర్త ఇంటి ముందు ధర్నాకు దిగిన హృదయవిదారక ఘటన జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం అనంతపురం గ్రామంలో కలకలం రేపింది.

**ప్రేమ గెలిచింది.. పెళ్లి జరిగింది.. కానీ!**

స్థానికుల కథనం ప్రకారం... అనంతపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు, గద్వాల పట్టణానికి చెందిన యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దల అంగీకారం లభించకపోవడంతో, మంగళవారం భీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయ సాక్షిగా ఇద్దరూ వివాహ బంధంతో ఒకటయ్యారు. కొత్త ఆశలతో, కోటి కలలతో బుధవారం ఉదయం భర్తతో కలిసి అత్తవారింటికి అడుగుపెట్టింది ఆ నవవధువు.

**కన్నవారి ఒత్తిడి.. కట్టుకున్నోడి నిర్వేదం:**

అయితే, వీరి ప్రేమ వివాహాన్ని అబ్బాయి కుటుంబ సభ్యులు సూర్యాస్తమయం లోపే కాలరాశారు. యువతిని కోడలిగా అంగీకరించే ప్రసక్తే లేదని, ఇంట్లోకి రానిచ్చేది లేదని తెగేసి చెప్పారు. కన్నవారి మాట దాటలేక, కట్టుకున్న భార్యను కాపాడుకోలేక ఆ యువకుడు చేతులెత్తేయడం గమనార్హం. కుటుంబ సభ్యులు అడ్డుకున్నారంటూ భార్యను గడప బయటే నిలబెట్టేశాడు.

**న్యాయం జరిగే వరకూ కదిలేది లేదు!**

తనకు జరిగిన అన్యాయంపై ఆ నవవధువు తిరగబడింది. చేతి మెహందీ కూడా ఆరకముందే భర్త ఇంటి ముందే బైఠాయించి న్యాయపోరాటానికి దిగింది. చట్టబద్ధంగా పెళ్లి చేసుకున్న నన్ను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు. నా భర్తతో కలిసి బతికే హక్కును సాధించుకునే వరకు ఈ గడప వదిలి కదిలేది లేదు" అని బాధితురాలు కన్నీటి పర్యంతమవుతూ సింహగర్జన చేసింది.



గ్రామంలో ఉద్రిక్తత.. పోలీసుల జోక్యం

పెళ్లి బట్టలతో నవవధువు రోడ్డుపై ధర్నాకు దిగడంతో అనంతపురంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని, అబ్బాయి కుటుంబ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు.

# బడిపిల్లల పాలిట 'అక్షర దేవత'

- సొంత డబ్బులతో స్కూల్ బ్యాగుల పంపిణీ!
- జాంపల్లి హెచ్ఎం రేవతి ఉదారత
- 23 మంది చిన్నారులకు అండగా నిలిచిన వైనం
- ఆర్థిక ఇబ్బందులు చదువుకు అడ్డంకి కాకూడదన్నదే లక్ష్యం

ధరూర్, జూలై 15 (వుదయం బ్యూరో):

పేదరికం ఆ పిల్లల చదువుకు శాపంగా మారకూడదని భావించారామె. అమ్మలా ఆలోచించి.. ఆ చిన్నారుల భుజాలపై ఉన్న పుస్తకాల భారాన్ని తన బాధ్యతగా మార్చుకున్నారు. జాంపల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు పరుమాల రేవతి తన ఉదారతతో అందరి హృదయాలను గెలుచుకున్నారు. బుధవారం ఆమె తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన రూ.10 వేల విలువైన స్కూల్ బ్యాగులను 23 మంది నిరుపేద విద్యార్థులకు పంపిణీ చేసి పెద్ద మనసు చాటుకున్నారు. ఈ ఆదర్శవంతమైన కార్యక్రమానికి విచ్చేసిన ఎంఈఓ పి. రవీంద్రబాబు స్వయంగా పిల్లలకు బ్యాగులు అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బడి తోటను చూసి హెచ్ఎం రేవతిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహుళ తరగతుల బోధనలో రాణిస్తూనే, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచుతున్న రేవతి సేవలు చిరస్మరణీయ మన్నారు. సమాజంలో ఇటువంటి ఉపాధ్యాయులు ఉండటం విద్యార్థుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఖాజాబీ, ధరూర్ హెచ్ఎం యోగేందర్, సీఆర్‌పీ నరసింహులు, తల్లిదండ్రులు పాల్గొని హెచ్ఎంకు కృతజ్ఞతలు తెలిపారు.




# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, జూలై 15 (వు దయం) :

పేదల సంక్షేమమే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది మహిళలను మహారాణులుగా మారుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పేర్కొన్నారు మండల పరిధిలోని కుప్పగండ్ల, పెద్దాపూర్ గ్రామాలలో లబ్ధిదారులకు మంజూరు చేయించిన నూతన ఇందిరమ్మ గృహాలను దీంతోపాటు మహిళా శక్తి భవనాలను ప్రారంభించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు రమేష్ ముదిరాజ్, కేశ మల్ల అనూష కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





# దత్తాత్రేయుడే ఆది గురువు

- శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్....

వుదయం న్యూస్ శివ్వంపేట జూలై 15....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో నేడు దత్తాత్రేయ జననం గురించి. శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ ఇలా వివరిస్తూ. పత్రి మహర్షి పత్నులలో అనసూయ ను పరీక్షించడానికి మూరు వేషంలో వచ్చిన త్రిమూర్తులు. అకలితో వెళ్ళిపోతే ఆమె అత్రిమహర్షి ఆదేశాన్ని మీరినట్లవుతుంది. అంతేగాక, అకలితో తిరిగిపోయిన అతిథి, గృహస్థు పుణ్యాన్ని, తపస్సును తీసుకుపోతాడని శాస్త్రం. కాని పరపురుషుల యెదుటకు నగ్నంగా వస్తే పాతివ్రత్య భంగమవుతుంది! పరస్పర విరుద్ధమైన ధర్మాల మధ్య తనను చిక్కించుకోజూచిన అతిథులు సామాన్యులు కారని ఆమె వెంటనే గ్రహించింది. వారి విచిత్రమైన షరతుకు ఆమె తనలో తానే నవ్వుకుంది. అయ్యలారా అలానే చేస్తాను. భోజనానికి లేవండి! అని చెప్పి ఆశ్రమం లోపలకు వెళ్లి, అత్రి మహర్షి పాదుకలతో, స్వామి, 'నేను మీ ఆజ్ఞ మేరకు వారు నా బిడ్డలన్న భావంతో భోజనం వడ్డిస్తాను. అని చెప్పుకొన్నది. ఆమెయొక్క పాతివ్రత్య మహిమాన్వితమైన సంకల్పం వలన ఆమె భోజనం వడ్డించడానికి వెళ్లేసరికి ఆ ముగ్గురు పసిపిల్లలయ్యారు. ఆమె భావాన్నను సరించి ఆమెకు బాలింతరాలకు వలె స్తన్యమొచ్చింది. ఆమె ఆ వెంటనే వస్త్రాలు ధరించి ఆ బిడ్డలకు పాలిచ్చింది. ఆ మహా పతివ్రత తన దివ్యదృష్టివలన వారు త్రిమూర్తులు అని తెలుసుకొని ఊయాలలో పెట్టి, ఆ జరిగిన కథనే జోలగా పాడుచున్నది.

ఇంతలో అత్రి మహర్షి వచ్చి, ఆమె నుండి సర్వము తెలిసికొని ఊయలలోని త్రిమూర్తులను దర్శించి, ఆ రూపాలలో ప్రకటమైన పరమాత్మను యిలా స్తుతించాడు. 'ఓ మహావిష్ణు! ఈవు సృష్టిస్థితిలయ కారణుడవు. జగత్సాక్షివి, విశ్వమయుడవు. విశ్వాధరుడవు. ఓ పరమేశ్వర! నీవు సహజంగా ఒక్కడవే అయినా నీ లీలచేత త్రిమూర్తులుగా మారి క్రీడిస్తున్నావు. వాస్తవానికి ఈ జగత్తు నీ కంటె వేరుగాకపోయిన, మనక చీకటిలోని త్రాడు దానికి భిన్నమైన పాముగా గోచరించినట్లు, 'నేనువారు' అనే మాయతో గూడిన భావన వలన నీకంటె వేరైనట్టు జీవులకు గోచరిస్తున్నది. ఊయలలోని త్రిమూర్తులు ఆ స్తోత్రానికి తృప్తిచెంది, తమ నిజరూపాలతో ప్రత్యక్షమై. వరం కోరుకోమన్నారు. అప్పుడు అత్రి మహర్షి భార్యవైపు చూస్తూ 'సాధ్వీ.. వీరు మనస్సు చేతగూడ పొందడానికి వీలుగానివారు. నీ అభీష్టమేమిటో నివేదించుకో' అన్నాడు. అనసూయ నీ భక్తి వలన ఇలా వచ్చారు. నీ సృష్టి స్థితి లయ వికారం కోసమే మీరు భగవంతుని చేత సృష్టించబడ్డారు. కనుక ఈ మూడు మూర్తులుగా ప్రత్యక్షమైన వీరిని పుత్రులుగా పొంది, మీ అవతార రకార్యం నెరవేర్చుకోవడమే నా అభీష్టము అన్నది. అత్రిమహర్షి సంతోషించి, మీరు మాకు పుత్రులుగా పుట్టి మమ్ముద్ధరించండి. అని కోరాడు. అపుడు వారు మహర్షీ మమ్ము నీకు సంపూర్ణంగా దత్తం చేసుకున్నాము. ఆ తర్వాత అత్రి అనసూయలకు దత్తాత్రేయుడు జన్మిస్తాడు. ఈయన సాక్షాత్తు పరమేశ్వరుడే; శ్రుతులకు గూడ అందని సచ్చిదానంద స్వరూపుడు; మానవుల అభీష్టాలు నెరవేర్చి యోగము, జ్ఞానము ప్రసాదించేవాడు.స్మరించిన తక్షనంలోనే అనుగ్రహిస్తూ సర్వత్రా సంచరిస్తూఉంటాడు. అలనాటి. దుర్వశ శాపం వల్లనే పరమాత్మైన శ్రీధత్తుడు శాశ్వతంగా భూమి మీద సంచరిస్తూ భక్తులను అనుగ్రహిస్తుంటాడు . అసలు ఆయన అవతరించిందే అందుకు సర్వజనోదరణమేనే దత్తావతర కార్యం సృష్టి ఉన్నంత వరకు కొనసాగాల్సిందే .కనుక దత్తస్వామి అవతారం త్యాగం చేయకుండా నిత్యము భూమిపై సంచరిస్తూటాడు. శ్రీ దత్తాత్రేయుడే ఆది గురువు అని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు. భక్తులు పాల్గొన్నారు.

# బిలాల్ పూర్ గ్రామంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ తో చెరుకు తోట దగ్ధం


కోహీర్ జులై 15 (వుదయం ప్రతినిధి )

కోహీర్ మండలంలోని బిలాల్ పూర్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక ఎకరం చెరుకు తోట పూర్తిగా దగ్ధమైంది.చేనులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగి, పక్కనే ఉన్న చెరుకు తోటకు వేగంగా వ్యాపించాయి.

ఈ అగ్నిప్రమాదంలో సుమారు ఒక ఎకరం చెరుకు తోట పూర్తిగా బూడిదవ్వడంతో పాటు, తోటలో ఏర్పాటు చేసిన విలువైన డ్రిప్ సిస్టమ్ కూడా కాలిపోయింది.చేతికొచ్చిన పంట కళ్ల ముందే కాలిపోవడంతో బిలాల్ పూర్ గ్రామానికి చెందిన రైతు భూషణం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీరుమున్నీరవుతున్నారు.



ప్రమాదం జరగడానికి ముందే కరెంట్ ఏఈ (AE) కి సమాచారం అందించినప్పటికీ, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి నామమాత్రంగా వచ్చి వెళ్లారని రైతు ఆరోపించారు.పెట్టిన పెట్టుబడి కూడా దక్కకుండా పోవడంతో రైతు భూషణం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి తనకు తగిన నష్టపరిహారం అందించి, ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నారు.విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# త్రిప్రాస్ పల్లి గ్రామంలో చట్టాలపై అవగాహన

నారాయణపేట, జూలై 15 (వుదయం ప్రతినిధి):

నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉట్కూర్ మండలం తిప్రాస్ పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయ అవగాహన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని భూసార పరీక్షల వల్ల నేలలో ఏ పోషకాలు ఉన్నాయో తెలుసుకుని అదే ఎరువు వాడితే దిగుబడి పెరుగుతింది అని, ఖర్చు కూడా తగ్గుతుంది అని, ఎరువులు, విత్తనాలు కొనేటప్పుడు బిల్లు తీసుకోవాలి ఏమైనా సమస్య వస్తే బిల్లు ఆధారంగా ఫిర్యాదు చేయడానికి ఉపయోగపడుతుంది అని సూచించారు. ఈ సందర్భంగా నల్సా ఆధ్వర్యంలో అమలవుతున్న అన్ని పథకాల మీద అవగాహన కలిపించారు. బాలల న్యాయ సేవల పథకం, మానసిక వైకల్యుల న్యాయ పథకం, వృద్ధుల న్యాయ సహాయ పథకం, పేద పిల్లల విద్యా పథకం, మహిళల రక్షణ పథకం, ఖైదీల పునరావాస పథకం, వ్యసనాల నుండి విముక్తి పథకం, మహిళల అవగాహన పథకం, హక్కులువిధుల అవగాహన, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పోక్సో చట్టం గురించి, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ ,డ్రగ్స్ తీసుకోవడం వల్ల జరిగే అనర్థాల మరియు పలు చట్టాల మీద అవగహన కలిపించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 గురించి వివరించారు. ఈ శిబిరంలో ఏ.ఈ.ఓ ప్రశాంతి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## బండ్లగూడ ప్రశాంత్ – ఏడో వార్డ్ కౌన్సిలర్ డ్రైనేజీ శాశ్వత పరిష్కారానికి కృషి



శంకర్ పల్లి
జులై 15 (ఉదయం)

శంకర్‌పల్లి మండలంలోని రామంతపూర్ 7వ వార్డులో ఎన్నో రోజులుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను పురస్కరించుకుని బండ్లగూడ ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రైనేజీ నిర్మాణంతో తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని హర్షం వ్యక్తం చేశారు.అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తామని బండ్లగూడ ప్రశాంత్ తెలిపారు.కార్యక్రమంలో మాట్లాడిన 7వ వార్డ్ కౌన్సిలర్ బండ్లగూడ ప్రశాంత్, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్క ఓటరుకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ప్రజలు ఎప్పుడైనా, ఎలాంటి సమస్యతో వచ్చినా 24 గంటలూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. డ్రైనేజీ సమస్య మాత్రమే కాకుండా తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అభివృద్ధే తన లక్ష్యమని, ప్రతి ఇంటికి చేరుకుని వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం ఎంతో కీలకమని బండ్లగూడ ప్రశాంత్ పేర్కొన్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించేందుకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. రామంతపూర్ 7వ వార్డును అన్ని రంగాల్లో ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని చేపడతానని వెల్లడించారు. ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిత్యం వారితో మమేకమై సేవలు అందిస్తానని మరోసారి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ సాతా ప్రవీణ్ కుమార్ వైస్ చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగారెడ్డి శంకర్ పల్లి కమిషనర్ యోగేష్,పట్లోళ్ల ఉపేందర్ రెడ్డి (అడ్వకేట్), పట్లోళ్ల శేఖర్ రెడ్డి, చాకలి అశోక్ (కౌన్సిలర్), పోలీస్ రవీందర్ రెడ్డి, మొరంగుపల్లి శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ సి. వెంకట్ రెడ్డి, జానంపేట రాములు, గౌడ్ ఆనంద్, జే. ఆంజనేయులు, పట్లోళ్ల సాయికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తికావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు ఇదే విధంగా కొనసాగాలని ఆకాంక్షించారు. బండ్లగూడ ప్రశాంత్ నాయకత్వంలో 7వ వార్డులో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరారు.

## రక్షణ సేనలోకి భారీ చేరికలు

- కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న యువ నాయకులు, కార్యకర్తలు
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని నీరుడు సర్వేష్ పిలుపు

గండిపేట్,
జూలై 15 (ఉదయం):



రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గండిపేట్ మండల పరిధిలో బుధవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో భారీ చేరికల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బండ్లగూడ జాగీర్, వట్టినాగులపల్లి గ్రామాలతో పాటు సంగారెడ్డి ప్రాంతానికి చెందిన పలువురు యువ నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువకులు నీరుడు సర్వేష్ ముదిరాజ్ నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు.పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సేవలో భాగస్వాములవుతామని ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజకీయాల్లో పదవుల కోసం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకత్వం అవసరమని అన్నారు. ఎక్కడ ప్రజలకు సమస్యలు ఎదురైనా అక్కడ పార్టీ నాయకులు ముందుండి వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పార్టీ కార్యకర్తలు పనిచేయాలని, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సమస్యలు పరిష్కరించడానికి పదవులు అవసరం లేదని, సేవా దృక్పథమే ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకుడు నీరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, యువతకు అవకాశాలు కల్పించడం మరియు ప్రజా సమస్యల పరిష్కారమే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై విశ్వాసం ఉంచి యువత పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ ముందుకు సాగుతుందని, ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేసి ప్రజల మధ్యనే ఉండే రాజకీయాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ నీరుడు సర్వేష్ ముదిరాజ్ హృదయపూర్వక స్వాగతం పలికారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు.గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రతి అంశంపై స్పందిస్తూ, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ప్రజల విశ్వాసమే పార్టీకి అసలైన బలం అని ఆయన అన్నారు.ఈ భారీ చేరికలతో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీకి మరింత బలం చేకూరిందని పార్టీ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.బండ్లగూడ జాగీర్, వట్టినాగులపల్లి, సంగారెడ్డి ప్రాంతాల నుంచి యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరడం పార్టీపై పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో మరింత మంది ప్రజలు, యువ నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.ప్రజల కోసం నిరంతరం పోరాడే రాజకీయ శక్తిగా తెలంగాణ రక్షణ సేన ఎదుగుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## దుండిగల్‌లో సర్ ప్రక్రియను పరిశీలించిన



- కొలన్ హన్మంత్ రెడ్డి

దుండిగల్,
జులై 15,(ఉదయం ప్రతినిధి ),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ డివిజన్ లో కొనసాగుతున్న సర్ (ఓటరు సవరణ ప్రక్రియ) కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు సవరణ ప్రక్రియలో పాల్గొని, బూత్ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించేందుకు ఓటరు సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించి ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి, 296 దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ రావు గౌడ్, బొట్ల విజయకుమార్, మహేందర్ యాదవ్, కావలి శశి కుమార్, పీఏస్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆకుల ప్రేమ్ కుమార్, బాబు, చిన్న ముత్యం రెడ్డి, మధు, జక్కుల కృష్ణ, సిరిగల బాబు, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.40 లక్షలతో రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



కుత్బుల్లాపూర్,
జులై 15,(ఉదయం ప్రతినిధి ),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మిథిలా నగర్‌లో రోడ్ల అభివృద్ధి పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పనులను ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం (సీఎంపీ) నిధుల నుంచి రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల్లో రోడ్ నెం.8 (వాటర్ ట్యాంక్ ఎదురుగా), రోడ్ నెం.14 (నారాయణ స్కూల్ ఎదురుగా) రోడ్ల అభివృద్ధి చేపట్టనున్నారు. ఈ నిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక కృషి ఫలితంగా మంజూరైనట్లు స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గం లోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపురం అధ్యక్షులు సిద్ధనొళ్ల సంజీవ్ రెడ్డి, బహదురుపల్లి అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, మిథిలా నగర్ అసోసియేషన్ సభ్యులు కృష్ణా రెడ్డి, ప్రవీణ్ జడ్డూ, జనార్ధన్ రెడ్డి, శివాజీ, భీమేష్, ధనుంజయ్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, అలాగే విజయ్ రెడ్డి, బజ్జీ, నాగరాజు, సురేష్, సాత్విక్, విజయ్, వాలి, దిలీప్, తిరుమల, రాజశేఖర్, వెంకటేశ్వర్లు రెడ్డి, సందీప్, సతీష్, గోనా రెడ్డి, సంతోష్, సుబ్బు, సురేంద్ర, వెంకట్ రావు తదితరులు, ఆర్.కె. టౌన్‌షిప్, మిథిలా నగర్, శిల్పా లే అవుట్ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి ఎల్ఓసి చెక్కుల పంపిణీ



కుత్బుల్లాపూర్,
జులై 15,(ఉదయం ప్రతినిధి ),

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.75,000/ విలువైన ఎల్ఓసి చెక్కును 126వ డివిజన్ మక్దూం నగర్ నివాసి సాయిదాఆరియానా సయ్యద్ అసదుల్లా కు డివిజన్ మాజీ కార్పొరేటర్కోలుకుల జగన్ లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తోందని, అత్యవసర వైద్య చికిత్సలతో పాటు ఇతర క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు ఈ పథకం గొప్ప భరోసానిస్తోందని అర్హులైనా ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో 126వ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, వేణు యాదవ్, మహమ్మద్ అజమ్, మెట్ల శ్రీను, నాని, దినేష్ సింగ్, అభిషేక్, బిఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



సంగారెడ్డి
జులై 15 (ఉదయం )

సంగారెడ్డి జిల్లా బీజేపీ ఇంచార్జి శ్రీనివాస్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలిసి బుధవారం నారాయణపేట జిల్లాలో శ్రీనివాస్ ను ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ దేశ్ పాండే తదితరులు తదితరులు ఉన్నారు.

## చందిప్పలో రోడ్డు మరమ్మతుల పనులు

- సర్పంచ్ మాధోల్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యయంతో రోడ్డు అభివృద్ధి పనుల ప్రారంభం
- ప్రముఖ వ్యాపారవేత్తల సహకారంతో చందిప్ప గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం
- సర్పంచ్ మాధోల్ల మల్లికార్జున్ నాయకత్వంలో గ్రామాభివృద్ధికి మరో ముందడుగు

శంకర్‌పల్లి,
జూలై 15(ఉదయం)



శంకర్‌పల్లి మండల కేంద్రంలోని చందిప్ప గ్రామంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల పనులకు గ్రామ సర్పంచ్ మాధోల్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామంలో రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారడంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ మాధోల్ల మల్లికార్జున్, ఉప సర్పంచ్ లింగంపల్లి లక్ష్మీ నర్సింలు, వార్డు సభ్యులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మరమ్మతుల పనులను ప్రారంభించారు.గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు.ఈ రోడ్డు మరమ్మతుల పనులకు ప్రముఖ వ్యాపారవేత్తలు సాయి గౌరవ్, ధీరజ్, సాయి నిమ్మగడ్డ సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఆర్థిక సహకారం అందించడం విశేషం. గ్రామాభివృద్ధికి సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన దాతలను గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు .ఈ పనులు పూర్తయితే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెట్‌కు తరలించడంతో పాటు ప్రజల రాకపోకలు కూడా మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, దాతలు, గ్రామస్థులు కలిసి పనిచేయడం చందిప్ప గ్రామానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.రహదారుల మరమ్మతులతో ప్రమాదాలు తగ్గడంతో పాటు గ్రామంలో అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అన్ని మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి కొనసాగుతుందని సర్పంచ్ మాధోల్ల మల్లికార్జున్ తెలిపారు.రోడ్డు మరమ్మతుల ప్రారంభ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధోల్ల మల్లికార్జున్, ఉప సర్పంచ్ లింగంపల్లి లక్ష్మీ నర్సింలు, వార్డు సభ్యులు ప్రభావతి సురేష్, ఈ. అనంతయ్య, జ్యోతి శ్రీరామ్, సి.హెచ్. బాలరాజు, డి. అనంతయ్య, రాఘవేందర్ గౌడ్, సబితా రవి, గ్రామ పెద్దలు శేఖర్ రెడ్డి, కె. మహేందర్, చంద్రయ్య, శేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.రోడ్డు పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వారు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు

## 20 వేల పోస్టులతో ఎస్ఐ, పీసీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తాం: తెలంగాణ నిరుద్యోగ జేఏసీ

ముషీరాబాద్,
జూలై 15(ఉదయం)

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 20 వేల పోస్టులతో ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ (పీసీ) నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయకపోతే రెండు రోజుల అనంతరం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎవరెస్ట్ ఇన్‌స్టిట్యూట్ సమీపంలో సత్యాగ్రహ దీక్షకు దిగనున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ ప్రభుత్వం మొండివైఖరి కొనసాగిస్తే, ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం మాత్రమే కాకుండా, "కాంగ్రెస్ హటావో - తెలంగాణ బచావో" పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి చౌరస్తాలో డప్పు చప్పుళ్లతో ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన నిరుద్యోగ యువతే, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.
ఇంకా ప్రభుత్వం స్పందించకపోతే, ఢిల్లీ కేంద్రంగా "కాంగ్రెస్ హటావో - తెలంగాణ బచావో - దేశ్ బచావో" నినాదాలతో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని మోతీలాల్ నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నేత వినోద్ నాయక్, ఝాన్సీ, కౌశిక్, రాజు, విక్రమ్, శ్రీనివాస్, రంగా నాయక్, సాయి ప్రణత్, ప్రదీప్, పోలీస్ జేఏసీ ప్రతినిధి నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నాల పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.20 వేల విరాళం



- అందజేసిన వంగ రాజేశ్వర్ రెడ్డి
- కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ సభ్యులు

ఉదయం, సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని వంగ రాజేశ్వర్ రెడ్డి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముదిరాజ్ సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు తన వంతు సహాయంగా రూ.20 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించినందుకు ముదిరాజ్ సంఘం, ఆలయ కమిటీ సభ్యులు వంగ రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి,
జులై 15,(ఉదయం ప్రతినిధి ),



మాదక ద్రవ్యాల వ్యసనం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని శారీరక, మానసిక సమస్యలకు గురిచేస్తుందని డ్రగ్స్ నివారించడానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్ విసి హాల్ లో ఏర్పాటు చేసిన మాదక ద్రవ్య నిర్మూలన సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని అందులో భాగంగా సంక్షేమ శాఖల అధికారులు ప్రతి నెల బాలుర హాస్టల్స్ లో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై వైద్య శాఖ వారు తగిన విధంగా అవగాహన కల్పించాలని అవసరమైన మేరకు వైద్య సదుపాయం కల్పించాలన్నారు. డ్రగ్స్ వాడకంతో కలిగే మానసిక, శారీరక సమస్యల పై ప్రజలలో అవగాహన కల్పించాలని, పోలీసు శాఖ వారు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, సున్నితమైన ప్రదేశాలలో సమర్థవంతమైన నిఘాతో డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో, కాలేజీలపై ప్రత్యేక నిఘాతో పర్యవేక్షించాలని సంబంధిత శాఖల వారు ప్రణాళిక కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని తద్వారా నిర్వహించిన కార్యక్రమాల వివరాలను తమకు తెలియజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లాను ముందుంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పద్మజా, డ్రగ్ ఇన్స్పెక్టర్ మౌనిక, అడిషనల్ డిసిపిలు, కుత్బుల్లాపూర్ పురుషోత్తం, కూకట్ పల్లి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## కావ్య హోటల్‌ను ప్రారంభించిన వంగ రాజేశ్వర్ రెడ్డి


ఉదయం, సిద్దిపేట ప్రతినిధి



సిద్దిపేట పట్టణంలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కావ్య హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన హోటల్‌ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... వినియోగదారులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షిం మరింత అభివృద్ధి సాధించాలని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి సంస్థలు మరిన్ని ఏర్పడాలని అన్నారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, హోటల్ నిర్వాహకులు పాల్గొన్నారు. హోటల్ విజయవంతంగా కొనసాగాలని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

IN THE COURT OF THE V ADDL.JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS :: AT HYDERABAD
O.S.NO. 1713 OF 2026
*Between:*
Smt.Sunanda Nandyala and two others .... Plaintiffs
AND
Mandal Revenue Officer and another .... Defendants
To
All Concerned
Take notice that the above said Plaintiffs for declaration, to declare them as the legal heirs of late Nandyala Lakshmi Reddy, who died on 07-01-2019, on the above mentioned court and the matter stood posted to 24-07-2026 for objections from anybody. If no objection is received, it will be decided in accordance with law.
*(BY ORDER OF THE COURT)*
Sd/-
B. RAVISHANKAR, Advocate
#305-C, Pancom Business Centre, Ameerpet X Roads Hyderabad-500 073.
Cell NO.9849131453.

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.S. No. 1906 OF 2026
Between:
1) Smt. P. SANGEETHA LAXMI W/o. Late Sri P. Naveen Kumar (wife), aged about 43 years, Occ: Employee,
2) Kum. P. SRITHA VARALIKA D/o Late Sri P. Naveen Kumar (Daughter), aged about 13 years, occ: Student,
3) Kum. P. SREEHITHA SAI, D/o. Late Sri P. Naveen Kumar(Younger Daughter) aged about 12 years, occ: Student,.Petitiner no.2 & 3 are represent by her natural mother Petitioner no.1, Smt.P.SANGEETHA LAXMI, W/o.Late Sri P.Naveen Kumar, All are H.No.2-2-1146/5, Shri Nilayam, Shivam Road, Opp: line to Dhruv Elite, New Nallakunta, Hyderabad. ...PLAINTIFFS
AND
1) THE MANDAL REVENUE OFFICER/ Tahsildar Amberpet Mandal, Amberpet, Hyderabad.
2) All Concerned. ....DEFENDANTS
To,
ALL CONCERNED
Please take notice that the above Plaintiffs herein have filed the above Suit for declaration of Plaintiffs as legal heirs of Late Sri P.Naveen Kumar, who died intestate on 06.06.2025. The above Said case is posted to 06.08.2026 at 10.30 am, if anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.
( BY ORDER OF THE COURT )
S.MADHUSUDHAN RAO, Advocate, office at Law Chambers, Bank Street, Kothi, Hyd-44, Cell.9848390066




**అన్ని శక్తులూ ఏకం కావాలి**

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అందరికీ తెలిసినవే. దేశ వ్యాప్తంగా బీజేపీ ఎలా విస్తరిస్తోందో వివిధ రాష్ట్రాల ఉదాహరణలు ఉన్నాయి. బీజేపీ ప్రమాదాన్ని, ఫాసిస్టు ఆర్‌ఎస్‌ఎస్‌ను ఎదుర్కోవడానికి, దాన్ని ఓడించడానికి దేశంలోని అన్ని లౌకిక, ప్రజాస్వామ్య రాజకీయ శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉంది. పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలను పక్కన పెట్టి, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా పని చేయడానికి ప్రతిపక్ష పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలి. దీనికి అన్ని ప్రతిపక్ష పార్టీలు బాధ్యత వహించాలి.

--ఎం.ఏ.బేబీ, సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి

## వేమన పద్యం

**పట్టుపట్టరాదు పట్టి విడువరాదుపట్టే**
**నేని బిగియ బట్టవలయుబట్టివిడు**
**చుకన్న బరగ జచ్చుటమేలు**
**విశ్వదాభిరామ! వినురవేమ!**



## సంపాదకీయం

# పతనం దిశగా ఆర్థిక వ్యవస్థ

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ప్రచార ఆర్భాటం చేస్తున్నా, అదే ప్రభుత్వం తరఫున కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మాత్రం మరో వాస్తవాన్ని బయటపెట్టాయి. విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి, ముడి చమురు ధరల అనిశ్చితి, ఎరువుల వ్యయం పెరుగుదల, వర్షాభావం ముప్పు వంటి అంశాలపై ఆమె వ్యక్తం చేసిన ఆందోళన దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ల తీవ్రతను తెలియజేస్తోంది. అంతకంటే ముఖ్యంగా విదేశీ మూలధనాన్ని ఆకర్షించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటామని ప్రకటించడం దేశీయ ఆర్థిక పునాదుల బలహీనతను పరోక్షంగా అంగీకరించినట్టే. ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే విదేశీ పెట్టుబడుల కోసం ఇంత ఆత్రుత అవసరం ఉండదు. దేశీయ డిమాండ్, ప్రజల కొనుగోలు శక్తి, ఉపాధి అవకాశాలు, వ్యవసాయ ఉత్పత్తి, చిన్న పరిశ్రమల వృద్ధి ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారాలు. కానీ ప్రస్తుతం ఇవన్నీ ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్నాయి. జీడీపీ వృద్ధి గణాంకాలు పెరుగుతున్నాయని చెబుతున్నప్పటికీ ప్రజల జీవితాల్లో ఆ అభివృద్ధి కనిపించడం లేదు. నిరుద్యోగం పెరుగుతోంది. వేతనాల పెరుగుదల నిలిచి పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం తగ్గుతోంది. మధ్యతరగతి కుటుంబాలు విద్య, వైద్యం, గృహ వ్యయాల భారంతో ఇబ్బందులు పడుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణం గత పదేళ్లుగా కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలే. నోట్ల రద్దు, అస్తవ్యస్త జీఎస్టీ అమలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేట్ పన్నుల తగ్గింపు వంటి నిర్ణయాలు పెద్ద వ్యాపార వర్గాలకు లాభం చేకూర్చినా, చిన్న పరిశ్రమలు, అసంఘటిత రంగం, స్వయం ఉపాధి రంగాలను తీవ్రంగా దెబ్బతీశాయి. కోట్లాది మంది ఆధారపడే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. ప్రస్తుతం కేంద్రం విదేశీ పెట్టుబడులను అభివృద్ధికి ప్రధాన ఇంధనంగా చూపిస్తోంది. విదేశీ మూలధనం అవసరం లేదని ఎవరూ చెప్పడం లేదు. కానీ దేశీయ ఆర్థిక శక్తిని పక్కనబెట్టి విదేశీ పెట్టుబడులపైనే ఆధారపడటం ప్రమాదకరం. విదేశీ కార్పొరేట్లు లాభాల కోసం వస్తాయి. లాభాలు కనిపించక పోతే వెనక్కి వెళ్లిపోతాయి. ప్రపంచ మార్కెట్లలో చిన్న మార్పు వచ్చినా పెట్టుబడుల ప్రవాహం ఆగిపోవచ్చు. అలాంటి పరిస్థితుల్లో దేశీయ ఉత్పత్తి, దేశీయ మార్కెట్, ప్రజల కొనుగోలు శక్తి బలహీనంగా ఉంటే ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలోకి జారిపోతుంది. ఇక దేశంలో సంపద పంపిణీ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. కొద్దిమంది కార్పొరేట్ సమూహాల చేతుల్లో ఆర్థిక శక్తి కేంద్రీకృతమవుతోంది. పోర్టులు, విమానాశ్రయాలు, విద్యుత్, గనులు, మౌలిక సదుపాయాలు, టెలికాం వంటి కీలక రంగాలలో పెద్ద కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగింది. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సమూహాల ఆస్తులు అపూర్వ స్థాయిలో పెరుగుతుంటే, మరోవైపు కోట్లాది మంది ప్రజలు ఉపాధి, ఆదాయం కోసం పోరాడుతున్నారు. ఈ అసమానతలు పెరుగుతున్న కొద్దీ ఆర్థిక వ్యవస్థలో అంతర్గత బలహీనతలు కూడా పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తరచూ భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని చెబుతోంది. కానీ ప్రజలు అడుగుతున్న ప్రశ్న వేరే. *జీడీపీ పెరిగితే ఉద్యోగాలు పెరిగాయా? రైతుల ఆదాయం రెట్టింపైందా? యువతకు ఉపాధి లభించిందా? మహిళల ఉపాధి పరిస్థితి మెరుగుపడిందా? ఆకలి, పేదరికం తగ్గాయా?* అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంది. గణాంకాల్లో కనిపించే అభివృద్ధి ప్రజల జీవితాల్లో కనిపించకపోతే ఆ గొప్పలు కాగితాలకే పరిమితం అవుతాయి. నిర్మలా సీతారామన్ ప్రస్తావించిన చమురు ధరలు, విదేశీ మారక నిల్వలు, వర్షాభావం వంటి అంశాలు నిజంగానే సవాళ్లే. కానీ వాటికంటే పెద్ద సవాలు దేశీయ డిమాండ్ బలహీనత. ప్రజల చేతుల్లో డబ్బు లేకపోతే మార్కెట్ కదలదు. మార్కెట్ కదలకపోతే పెట్టుబడులు రావు. పెట్టుబడులు లేకపోతే ఉపాధి పెరగదు. ఈ చక్రాన్ని విరగదీయకుండా విదేశీ మూలధనంపై ఆశలు పెట్టుకోవడం సమస్యకు తాత్కాలిక పరిష్కారం మాత్రమే. ఇప్పుడు దేశానికి అవసరమైంది కార్పొరేట్లకు మరిన్ని రాయితీలు కాదు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచే విధానాలు. వ్యవసాయానికి గిట్టుబాటు, చిన్న పరిశ్రమలకు రక్షణ, ప్రభుత్వ రంగ బలోపేతం, యువతకు ఉపాధి, ప్రజా పెట్టుబడుల విస్తరణ. అభివృద్ధి ఫలాలు కొద్దిమందికి కాకుండా సమాజంలోని మెజారిటీ ప్రజలకు చేరినప్పుడే ఆర్థిక వ్యవస్థ నిజంగా బలపడుతుంది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

గ్రామదేవతల పూజలకు ఉద్దేశిత మైనది, తెలుగు జానపదుల సంస్కృతిక వైభవానికి ఉత్తుంగ శిఖరంలా నిలుస్తున్నది బోనాల పండుగ. ఇది తెలంగాణ సాంప్రదాయాల ప్రత్యేకతను, విశిష్టతను చాటిచెప్పే పండగ. జూలై లేదా ఆగస్టు మాసంలో వచ్చే ఆషాడం వచ్చిందంటే, తెలంగాణ లోని అన్ని ప్రాంతాలలో జాతర సందడి నెలకొంటుంది. ఎక్కడ చూసినా భక్తిశ్రద్ధలతో మహిళలు సమర్పించే బోనాలే దర్శన మిస్తాయి. ప్రాచీన కాలంలో ఋతువులు మారి, ఆషాడంలో వర్షాలు కురిసి, వాతావరణ మార్పులతో, కలరా ప్లేగు లాంటి మహమ్మారి వ్యాధులు సంక్రమించే క్రమంలో, వైద్య సౌకర్యాలు లేని స్థితిలో, దేవతలను కొలవడం జరిగేది. 1813 లో భాగ్యనగరంలో వేలాది మంది గురైన సందర్భంలో, మహంకాళిని కొలవడం వల్ల వ్యాధి తగ్గుముఖం పట్టిందని, అప్పటి నుండి రాష్ట్ర రాజధాని లోనూ, బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు వాడుక. గోల్కొండ కోటలో జగదాంబికా ఆలయంలో, అబుల్ హసన్ తానీషా పాలనా సమయంలో, ప్రధాని సైనికాధికారులుగా ఉన్న అక్కన్న, మాదన్నల కాలంలో, బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లు కథనాలు. 1908లో మూసీకి వరదలు వచ్చినప్పుడు, నిజాం మీర్ మెహబూబ్ అలీ ఖాన్, మంత్రి కిషన్ ప్రసాద్ ను, ఏమి చేయాలని సలహా కోరగా, ఇది అమ్మవారి ఆగ్రహం ఫలితమేనని, ఆమెను శాంతింప చేయడానికి, పూజలు నిర్వహించాలని మంత్రి, ప్రభువుకు వివరించిన సందర్భంలో, నిజాం ప్రభువు లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, ముత్యాలు, పట్టు వస్త్రాలు, సమర్పించి పూజలు నిర్వహించిన ఫలితంగా, వరదలు తగ్గుముఖం పట్టాయని చెబుతారు. తర్వాత కాలంలో, స్థానికులు సదరు ఆలయాన్ని పునరుద్ధరించి, 1968లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువులచే, విగ్రహ ప్రతిష్ట చేయించడం జరిగింది. 7వ నిజాం కాలం నుండి, సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయం లో, బోనాల ఉత్సవాలు జరుగు తున్నాయి. హైదరాబాద్ లో ప్రస్తుతం వందలాది చిన్న, పెద్ద ఆలయాలలో ఉత్సవాలు కొనసాగు తున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావ అనంతరం,



తెలంగాణ సాంస్కృతిక వారసత్వ అనుసరణీయమైన పండగైన బోనాలను, "రాష్ట్ర పండుగ"గా నిర్వహిస్తున్నారు. "భోజనం" ప్రకృతి కాగా "బోనం" వికృతి. జానపదులు తమకు ఇష్టమైన గ్రామ దేవతలకు సమర్పించే "నివేదనలే బోనాలు". పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, అంకాలమ్మ, డొక్కలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ, నాయకమ్మ, మొదలైన పేర్లతో పిలిచే దేవతల గుళ్ళను, ఈ సందర్భంగా దేదీప్యమానంగా అలంకరిస్తారు. బోనాన్ని కొత్త కుండలో వండి, దానితోపాటు పాలు, పెరుగు, బెల్లం, కొన్ని చోట్ల ఉల్లిపాయలతో కలిపిన బోనాన్ని, మట్టి లేక రాగి కుండలో నుంచి తమ తలపై ఉంచుకొని, ఆటగాళ్ళతో, డప్పుల తదితర వాద్యాలతో, గుడికి చేరుకుంటారు. ఈ బోనాల కుండలను, చిన్న చిన్న వేప రెమ్మలతో, పసుపు, కుంకుమ లేక తడి తెల్ల ముగ్గుతో, అలంకారం చేసి, దానిపై దీపాన్ని ఉంచుతారు. ఆషాడ మాసంలో అమ్మవారు తన పుట్టింటికి వెళుతుందని గ్రామీణుల విశ్వాసం. అందుకే తమ కూతురు తమ సొంత ఇంటికి లేదా ఆమె పుట్టింటికి వచ్చిన భావనతో ప్రేమానురాగాలు, పుట్టి పడగా, భక్తిశ్రద్ధలను మేళవించి, బోనాలను నివేదిస్తారు. గత కొంత కాలంలో వేరు వేరు ప్రాంతాలలో దీనిని "పెద్ద పండగ", "ఊర పండగ" లాంటి పేర్లతో పిలిచేవారు. తర్వాతి కాలాన బోనాలుగా పిలుస్తున్నారు. పూర్వకాలంలో దుష్టశక్తులను పారద్రోలేందుకు, ఆలయ ప్రాంగణం బలి ఇవ్వడం జరిగేది. నేడు యాటల పేరున మేకలను లేదా కోడిపుంజులను బలి ఇవ్వడం ఆచారమైంది. పండుగ సందర్భంగా, స్త్రీలు కొత్త బట్టలు, పట్టు చీరలు, నగలు ధరించి, బోనాలు మోస్తూ వెళుతుండగా, మోసుకెళ్తున్న కొందరికి పూనకం (అమ్మవారు ఆ వహిస్తారని నమ్మక) రాగా, వారిని శాంతింప చేసేందుకు, ఆలయ సమీపాన వారి పాదాలపై నీళ్ళు కుమ్మరిస్తారు. అమ్మవారి ఇ సోదరుడైన పోతరాజును, ప్రతిబింబించే ఒక బలిష్టకాయుడు, ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాళ్ళకు గజ్జలు కలిగి, చిన్న ధోవతి ధరించి, వాద్య ధ్వనులకు అనుగుణంగా నర్తిస్తాడు. పూజారంభకునిగా, భక్త జన రక్షకునిగా భావించబడతాడు. కొరడాలతో కొట్టుకుంటూ, వేపాకులను చుట్టుకుని, పూనకం వచ్చిన భక్తులను, అమ్మవారి సన్నిధికి తీసుకెళ్తాడు. అమ్మవారికి నివేదన అనంతరం విందు భోజనాలు ఆరగిస్తారు. ఈ కార్యక్రమంలో జాతర అనంతరం, పోతరాజుకూ పూనకం రాగా, వికృతమైన ఆగ్రహాన్ని శాంత పరచుటకు, కొమ్ములున్న మేకపోతును అందించగా, పోతరాజు తన దంతాలతో, మేక తల మొండెం వేరు చేసి, పైకి ఎగరవేస్తారు. పండుగ మొదటి రోజు నుండి, చివరి నిమజ్జనం దాకా, అత్యంత భక్తి తత్పరతతో వాతావరణం ఉంటుంది. బోనాల సమర్పణ వల్ల, ప్రధానంగా దేవతలు శాంతించి, అంటు రోగాల బారిన పడకుండా కాపాడుతానని భక్తుల విశ్వాసం.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన 2026 ఆషాఢ బోనాలు జూలై 16 నుం\డి ఆగస్టు 13 వరకు వైభవంగా జరుగుతాయి. తొలి బోనం జూలై 16న గోల్కొండ కోటలో ప్రారంభం కాగా, ప్రధాన ఉత్సవాలు ఆషాఢ ఆదివారాలైన జూలై 19, 26 మరియు ఆగస్టు 2, 9 తేదీల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతాయి.

*తెలంగాణ సాంప్రదాయాల ప్రత్యేకతను, విశిష్టతను చాటిచెప్పే పండగ. జూలై లేదా ఆగస్టు మాసంలో వచ్చే ఆషాడం వచ్చిందంటే, తెలంగాణ లోని అన్ని ప్రాంతాలలో జాతర సందడి నెలకొంటుంది. ఎక్కడ చూసినా భక్తిశ్రద్ధలతో మహిళలు సమర్పించే బోనాలే దర్శన మిస్తాయి. ప్రాచీన కాలంలో ఋతువులు మారి, ఆషాడంలో వర్షాలు కురిసి, వాతావరణ మార్పులతో, కలరా ప్లేగు లాంటి మహమ్మారి వ్యాధులు సంక్రమించే క్రమంలో, వైద్య సౌకర్యాలు లేని స్థితిలో, దేవతలను కొలవడం జరిగేది. 1908లో మూసీకి వరదలు వచ్చినప్పుడు, నిజాం మీర్ మెహబూబ్ అలీ ఖాన్, మంత్రి కిషన్ ప్రసాద్ ను, ఏమి చేయాలని సలహా కోరగా, ఇది అమ్మవారి ఆగ్రహం ఫలితమేనని, ఆమెను శాంతింప చేయడానికి, పూజలు నిర్వహించాలని మంత్రి, ప్రభువుకు వివరించిన సందర్భంలో, నిజాం ప్రభువు లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, ముత్యాలు, పట్టు వస్త్రాలు, సమర్పించి పూజలు నిర్వహించిన ఫలితంగా, వరదలు తగ్గుముఖం పట్టాయని చెబుతారు. తర్వాత కాలంలో, స్థానికులు సదరు ఆలయాన్ని పునరుద్ధరించి, 1968లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువులచే, విగ్రహ ప్రతిష్ట చేయించడం జరిగింది.*



రామ కిష్టయ్య సంగనభట్ల

# భవిష్యత్తు అంతా ఏఐదే

ఒక ఎలక్ట్రానిక్ ఉపకరణం మానవున్ని అనుకరించడం, నేర్చుకోవడం, నిర్ణయాలను తీసుకోవడం లాంటి విధులను నిర్వహించ డాన్ని "కృత్రిమ మేధ (ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)" అని చెప్పవచ్చు. నేడు ఏఐ రంగం ఒక టెక్నాలజీ అభివృద్ధే కాదని, రానున్న తరాల మానవ జీవితాలను విప్లవాత్మకంగా ప్రభావితం చేయనుందని తెలుసుకోవాలి. గత కొన్ని దశాబ్దాలుగా ఏఐ ప్రారంభ స్థాయి నుంచి నేడు భాషలను తర్జుమా చేయడం, ముఖాలను గుర్తించడం, వేలి ముద్రలకు పసిగట్టడం, వాహనాలను ప్రోగ్రామింగ్‌కు అనుగుణంగా ఆటోమెటిక్‌గా నడపడం, రోగాలను నిర్ధారణ చేయడం, చికిత్సతో పాటు రోబోటిక్ సర్జరీలు చేయడం లాంటి పనులను చేసే స్థాయికి



అభివృద్ధి చెందింది. 2021లో ఏఐ ప్రాధాన్యాన్ని గుర్తించిన "జాసన్ కిర్టన్" అను శాస్త్రజ్ఞుడు ప్రతి ఏట 16 జూలై రోజున "ఏఐ ప్రశంస దినోత్సవం లేదా ఏఐ అప్రిషియేషన్ డే" నిర్వహించుకోవాలని ప్రపంచ మానవాళికి సందేశం ఇవ్వడంతో అది ప్రతి ఏటా సాంప్రదాయంగా ప్రపంచ దేశాలు జరుపుకోవడం కొనసాగుతున్నది.

***నిత్య జీవితంలో ఏఐ ప్రయోజనాలు:***

మానవాళి జీవనశైలితో ఏఐ విడదీయరాని సంబంధాన్ని ఏర్పరుచుకుంటున్నది. నేడు వైద్యరంగంలో వ్యాధి నిర్ధారణ, చికిత్స, సర్జరీ లాంటి ప్రయోజనాలను కలిగి ఉన్నది. రవాణా రంగంలో ట్రాఫిక్ నియంత్రణ, ఆటోమెటిక్ వాహనాల రూపకల్పన లాంటివి జరుగుతున్నాయి. విద్యారంగంలో నూతన ఆకర్షణీయ బోధనా పద్ధతులు, ట్యూటర్ విధులను ఏఐ సుసాధ్యం చేస్తున్నది. వినియోగదారుల సేవల్లో చాట్‌బాట్, వర్చువల్ ఏజెంట్స్ లాంటి విధులు నిర్వహించడంలో ఏఐ సఫలం అవుతున్నది. పర్యావరణ పరిరక్షణలో వాతావరణ నమూనాలు, శక్తి నియంత్రణ లాంటి పలు విధులను ఏఐ నిర్వహిస్తున్నది. వీటితో పాటు వినోదం, బ్యాంకింగ్, టెలీకమ్యూనికేషన్స్, ఆటోమొబైల్స్, గృహ విధులు లాంటి అనేక ప్రయోజనాలను ఏఐ కలిగి ఉన్నదని మన అనుభవం చెబుతున్నది. ఏఐ రంగం వరంగానే కాకుండా శాపంగా పలు నష్టాలను కూడా చూపుతోంది. పలు అనైతిక సమస్యలు, వ్యక్తిగత డాటా దుర్వినియోగాలు, ఉద్యోగాల్లో కోతలు, ఇతర పలు లోపాలను కలిగి ఉండడంతో కొంత జాగ్రత్త వహించాల్సి వస్తున్నది. ఏఐ టెక్నాలజీ ఒక ఇంజనీరింగ్ విభాగంలో శ్రమించే వారి అంశమే కాదు, ఆధునిక టెక్నాలజీని వినియోగించే లేదా వినియోగించని ప్రతి ఒక్కరికీ జీవితాలపై ప్రభావాన్ని చూపడం ఖాయమని తెలిసిపోయింది. ఏఐ రంగం నైతిక విలువలకు లోబడి ఉండడంతో పాటు పారదర్శకత కలిగి మానవాళికి మేలు చేకూర్చే విధంగా ఉండాలని కోరుకోవాలి.

*తెలంగాణ సాంప్రదాయాల ప్రత్యేకతను, విశిష్టతను చాటిచెప్పే పండగ. జూలై లేదా ఆగస్టు మాసంలో వచ్చే ఆషాడం వచ్చిందంటే, తెలంగాణ లోని అన్ని ప్రాంతాలలో జాతర సందడి నెలకొంటుంది. ఎక్కడ చూసినా భక్తిశ్రద్ధలతో మహిళలు సమర్పించే బోనాలే దర్శన మిస్తాయి. ప్రాచీన కాలంలో ఋతువులు మారి, ఆషాడంలో వర్షాలు కురిసి, వాతావరణ మార్పులతో, కలరా ప్లేగు లాంటి మహమ్మారి వ్యాధులు సంక్రమించే క్రమంలో, వైద్య సౌకర్యాలు లేని స్థితిలో, దేవతలను కొలవడం జరిగేది. 1813 లో భాగ్యనగరంలో వేలాది మంది గురైన సందర్భంలో, మహంకాళిని కొలవడం వల్ల వ్యాధి తగ్గుముఖం పట్టిందని, అప్పటి నుండి రాష్ట్ర రాజధాని లోనూ, బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు వాడుక. గోల్కొండ కోటలో జగదాంబికా ఆలయంలో, అబుల్ హసన్ తానీషా పాలనా సమయంలో, ప్రధాని సైనికాధికారులుగా ఉన్న అక్కన్న, మాదన్నల కాలంలో, బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లు కథనాలు.*

***భారతదేశంలో ఏఐ టెక్నాలజీ:***

భారత్‌లో ఏఐ రంగం వేగంగా వినియోగించబడుతూ, పలు విజయాలను నమోదు చేస్తున్నప్పటికీ ఇతర అభివృద్ధి చెందిన దేశాల టెక్నాలజీలతో పోల్చితే కొంత మందగమనం జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. ఏఐ విసురుతున్న పలు సవాళ్లను అధిగమిస్తూ రానున్న రోజుల్లో ఈ రంగంలో భారత్ కూడా పటిష్టమైన అడుగులు వేయాలని కోరుకుందాం. ఏఐ ప్రశంస దినం వేదికగా ఏఐ అనువర్తనాలను వివరించడం, చర్చలు నిర్వహించడం, ఏఐ ప్రాజెక్టులను ప్రదర్శించడం, ఏఐ పరిశోధకులను గుర్తించి ప్రశంసించడం, నైతికతను కాపాడడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. ఏఐ విప్లవం చూపిన బాటలో నడుస్తూ, ఏఐ టూల్స్‌ను మానవాళి శ్రేయస్సుకు వాడుకోవడం, భారతంలో మరో తరం ఏఐ విప్లవానికి నాంది పలకడం లాంటివి జరగాలని కోరుకుందాం, మానవుడి మేధస్సుకు ఏఐ సరి సమానం కాదని కూడా నమ్ముదాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# తెలుగు రాష్ట్రాల రాజకీయం



రాజకీయాలెప్పుడూ సరళరేఖలా వుండవు. కానీ తెలుగు రాష్ట్రాల ప్రస్తుత రాజకీయా వరణంలో కనిపిస్తున్నన్ని వింత ట్విస్టులు మాత్రం గతంలో చూసివుండం. దీనికి కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వ ఏకపక్ష పోకడలు ఒకకారణమైతే ఇక్కడ ఏపీ, తెలంగాణ పాలకవర్గాల అవకాశవాద విన్యాసాలు మరో కారణం. ఎప్పటికప్పుడు వీటిచుట్టూనే చర్చలు కేంద్రీకరింపచేస్తూ దేశానికి రాష్ట్రాలకూ ప్రజలకూ సంబంధించిన మౌలికాంశాలు మరుగుపరుస్తున్న మీడియా మరో కారణం. మీడియా మాట అటుంచి నేరుగా కీలకనేతలు అధికారికంగా ఆయా పార్టీలూ ఇస్తున్న సంకేతాలు చేస్తున్న వ్యాఖ్యానాలే వాటి ఇరకాటాన్ని ప్రతిబింబించేవిగా వుండటం తాజా పరిణామం. బహుశా ఇటీవల ఏ సందర్భాన్ని, సంఘటననూ తీసుకున్నా ఈ ద్వంద్వత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.గతంలో ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటన సమయంలో కొద్దిరోజుల కిందట ఉప ముఖ్యమంత్రి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌నూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లనూ హైదరాబాద్‌లో వారి నివాసాలలో కలుసుకోవడంతో రాజకీయం వేడెక్కింది. తర్వాత జరిగిన ఒక సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తనతో చేతులు కలపాలని ఆహ్వానించడంతో బీజేపీ అసలైన మిత్రులెవరనేది రెండు రాష్ట్రాలలో ఒకేసారి చర్చ మొదలైంది. దీనిపై రాజమండ్రి సభలో పవన్ తీవ్ర వ్యాఖ్యలు, మళ్లీ ఆయన హైదరాబాద్ యాత్రతో ముదిరి ఢిల్లీలో జరిపిన రాజకీయ సమావేశం, దాని కొనసా గింపులా లోకేశ్ జాతీయ మీడియా ఇంటర్వ్యూలు కథను రసవత్తరం చేశాయి. ఈ మధ్యలో జగన్‌కు సంబంధించిన ఈడి కేసులలో ఉపశమనం, మరోవైపు వైసీపీ నాయకులు సిబిఐ విచారణ కోరుతూ కేంద్రానికి వినతిపత్రాలివ్వడం, ఏపీలో సాయికృష్ణ లాకప్ మృతిపై సిట్ వేయడంతో పాటు కులం చర్చలు పెరిగాయి. చివరగా తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు కర్నాటక పగ్గాలు చేపట్టిన డికె శివకుమార్ కలిసి తుంగభద్ర గేట్ల బిగింపు కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ దుమారం, ఇన్నిటి మధ్యలో 'సర్ ప్రక్రియ మొదలవడంతో దానిపైనా భిన్న సంకేతాలు... వంటివన్నీ కలిపి చూస్తే పాలక పార్టీల మల్లగుల్లాలు, వ్యూహాత్మక సమరాలు గోచరిస్తాయి. దేశవ్యాపితంగా కార్పొరేట్ హిందుత్వ కూటమి వివిధ ప్రాంతీయ జాతీయ పాలక పార్టీలపై బుల్డోజర్ నడిపించి సంలీనాలు స్వాధీనాలు చేసుకుంటూ స్వైర విహారం చేస్తుంటే మరోవైపున తెలుగు నాట ప్రాంతీయ పార్టీలు స్వీయ అస్తిత్వం కోసం పడుతున్న పాట్లు విదితమవుతాయి.మొత్తం అవకాశవాదమేబీజేపీకి సంబంధించినంత వరకూ కార్పొరేట్ హిందుత్వ రాజకీయ ప్రయోజనాలు తప్ప, మిత్రులంటూ ఎవరూ వుండరు. కనుక తాత్కాలిక శాశ్వత విభజనేమీ పాటించరనడానికి తెలుగుదేశం అనుభవాలే ఒక ఉదాహరణ. అయినా రాజకీయావసరం కోసం కలుస్తూ విడిపోతూ చంద్రబాబు నాయుడు అదే తన చాణక్యం అని చెప్పుకుంటుంటారు. పవన్ కళ్యాణ్ జనసేనతో కలవడం వల్లనే తాము గెలవగలిగామనీ, కేంద్రంలో బీజేపీతో నిలవడం వల్లనే అధికారంలో కొనసాగుతున్నామని ఆయన ఆ పార్టీ అనివార్యంగా నమ్ముతున్నాయి. ఇటీవల కలయికలు, చేరికలతో

*రాజకీయాలెప్పుడూ సరళరేఖలా వుండవు. కానీ తెలుగు రాష్ట్రాల ప్రస్తుత రాజకీయా వరణంలో కనిపిస్తున్నన్ని వింత ట్విస్టులు మాత్రం గతంలో చూసివుండం. దీనికి కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వ ఏకపక్ష పోకడలు ఒక కారణమైతే ఇక్కడ ఏపీ, తెలంగాణ పాలకవర్గాల అవకాశవాద విన్యాసాలు మరో కారణం.*

మోడీకి బలం పెరిగాక తమపై ఆధారపడే పరిస్థితి మారిందన్న వాస్తవం కూడా వారిని కలవరపెడుతున్నదంటే ఆయన గురించి చంద్రబాబు వంటివారికి వున్న గతానుభవమే కారణం కావచ్చు. తమపై వచ్చిన కొన్ని వార్తాకథనాల వల్ల అపోహలు కలగకుండా చేయడానికి దీని గురించి వివరణివ్వడానికే తాను అపాయింట్‌మెంట్ తీసుకుని మరీ మోడీని కలిశానన్నారు. ఆ భేటీ ఏ పరిస్థితులలో జరిగిందో చెబితే విన్న తర్వాత మోడీ నవ్వి సరే నేను తెలుసుకుంటాను గానీ వీటిని బట్టి నీవు ఎవరినీ కలవడం మానొద్దని సలహా ఇచ్చారట. వారి అనుకూల ఎన్డీయేకు టీడీపీకి బెడిసికొట్టిందని భారీ ప్రచార వ్యాఖ్యలు చేయడం, కథనాలు ప్రసారం చేయడం కూడా అంతే ఆశ్చర్యకరం. ఎందుకంటే ఎన్డీయేలో టీడీపీ,బీజేపీ ఎలా వుంటాయనేది వైసీపీకి సంబంధించిన విషయం కాదు. జగన్ తమ శాశ్వత మిత్రుడని ఎవరో అన్నట్టు వచ్చిన కథనాలపై వారు అంతగా ఆనందించవలసిన అవసరమూ కనిపించదు. రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు కూడా ఈ విధంగా బీజేపీ మెప్పుకోసం మోడీ- అమిత్ షాల ఆశీస్సుల కోసం పాకులాడటం నిజంగానే వీపరీతం. ఇదే ఇంటర్వ్యూలలో లోకేశ్ అమరావతికి కేంద్రం సహకారం గురించి చెబుతూనే తామే ప్రధానంగా ఎక్కువ నిధులు సమకూర్చుకోవలసి వచ్చిన వాస్తవం చెప్పడం గమనించదగింది. రిపించడం డబులింజన్ సర్కార్ లక్షణాలు చాటుతున్నది. ఒక వైపున పెట్టుబడుల ప్రవాహం వస్తున్నట్టు ప్రచారంతో వరుసగా భూములు వనరులు కేటాయిస్తూ మరోవైపున కేంద్రంనుంచి రాని నిధులను భూతద్దంలో చూపిస్తూ కూటమి పడుతున్న పాట్లు విస్మరించరానివి. తాజాగా బంగారు గనుల గురించిన హైప్ మోత మోగింది గానీ దానివల్ల ప్రభుత్వానికి వచ్చేది మొదట రూ.యాభై కోట్లు, అత్యధికంగా నూట నలభై కోట్లు మాత్రమేనన్న లెక్కలు వెక్కిరిస్తున్నాయి.పవన్ కళ్యాణ్ తమ జనసేన జాతీయ ప్రవేశం గురించి చెప్పడానికి ఢిల్లీలో సందడి చేశారు గానీ డబులింజన్‌లో భాగంగా రాష్ట్రంలో గానీ కేంద్రంలో గానీ వున్న సమస్యలను నామమాత్రంగానైనా ప్రస్తావించింది లేదు. లోకేశ్ వారసత్వంతో తనకేమీ పేచీలేదని ఆయన చెప్పారంటే. తెలుగుదేశం అంతర్గత విషయం గనక అర్థం చేసుకోవచ్చు, కానీ, తెలంగాణలో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని అమిత్ షా స్వయంగా చెప్పాక కూడా మోడీ భజనతో వూగిపోవడమేమిటి? సనాతనానికి తానే సంరక్షకుడినంటూ ఊగిపోయిన నాయకుడు తిరుమల తిరుపతి వ్యవహారాలపైన వీరంగం తొక్కారు గానీ అయోధ్య రాముడి నిధుల గల్లంతు, ఆకివీడులో గొంతేనమ్మ గుడి ధ్వంసం వంటి విషయాలపై ఎందుకు మౌనం పాటిస్తున్నారు? అధికారిక సభల్లో ఆవేశంతో ఊగిపోయి ప్రతినలు పలికే ఉప ముఖ్యమంత్రి పర్యావరణంలో ఘోర విపత్తులపై ఎందుకు నిశ్శబ్ద ముద్ర దాలుస్తున్నారు? విశాఖ ఉక్కు ప్రమాదం తర్వాత కూడా విశాఖలో వరుస ప్రమాదాలు చూడటం లేదా? రుషికొండ భవనాలపై అంతరభస చేసినవారు చివరకు పీపీపీ కింద లగ్జరీ రిసార్టు పెట్టాలని నిర్ణయించడం దేనికి నిదర్శనం?ఇక తెలంగాణకు వస్తే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయాలు ఒకవైపు, జనసేన, టీడీపీ, వైసీపీల బంధాలు మరోవైపు కనిపిస్తున్నాయి. జగన్ మళ్లీ లోటస్ పాండ్‌లో కార్యకలాపాలు పెంచబోతున్నారని, తెలంగాణలో కొన్ని సామాజిక వర్గాలపై ప్రభావం చూపించబోతున్నారని చెబుతున్నారు. బీఆర్ఎస్‌తో వైసీపీ ఇంకా చెప్పాలంటే కేసీఆర్ కుటుంబంతో జగన్ అనుకూలత బహిరంగమే. అదే సమయంలో రేవంత్‌రెడ్డికి చంద్రబాబుతో వున్న బంధంపై బీఆర్ఎస్ దాడి చేస్తుంటుంది. కాళేశ్వరం వంటివాటిపై సిబిఐ విచారణ జరపడం లేదని రేవంత్ సర్కారు అంటుంటే గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ అన్నట్లు ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ దాడి. రాయదుర్గం దగ్గర ఎస్‌బిఐకి కేటాయించిన స్థలం వేలం వేయడంపై మొదలైన లీగల్ తగాదా వెనక కూడా బీఆర్ఎస్ ఉందని ప్రభుత్వం సందేహించింది. అందుకు విరుగుడుగా ఎస్‌బిఐలో ఖాతాల వుపసంహరణకు సిద్ధమైంది, మెట్రో రైల్ మలిదశకు సంబంధించిన వివాదంలో మొదట కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై రేవంత్‌రెడ్డి పరస్పరం తిట్టుకోవడం, ఆ తర్వాత ఉభయులూ కలిసి కేంద్రంలో చర్చలలో పాల్గొనడం తమ వాదనకు మద్దతుగా బీఆర్ఎస్ చెబుతున్నది చివరకు ఈ మొత్తం రెండు దశలపై అధ్యయనానికి స్టేట్‌బ్యాంక్ బృందానికే అప్పగించడంతో ఒక్కదెబ్బకు రెండు పిట్లల్లా తగాదా మాయమైంది, వాస్తవానికి ఈ మొత్తంలో లాభపడేది కార్పొరేట్ వర్గాలు మాత్రమేకాగా పారదర్శకత అసలు లేకుండా పోయింది.తుంగభద్ర గేట్ల ప్రారంభ సభలో ముగ్గురు ముఖ్యమంత్రులు పాల్గొనడం విశేషమే గానీ అసాధారణం కాదు. అయితే ఇద్దరు కాంగ్రెస్ ఒకరు కూటమి సీఎంలు వుండగా కేంద్ర మంత్రి సిఆర్‌పాటిల్ దీనంతటికీ నాయకత్వం వహించినట్టు పొగడ్డం మాత్రం శ్రుతి మించింది. తుంగభద్ర జలాలపై మూడు రాష్ట్రాల కమిటీ వేయడం కూడా మంచిదేగానీ శ్రుతి మించిన పరస్పర పొగడ్తలు మళ్లీ సందేహాలు పెంచాయి, మతతత్వంపై రాజీలేని పోరాటం చేసిన



# జాతీయం-అంతర్జాతీయం






## క్షీణిస్తున్న వాంగ్‌చుక్ ఆరోగ్యం


- ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం
- వాదనలు గురువారానికి వాయిదా

**న్యూఢిల్లీ, జులై 15(ఎ.ఎం.ఎస్):** కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రముఖ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ 20 రోజుల నుంచి నిరహార దీక్ష చేస్తున్నారు. దీంతో ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షిణిస్తుంది. తాజాగా ఆయన ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలైంది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై తమ వైఖరిని స్పష్టం చేయాలని అదనపు సొలిసిటర్ జనరల్, కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి వాదనలు గురువారం వాయిదా వేసింది. కాగా, ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్ అయిన విషయం తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జూన్ 21న నీట్ రీఎగ్జామ్ నిర్వహించింది. అయితే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్, సోనమ్ వాంగ్‌చుక్ 20 రోజులకు పైగా నిరహార చేస్తున్నారు. వీరి దీక్షకు ప్రతిపక్షాల తోపాటు దేశ వ్యాప్తంగా మద్దతు లభిస్తోంది.

## భారత్‌పై పోలెండ్ ప్రశంసలు

- యుద్ధ నివారణలో కీలక పాత్ర పోషించిందంటూ కితాబు
- రష్యా-ఉక్రెయిన్ మధ్య అవగాహన పెరిగిందంటూ వ్యాఖ్య

**వార్సా, జులై 15:** రష్యాఉక్రెయిన్ యుద్ధం మరింత ముదరకుండా నివారించే ప్రయత్నాలలో భారత్ పోషిస్తున్న పాత్రను తాజాగా పోలాండ్ ప్రశంసించింది. 2022 ఫిబ్రవరి చివరి వారంలో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. నాలుగేళ్లుగా ఈ యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెవ్స్కీ మాట్లాడుతూ.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవించే కొద్దిమంది ప్రపంచ నాయకులలోభారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒకరని అన్నారు. 2022 చివరిలో జరిగిన పరిణామాలను పొలాండ్ మంత్రి ప్రస్తావిస్తూ.. యుద్ధ సమయంలో వ్యూహాత్మక అణ్వాయుధాలను ఉపయోగించవద్దని రష్యాను ఒప్పించడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. రష్యాతో భారత్‌కు ఉన్న దశాబ్దాల నాటి సంబంధం న్యూఢిల్లీకి ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తోందని, శాంతిని నెలకొల్పే ప్రయత్నాలలో దీనిని ఒక కీలక శక్తిగా నిలుపుతోందని బార్టోస్జెవ్స్కీ అన్నారు. '
' ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ ప్రఖ్యాత రాజనీతిజ్ఞుడు.. అలీన విధానం అనుసరించిన కాలం నుంచి భారత దేశానికి రష్యాతో, అంతకుముందు సోవియట్ యూనియన్‌తో కూడా చాలాకాలంగా సంబంధాలు ఉన్నాయి. అధ్యక్షుడు పుతిన్ వాస్తవానికి మోదీ చెప్పే విషయాలను శ్రద్ధగా వింటారు'' అని ఆయన వ్యాఖ్యానించారు. మాస్కోతో సంప్రదింపులు రోజురోజుకు కష్టతరం అవుతున్న తరుణంలో, రష్యా అధ్యక్షుడిని ప్రభావితం చేయగల కొద్దిమంది నాయకులలో ప్రధాని మోదీ కూడా ఒకరని పోలిష్ మంత్రి పేర్కొన్నారు. ''రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై కొంత ఒత్తిడిని, ప్రభావాన్ని చూపగల కొద్దిమంది వ్యక్తులలో ప్రధానమంత్రి మోదీ ఒకరు. ఈ సంఘర్షణను ఆపడానికి భారత్ స్పష్టంగా చేయగలిగే సహాయం ఇదే'' బార్టోస్జెవ్స్కీ అభిప్రాయపడ్డారు. రష్యా తనను శత్రువులుగా భావించే దేశాల నుంచి వచ్చే విజ్ఞప్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని, భారత్‌తో పాటు చైనా వాణిని కూడా మాస్కో గౌరవిస్తుందని ఆయన పేర్కొన్నారు. ''ఉద్రిక్తతలు పెరగడం ఎవరికీ ఇష్టం లేదని భారత్, చైనా వంటి దేశాలూ శాంతిని కోరుకుంటున్నాయని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి మోదీతో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. భారత్‌తో చమురు విభేదాలు సద్దుమణిగాయని పోలాండ్ పేర్కొంది. రష్యా నుంచి తక్కువ ధరకు క్రూడాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకోవడంపై గతంలో ఉన్న విభేదాలను న్యూఢిల్లీ,వార్సా అధిగమించాయని పోలాండ్ మంత్రి స్పష్టం చేశారు. రష్యా ఆర్థిక వ్యవస్థకు భారత్ పరోక్షంగా మద్దతు ఇస్తోందంటూ గతంలో తాము చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ.
. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహన పెరిగిందని ఆయన పేర్కొన్నారు.



## మ్యాన్‌హోల్‌లో పడి పారిశుధ్య కార్మికుడు మృతి

- ఉత్తరప్రదేశ్ లో దారుణం
కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశాలు

**నోయిడా, జులై 15 (ఎ.ఎం.ఎస్):** ఉత్తరప్రదేశ్ నోయిడాలో దారుణం జరిగింది. మురుగునీటి కాలువ శుభ్రం చేస్తుండగా మ్యాన్‌హోల్‌లో పడి ఒక పారిశుధ్య కార్మికుడు మృతిచెందాడు. నోయిడా అథారిటీ ప్రకారం, వాటర్ డివిజన్ III పరిధిలోని సెక్టార్93బి మరియు గెఝా గ్రామం సమీపంలోని టిపాయింట్ వద్ద లోతైన మురుగునీటి కాలువను శుభ్రం చేస్తుండగా మంగళవారం (జూలై 14) ఈ సంఘటన జరిగింది. మృతుడిని శివగా గుర్తించారు. అతను సేఫ్టీ బెల్ట్, ఆక్సిజన్ మాస్క్, ఇతర రక్షణ పరికరాలు ధరించి, మురుగునీటి మ్యాన్‌హోల్‌లోని అడ్డంకిని తొలగించే పనిలో నిమగ్నమై ఉన్నాడు. కొంత సేపటి తర్వాత క్షేత్రస్థాయి సిబ్బంది అతడిని బయటకు తీయడానికి ప్రయత్నించగా, అతను మ్యాన్‌హోల్‌లోని తీగలలో చిక్కుకుపోయాడని అథారిటీ తెలిపింది. స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో వెంటనే సహాయక చర్యలు చేపట్టగా, అనంతరం అతడిని ఆసుపత్రికి తరలించారు. తాజాగా నోయిడా అథారిటీ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, అధికారులపై క్రమశిక్షణా చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది.





## యుద్ధంలో 14 మంది అమెరికా సైనికులు మరణం

*హెలికాప్టర్ కూలిన ఘటన
*మరో 400 మందికి గాయాలు

**వాషింగ్టన్, జులై 15 :** ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన అమెరికా సైనికుల సంఖ్య 14కు చేరింది. తాజాగా...ఈ నెలలో అరేబియా సముద్రంలో హెలికాప్టర్ కూలిన ఘటనలో నౌకాదళ పైలట్ చనిపోయాడు. పోరులో గాయపడిన అమెరికా సైనికుల సంఖ్య సోమవారం నాటికి 400 దాటింది. వీరిలో ఎక్కువ మందికి తీవ్రమైన మెదడు గాయాలు అయ్యాయని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ చెప్పారు. ముందుగా కువైట్‌లోని కమాండ్ కేంద్రంపై జరిగిన ఇరాన్ డ్రోన్ దాడిలో ఆరుగురు సైనికులు చనిపోయారు. ఆ తర్వాత సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో ఓ సైనికుడు మరణించాడు. ఇరాన్‌కు వ్యతిరేకంగా
అమెరికా సైనిక చర్యకు సహకరిస్తున్న కేసీ`135 రీఫ్యూయలింగ్ విమానం ఇరాక్‌లో కూలిన ఘటనలో మరో ఆరుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మొత్తంగా ఇరాన్ యుద్ధంలో 413 మంది సైనికులు గాయాలపాలయ్యారు. అయితే వారిలో దాదాపుగా అందరూ తిరిగి విధులలో చేరారని సైనిక కమాండ్ ప్రతినిధి మేజర్ ఎమ్మా థాంప్సన్ తెలిపారు.



## నమాజ్ కోసం ప్రత్యామ్నాయ స్థలం

- ముస్లిం వర్గాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు
- మధ్యప్రదేశ్ అంశంపై తీర్పు

**భోపాల్, జులై 15 (ఎ.ఎం.ఎస్):** మధ్యప్రదేశ్ భోజశాల కాంప్లెక్స్ కేసులో తుది తీర్పు వెలువడే వరకు నమాజ్ కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని ముస్లిం వర్గాలకు సుప్రీంకోర్టు సూచించింది. భోజశాల కాంప్లెక్స్ కేసులో అప్పీల్ దాఖలు చేసిన ముస్లిం వర్గాలకు మంగళవారం నోటీసు జారీ చేసింది. ఈ కేసులో ఎటువంటి స్టేటస్ కో లేదా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో తుది తీర్పు వెలువడే వరకు, శుక్రవారాల్లో మధ్యాహ్నం 1.00గంట నుండి 3.00గంటల మధ్య నమాజ్ చేసుకునేందుకు వీలుగా తాత్కాలిక ఏర్పాటుగా వివాదాస్పద స్థలానికి సమీపంలో ఉన్న బహిరంగ ప్రదేశం లేదా ఖాళీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించింది. వివాదాస్పద కట్టడంలో ఎటువంటి నిర్మాణపరమైన మార్పులు చేయవద్దని, సుప్రీంకోర్టు అనుమతి లేకుండా అలా చేయకూడదని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ)ని ఆదేశించింది.

వివాదాస్పద భోజశాల కాంప్లెక్స్‌ను సరస్వతి దేవీ ఆలయంగా మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రకటించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్‌లను తక్షణమే జాబితా చేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఈ కాంప్లెక్స్ 11వ శతాబ్దపు కట్టడమైన కమల్ మౌలా మసీదు అని ముస్లిం వర్గాలు వాదిస్తుండగా, సరస్వతీ దేవీ ఆలయమని హిందూ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ధార్ జిల్లాలోని ఈ కాంప్లెక్స్‌ను ప్రస్తుతం ఎఎస్ఐ సంరక్షిస్తోంది.

## అంతా హార్ముజ్ కోసమే

- పశ్చిమాసియాలో భీకర పోరు
- ట్రంప్ వ్యాఖ్యల పర్యవసానమే
- బీరాలు పలుకుతున్న అమెరికా అధ్యక్షుడు
- మా జోలికొస్తే వినాశనమే

**టెహ్రాన్, జులై 15:** పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. ఇరాన్‌పై అమెరికా సేనలు మంగళవారం ఉదయమే దాడులు జరిపాయి. హార్ముజ్ జల సంధిలోని ఇరాన్ ఓడరేవులను మరోసారి దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే పోరు మొదలైంది. జలసంధిలో ఇరాన్ యేతర నౌకలు సురక్షితంగా ప్రయాణించేందుకు ఫీజు వసూలు చేస్తామని కూడా ట్రంప్ చెప్పారు. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా బహ్రైన్, జోర్డాన్‌లను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపింది. ఈ దాడిలో ఓ నావికుడు మరణించగా ఎనిమిది మంది గాయపడ్డారు. తమ హెచ్చరికలను బేఖాతరు చేసి ఒమన్ సమీపంలో హార్ముజ్‌ను దాటుతున్నందునే నౌకలపై దాడి చేశామని రివల్యూషనరీ గార్డులు తెలిపారు. దీంతో ఇరాన్‌పై తాను ప్రతీకార దాడి చేస్తానని ఎమిరేట్స్ హెచ్చరించింది. తాజా పరిణామాల నేపథ్యంలో యూఏఈ కూడా ఇరాన్‌తో పోరుకు యుద్ధభూమిలో అడుగు పెడుతోంది.

ఇరాన్ కోస్తా రక్షణ వ్యవస్థలు, క్షిపణి - డ్రోన్ కేంద్రాలు, సముద్రయాన సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకొని అబూ మసూ, బందర్ అబ్బాస్, ఛాబహార్, జస్క్, కొనారక్ పరిసర ప్రాంతాలపై దాడులు చేశామని అమెరికా సైనిక సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) తెలిపింది. బందర్ అబ్బాస్‌లోనూ, కిష్, ఖెష్మ్, అబూ మసూ దీవులలోనూ పేలుడు శబ్దాలు వినిపించాయి. అమెరికా దాడులను ఇరాన్ ధృవీకరించింది. 'ఇరాన్ దళాలకు భారీ నష్టం కలిగించే దాడులు కొనసాగిస్తాం. హార్ముజ్‌లో అమాయక పౌరులు, వాణిజ్య నౌకలపై దాడి చేసే దాని సామర్థ్యాన్ని దెబ్బతీస్తాం' అని అమెరికా సైన్యం చెప్పింది. 'ఇది మరో పెద్ద దాడి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'మేము వారిని చావు దెబ్బ కొట్టాం. అది కొనసాగుతుంది. ఏం జరుగుతుందో చూస్తాం' అని అన్నారు. వారి సామర్థ్యా టినీ నాశనం చేశామని, జలసంధిపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నా మని చెప్పుకొచ్చారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని తిరిగి కొనసాగిస్తున్నామని తెలిపారు. నౌకలపై టోల్ విధించబోమని ట్రంప్ గతంలో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఇరాన్ సేనలు మంగళవారం ఉదయం బహ్రైన్‌పై క్షిపణు లు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఆయుధాలను నిల్వ ఉంచే గిడ్డంగులు, ఉపగ్రహ కమ్యూనికేషన్ కేంద్రం, అమెరికా దళాల భవనం ధ్వంసమయ్యాయని ఐఆర్‌జీసీ తెలిపింది. దీంతో దేశ వ్యాప్తంగా సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. బయ టకు రావద్దని, సురక్షిత ప్రదేశాలకు చేరుకోవాలని కోరారు. బహ్రైన్‌లో అమెరికా నౌకాదళ ఐదో ఫ్లీట్ కార్యకలాపాలు సాగి స్తున్న విషయం తెలిసిందే. కాగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు క్షిపణులను అడ్డుకున్నానని జోర్డాన్ తెలిపింది. జోర్డాన్ కూడా అమెరదువుదళాలకు ఆతిథ్యం ఇస్తోంది. ఇరాన్‌లోని పికాక్స్ పర్వతంపై దాడి చేస్తానంటూ ట్రంప్ చేసిన హెచ్చరికపై టెహ్రాన్ ఘాటుగా స్పందించింది. అదే జరిగితే వినాశనం తప్పదని, అమెరికా సైన్యం, దాని ప్రాంతీయ మిత్రులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. పికాక్స్ పర్వతంపై ఇరాన్ అణు కార్యకలాపాలు నిర్వహిస్తోందని అమె రికా ఆరోపిస్తుండగా అందులో నిజంలేదని టెహ్రాన్ స్పష్టం చేసింది.

హార్ముజ్ జలసంధి విషయంలో అమెరికా వైఖరిలో మార్పు కన్పిస్తోంది. జలసంధిలో అన్ని నౌకలు ప్రయాణించ వచ్చునని, ఎలాంటి రుసుములు ఉండవని ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడి చేయడానికి ముందు అమెరికా తెలిపింది. అయితే ఇప్పుడు మాట మార్చింది. హార్ముజ్‌లో టోల్ వసూలు చేసేందుకు అమెరికా, ఇరాన్ ప్రయత్నించడం స్వేచ్ఛాయుత నౌకాయానానికి సంబంధించిన అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. అంతేకాక ఉద్రిక్తతలు పెరుగుతాయి. మధ్యప్రాచ్యంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయి. ఇప్పుడు ఘర్షణల దృష్టి అంతా హార్ముజ్ పైనే నిలిచింది. . ఘర్షణ ప్రారంభ దినాలలో దూర ప్రాంతాలలోని లక్ష్యాలపై దాడుల కోసం అమెరికా వేలాది క్షిపణులను ఉపయోగించింది. ప్రస్తుత యుద్ధంలో వెయ్యికి పైగా పాట్రియాట్ క్షిపణులను ఉపయోగించామని, గల్ఫ్‌లోని తమ మిత్ర దేశాలు కూడా చాలా ఆయుధాలనే వాడాయని, ఉక్రెయిన్ సైతం ఆయుధాలను కోరుతోందని, ఈ పరిస్థితుల్లో ఉత్పత్తి కోసం అధిక డిమాండ్ నెలకొన్నదని కాన్సియన్ తెలిపారు. అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థలో పాట్రియాట్ కీలకమైనది. ఇందులో లాంఛర్లు, రాడార్లు, శత్రువుల దాడులను అడ్డుకునే క్షిపణులు ఉంటాయి. సంవత్సరానికి కేవలం 600 పాట్రియాట్ వ్యవస్థలను మాత్రమే ఉత్పత్తి చేయగలరు. ఒక్కో వ్యవస్థకు బిలియన్ డాలర్ల ఖర్చు అవుతుంది. కొత్త పాట్రియాట్ కావాలంటే నాలుగైదు సంవత్సరాల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి. హార్ముజ్‌లో ప్రయాణించే చమురు నౌకల నుంచి 30 మిలియన్ డాలర్ల చొప్పున ఫీజు వసూలు చేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన షిప్పింగ్ కంపెనీలకు వణుకు పుట్టిస్తోంది. ప్రస్తుతం బ్యారల్ చమురు ధర 80 డాలర్లుగా ఉంది. ఒక్కో సూపర్ ట్యాంకర్‌లో రెండు మిలియన్ బ్యారల్స్ ముడి చమురును నింపవచ్చు. దీని ఆధారంగానే ఒక్కో నౌక నుంచి 30 మిలియన్ డాలర్ల ఫీజు వసూలు చేయాలని ట్రంప్ నిర్ణయించారు. ప్రస్తుతం ఇరాన్ కేవలం రెండు మిలియన్ డాలర్ల టోల్ మాత్రమే వసూలు చేస్తోంది. జలమార్గానికి అమెరికా గార్డియన్‌గా వ్యవహరిస్తుందని, సురక్షితమైన నౌకాయానం కోసం ఫీజు వసూలు చేయాలని నిర్ణయించామని ట్రంప్ చెబుతున్నారు.

ఫీజులు వసూలు చేయాలన్న అమెరికా నిర్ణయంపై షిప్పింగ్ పరిశ్రమ మండిపడుతోంది. దీనిని 'రహదారి దోపిడీ'గా అభివర్ణించింది. కాగా హార్ముజ్‌లో ప్రయాణించే వాణిజ్య నౌకలకు భద్రత కల్పించి, వాటి సురక్షిత ప్రయాణానికి సాయపడేటప్పుడు ఆ సేవలకు ఫీజు వసూలు చేయడం సబబేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు. అయితే అమెరికా విధించాలని చూస్తున్న ఫీజు చాలా ఎక్కువగా ఉన్నదని, తాము మాత్రం న్యాయసమ్మతంగానే వ్యవహరిస్తామని తెలిపారు.




## పాస్ పోర్టుతోనే పౌరుడని చెప్పలేం

- స్పష్టం చేసిన కేంద్రం
- విదేశీ ప్రయాణాలకు మాత్రమే ఉపయోగమంటూ వెల్లడి

**న్యూఢిల్లీ, జులై 15 (ఎ.ఎం.ఎస్) :** పాస్‌పోర్టు కలిగి ఉండటం అనేది ఒక వ్యక్తి భారత పౌరుడని చెప్పడానికి ఖచ్చితమైన ఆధారంగా పరిగణించలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్ని వారాలుగా పాస్‌పోర్టును పౌరసత్వ గుర్తింపు కార్డుగా పరిగణించవచ్చా లేదా అనే అంశంపై దేశవ్యాప్తంగా తీవ్రమైన చర్చ నడుస్తుండగా.. కేంద్రం ఈ చర్చకు చెక్ పెట్టింది. ముఖ్యంగా కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం రోజు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ అంశంపై పూర్తి స్థాయి చట్టపరమైన వివరణ ఇచ్చారు. 1967 నాటి పాస్‌పోర్టు చట్టం, అలాగే 1980 నాటి పాస్‌పోర్టు నిబంధనల ప్రకారం.. భారతీయ పౌరులు దేశాన్ని దాటి వెళ్లే ప్రక్రియను, అంటే వారి విదేశీ నిష్క్రమణలను క్రమబద్ధీకరించడానికి మాత్రమే ప్రభుత్వం ఈ పత్రాన్ని జారీ చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు.

ఈ సందర్భంగానే రణ్‌ధీర్ జైస్వాల్ దేశంలో పాస్‌పోర్టుల వినియోగానికి సంబంధించిన ఆసక్తికరమైన గణాంకాలను పంచుకున్నారు. ప్రస్తుతం భారత దేశంలోని మొత్తం జనాభాలో కేవలం 8 శాతం కంటే తక్కువ మంది పౌరుల వద్ద మాత్రమే పాస్‌పోర్టులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఒక నిర్దిష్టమైన, పక్కా ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఈ పత్రాన్ని జారీ చేస్తామని వివరించారు. చట్టప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో భారతీయులతో పాటు విదేశీయులకు కూడా పాస్‌పోర్టును అందించే నిబంధనలు ఉన్నాయని, అందువల్ల కేవలం ఈ చిన్న బుక్‌లెట్ ఆధారంగా పౌరసత్వాన్ని ఖరారు చేయలేమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఎన్నికల సంఘం పలు రాష్ట్రాల్లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పాస్‌పోర్టును పౌరసత్వ రుజువుగా ఉపయోగించవచ్చా అని మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. విదేశీ వ్యవహారాల శాఖ గత జూన్ 24న 'పాస్‌పోర్ట్ సేవా దివస్' వేదికగా మొదటిసారి ఇది ధ్రువీకరణ పత్రం కాదని తెలిపింది. దీనికి మద్దతుగా 2013 నాటి బాంబే హైకోర్టు సంచలన తీర్పును కూడా ప్రభుత్వ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. పాస్‌పోర్టును కలిగి ఉండటం పౌరసత్వానికి నిశ్చయాత్మకమైన సాక్ష్యం కాదని నాడే హైకోర్టు స్పష్టం చేసింది. అయితే నివాస ధ్రువీకరణ, పోలీసు వెరిఫికేషన్ వంటి కఠినమైన తనిఖీల తర్వాతే పాస్‌పోర్టు ఇస్తున్నప్పుడు, దీనిని పౌరసత్వ రుజువుగా ఎందుకు తీసుకోరంటూ ప్రతిపక్షాలు, పలు వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ అంశం రాజకీయ దుమారానికి దారి తీసింది. దీంతో అంతర్జాతీయ ప్రయాణాలకు, విదే
శాల్లో గుర్తింపు పొందేందుకు మాత్రమే పాస్‌పోర్టు ప్రాథమిక ఉద్దేశమని కేంద్రం మరోసారి నొక్కి చెప్పింది.




## సీజేపీ ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతు

**ఢిల్లీ, జులై 15 (ఎ.ఎం.ఎస్) :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ, సీబీఎస్ఈలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి దేశంలోని వివిధ వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతోంది. జూన్ 20న జంతర్‌మంతర్ వద్ద ప్రారంభమైన ఈ ఆందోళనకు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, కార్యకర్తలు, పౌర సమాజం నుంచి మద్దతు లభించింది. మరికొందరు తమ పూర్తి సంఘీభావాన్ని తెలిపారు. మరోపక్క సీజేపీ చేపట్టిన ఈ ఆందోళన మంగళవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. అలాగే పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష 17వ రోజు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిశీ, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి శంకర్‌సింగ్ వాఘేలా, సినీ నటి స్వరా భాస్కర్, ఎన్సీపీ ఎంపీ ప్రియా సరోజ్, ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్, బీకేయూ అధ్యక్షుడు నేత గుర్నామ్ సింగ్ చరునిలు సీజేపీ ఆందోళన చేస్తున్న శిబిరాన్ని సందర్శించారు. సోనమ్ వాంగ్‌చుక్ దీక్షకు, సీజేపీ ఆందోళనకు మద్దతు తెలిపారు.

ప్రముఖ నటి జీనత్ అమన్, నటుడు ఓమీ వైద్య, 'ధురందర్' నటి అయేషా ఖాన్, నటుడు అభయ్ డియోల్ సంఘీభావం తెలిపారు. నటుడు అతుల్ కులకర్ణి కూడా సీజేపీ ఆందోళనకు మద్దతు తెలిపారు. 'నిజాయితీ, కరుణతో ఈ దేశాన్ని పునర్నిర్మించండి' అని ఆయన యువతను కోరారు.




## న్యూయార్క్ టైమ్స్ అమెరికా సమన్లు

* పాత్రికేయులు వార్తలు రాసినందుకే
* జర్నలిస్టుల పరిరక్షణ కమిటీ ఆగ్రహం

**వాషింగ్టన్, జులై 15:** న్యూయార్క్ టైమ్స్ పత్రికకు చెందిన పాత్రికేయులకు అమెరికా అధికారులు సమన్లు జారీ చేశారు. వీటి ప్రకారం కోర్టు లేదా ఏదైనా ప్రభుత్వ సంస్థ ముందు హాజరై సాక్ష్యం చెప్పాల్సి ఉంటుంది. లేదా అవసరమైన పత్రాలను సమర్పించాలి. దీనిని పాటించకపోవడం చట్టరీత్యా నేరం అవుతుంది. ఈ సమన్లనే అమెరికాలో 'సబ్‌పోనాలు' అంటారు. ఇంతకీ వారు చేసిన నేరం ఏమిటంటే...అమెరికాకు ఇటీవలే ఖతార్ ఓ ఎయిర్‌ఫోర్స్ విమానాన్ని బహుమతిగా ఇచ్చింది. అయితే ఈ విమానంలో భద్రతకు సంబంధించి అనేక సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై న్యూయార్క్ టైమ్స్‌కు చెందిన ఐదుగురు పాత్రికేయులు వార్తలు రాశారు. దీంతో ఆగ్రహించిన అధికారులు వారికి సమన్లు జారీ చేశారు. ప్రభుత్వ చర్యపై మీడియా ప్రపంచం తీవ్రంగా స్పందించింది. స్వతంత్ర మీడియా సంస్థలను నియంత్రించి, భయపెట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రచారంలో ఇది ఓ ఎత్తుగడ అని పలువురు మీడియా ప్రముఖులు విమర్శించారు. ఈ సమన్లు జర్నలిస్టుల పనితీరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పాత్రికేయుల పరిరక్షణ కమిటీ ప్రతినిధి జోడీ గిన్స్‌బర్గ్ ధ్వజమెత్తారు. ఈ సమన్లనే అమెరికాలో 'సబ్‌పోనాలు' అంటారు. ఇంతకీ వారు చేసిన నేరం ఏమిటంటే ట్రంప్ ఆగ్రహానికి గురైన వార్తా సంస్థలపై న్యాయస్థానాలలో వ్యాజ్యాలు దాఖలవుతున్నాయి. కొన్నిచోట్ల దాడులు కూడా జరుగుతు న్నాయి. అధికార కేంద్రాలలోకి మీడియా ప్రవేశాలను అడ్డుకుంటున్నారు. ఈ సమన్లనే అమెరికాలో 'సబ్‌పోనాలు' అంటారు. ఇంతకీ వారు చేసిన నేరం ఏమిటంటే వాషింగ్టన్‌లో ఓ పాత్రికేయుడి ఇంటిని ఫెడరల్ ఏజెంట్లు సోదా చేశారు. ప్రభుత్వం కోరుకుంటున్న కథనానికి భిన్నంగా వార్తలు రాసే జర్నలిస్టులను భయపెట్టడానికి, వారిని రాక్షసులుగా చిత్రీకరించడానికి ప్రభుత్వ సంస్థలను వాడుకోవడం సర్వసాధారణమైంది. తాజాగా జారీచేసిన సమన్లు అత్యంత ప్రమాకరమైనవి, అసాధారణమైనవి. తన అజెండాకు వ్యతిరేకంగా వార్తలు రాసే సంస్థల విషయంలో ట్రంప్ విముఖత ప్రదర్శిస్తుంటారు.తనకు నచ్చని కథనాలు రాసే వార్తాసంస్థలపై దావాలు వేయడం తో పాటు టీవీ ప్రసార హక్కులను కూడా రద్దు చేస్తానని బెదిరించారు. ఉదాహరణకు ఏబీసీకి చెందిన 'ది వ్యూ' కార్యక్రమంపై కక్షసాధింపు చర్య లకు పూనుకున్నారు. ది టైమ్స్, అసోసియేటెడ్ ప్రెస్, వాల్ స్ట్రీట్ జర్నల్ వంటి వార్తా సంస్థలు న్యాయస్థానాలలో కేసులు ఎదుర్కోవాల్సి వస్తోంది.





## ఇంటికి ఫోన్ చేసిన కొద్ది సేపటికే మృతి

**టెహ్రాన్, జులై 15:** హర్మ్యాజ్‌లో క్షిపణి దాడికి గురైన నౌకలోని భారతీయ నావికుడు హేరంబ్ కర్మార్కర్ మరణించిన విషయం తెలిసిందే. భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున ఒమన్ జలాల్లో ఇరాన్ దాడి చేసినప్పుడు, ఆ సరకు రవాణా నౌకలోని 11 మంది భారతీయుల్లో కర్మార్కర్ ఒకరు. నౌక ఆదివారం రాత్రి 2.49 గంటలకు హర్మ్యాజ్‌ను దాటుతుండగా హేరంబ్ ఇంటికి ఫోన్ చేసి మాట్లాడారు. కొద్దిసేపటికే నౌకపై క్షిపణి పడి హేరంబ్ మృతి చెందడం అందరినీ కలచివేస్తుంది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## కేజీబీవీ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**ఘనపూర్ (స్టేషన్) లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ**

**విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ.. భోజన నాణ్యత పరీక్ష**

**ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, ఓటరు నమోదు పనుల పరిశీలన**

**జనగామ, జులై 15 (వుదయం ప్రతినిధి) :**

విద్యార్ధి దశ నుంచే క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, నిరంతర సాధన ద్వారానే మంచి భవిష్యత్ సాధ్య మవుతుందని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం ఆయన ఘనపూర్ (స్టేషన్) పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల వంటగది, స్టోర్ రూమ్, ఆర్వో ప్లాంట్‌లను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇచ్చే గుడ్ల నాణ్యతను నీళ్లలో వేసి స్వయంగా పరీక్షించారు. అరటి పండ్ల నాణ్యత సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన ఆహారమే అందించాలని స్పష్టం చేశారు. డైట్ చార్ట్ అమలు, పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్, ఎస్ఓలకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పాఠశాలలో 'ఐఎన్ ఆకాడమీ' డిజిటల్ తరగతులను ప్రారంభించి, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. పోటీ పరీక్షల్లో గణితం కీలకమని, ప్రణాళికాబద్ధంగా చదివి సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పనులు వేగవంతం చేయాలి పర్యటనలో భాగంగా ఘనపూర్ (స్టేషన్) జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజల



సౌకర్యార్థం ఈ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ఓటరు నమోదు ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ప్రతి ఓటరుతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపించి, వాటి డిజిటలైజేషన్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫారాలు తిరిగి సమర్పించకపోతే ఓటరు నమోదుపై ప్రభావం పడుతుందని, ఈ విషయంలో ప్రజలను చైతన్యపరిచేలా బీఎల్ఓలకు ఫారాలు అందేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్

**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి జులై 15**



ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలు తీరుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, ఐఏఎస్ బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ననుసరించి ప్రత్యేక సమగ్ర ఓటర్ సర్వేను చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి సర్వే లో అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం జరిగిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ గడువు లోగా పూర్తి చేయాలని, అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఈసందర్భంగా కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా సహకారం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జి సంధ్యారాణి,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ, వై వై గణేష్, డిఆర్ఓ విజయలక్ష్మి జెడ్పి సీఈఓ రాంరెడ్డి,వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు, మరియు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యా బోధనలో నూతన పద్ధతులు అవలంభించాలి: అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, జూలై 15 (వుదయం ప్రతినిధి):**



విద్యా బోధనలో ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులను అవలంభించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ నెమురుగొమ్ముల రవి అన్నారు. బుధవారం రోజున హనుమకొండ జిల్లా సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సోషల్ స్టడీస్ సమగ్ర ఇన్–సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ సందర్శించి శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ విద్యార్థి కేంద్రిత బోధన, నూతన బోధనా పద్ధతులు మరియు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, కేంద్ర ఇన్‌చార్జి నెహ్రూ నాయక్, జిల్లా నాణ్యత సమన్వయకర్త డా. బండారు మన్మోహన్, రిసోర్స్ పర్సన్లు, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాకు రాజకీయాలు ముఖ్యం కాదు

## రైతుల ప్రయోజనాలే ముఖ్యం

**సింగరేణి భరోసా యాత్ర ఎవరికోసం...?**

**కార్మికుల కోసమా సంస్థ కోసమా.? మీ రాజకీయాల కోసమా.?**

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**

**భూపాలపల్లి జులై 15 (వుదయం విలేకరి)**

మాకు రాజకీయాలు ముఖ్యం కాదు అని రైతుల ప్రయోజనాలే ముఖ్యం అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు బుధవారం భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, టీ బి జీ కె ఎస్, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీరు మంగళవారం గేట్ మీటింగ్ లో మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు.గత ఐదేళ్లు పర్యాటక మంత్రి, ఇప్పుడు కోల్ మినిస్టర్ గా ఉండి తెలంగాణకు ఒరుగబెట్టింది ఏమిటో తెలపాలన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి విషయంలో కేంద్ర ప్రభుత్వం విధానాలు చూస్తే సింగరేణి అంధకారంలోకి పోతుందని తమ పార్టీ ఎమ్మెల్యేలం, మంత్రులం అంతా కలిసి బొగ్గు బ్లాక్ లన్ని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ధర్నాలు రాస్తారోకోలు చేశామన్నారు. సింగరేణికి తాడిచర్ల–2 గని కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్నావూ అది గతంలోనే సింగరేణికి కేటాయించిన సంగతి తెలుసుకోవాలన్నారు. 2013లో కేటాయించిన ఆ బొగ్గు బ్లాక్ ను కేసీఆర్ పదేళ్ల కాలంలో ఆ ఫైళ్లను ప్రైవేటుపరం కాకుండా పెండింగ్లో పెట్టడం ద్వారా నేడు అది సింగరేణికి దక్కిందన్నారు. గత 16 నెలల కాలంగా సింగరేణిలో రెగ్యులర్ మెడికల్ బోర్డు లేదని, 3,000 మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం వెయిట్ చేస్తున్నారని, వారందరికీ మెడికల్ బోర్డు నిర్వహించి 100శాతం అన్‌ఫిట్ చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న డిపెండెంట్ లందరికీ ఉద్యోగాలు ఇస్తే భరోసా ఇచ్చినట్లే. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన రూ. 54 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలి. సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతిని అరికడతనని కార్మికుల మనోధైర్యాన్ని ఇచ్చారా.? బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం సింగరేణి భరోసా యాత్రను నిర్వహిస్తున్నావు...? తప్ప కార్మికుల ప్రయోజనాల కోసం కాదు. సింగరేణిని కేసీఆర్ దోచుకుతిన్నాడు అనడం సిగ్గు చేటు. కెసిఆర్ పాలనలో సింగరేణి కార్మికులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం పదవి చేపట్టిన కేసీఆర్ సింగరేణి సంస్థలు కాపాడుకోవాలని లక్ష్యంతో కార్మికులకు 32శాతం లాభాల వాటను ఇచ్చాడనీ, బీఆర్ఎస్ హయాంలో రామప్ప కాలనీలో కార్మికుల కుటుంబాలు నివసించడానికి 2వేల డబుల్ బెడ్ రూములు, నిర్మించామన్నారు. కేంద్ర మంత్ర కిషన్ రెడ్డి నువ్వు కేటీకే–8 ఇంక్లైన్ కు నిన్న పోయావు కదా...? రామప్ప కాలనీ నీకు కనబడలేదా...? అదేవిధంగా సింగరేణి కార్మికుల కోరిక మేరకు ఇంటింటికి గోదావరి శుద్ధ జనాలను అందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్న విషయాన్ని గుర్తుంచుకో..! కిషన్ రెడ్డి గత చరిత్రను తెలుసుకొని మాట్లాడాలి. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదివి, నిజాయితీపరులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరైనది కాదు. బొగ్గు లారీలు పోవడానికి "వన్ వే" అని అంటున్నావు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జిల్లా కేంద్రంలో వన్ వే ద్వారా ట్రాఫిక్ సమస్య ఉందని గ్రహించి, నేను



బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ. 130 కోట్ల నిధులు మంజూరు చేపించి, భూ సర్వే కూడా చేపించాను. ఈ విషయం మీ బిజెపి నాయకులకు తెలియదా...? కిషన్ రెడ్డి నిజ నిజాలు తెలుసుకొని మాట్లాడు. కెసిఆర్ 10 ఏండ్ల పాలనలో రూ. 25 వేలకోట్ల అప్పు చేశాడని అంటున్నావు. మరి నీ ఆప్తమిత్రుడు రేవంత్ రెడ్డి వచ్చిన రెండున్నర ఏండ్లలోనే రూ.30 వేల కోట్లకు పైగా అప్పు చేశాడు. దాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు. బిజెపి, కాంగ్రెస్ లు దొందు దొందేననన్నారు. బిజెపి కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్ లపై కార్మికులు నిన్ను మీటింగ్ లో ప్రశ్నిస్తే. వాళ్లకు నువ్వు ఏం సమాధానం చెప్పావో చెప్పు. నీ దగ్గర సరైనా సమాధానం లేక నీ ఉనుకదంపుడు మాటలు చెప్పి అవుతలపడ్డావు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లు నీ ఆప్త మిత్రులే కదా.దమ్ముంటే వాళ్లతో మాట్లాడి ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్నా మెడికల్ బోర్డును నిర్వహించేలా చూడు. గాలి, గారడి మాటలు మాట్లాడి వెళ్లిపోతే కార్మికులు బిజెపి, కాంగ్రెస్ లను నమ్మరన్నారు.నువ్వు చేసేది సింగరేణి భరోసా యాత్ర కాదని, కాంగ్రెస్ కు బ్రతుకు తెరువును చూపిస్తు న్న యాత్ర అని స్పష్టంగా కార్మికులకు అర్థమవుతుందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ యొక్క పంపులను ఆన్ చేసి రైతులకు నీళ్ళు ఇవ్వండి.పంపులు ఆన్ చేస్తే ప్రాజెక్ట్ కి ఏమైనా జరిగిన మా బిఆర్ఎస్ పార్టీ 28 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్ళీ రాజకీయాలు చెయ్యం అని సవాలు విసిరితే ఒక్కరూ కూడా సవాలు స్వీకరించలేదు.మాకు రాజకీయాలు ముఖ్యంకాదు మాకు రైతుల ప్రయోజనాలు ముఖ్యం అని తెలిపారు

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమాన్ని పారదర్శకంగా, గడువు లోగా పూర్తి చేయాలి.. కలెక్టర్

**ఖమ్మం, వుదయంబ్యూరో, జూలై- 15:**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (Special Intensive Revision–SIR) కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు.జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు, 12,43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 8,48,491 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. ఇది 68.22 శాతం పురోగతికి సమానమని, ఇంకా 3,95,290 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు.ఇప్పటికే డిజిటలైజ్ చేసిన వివరాల్లో సుమారు 72 వేల ఓట్లకు సంబంధించిన అనామలీలుగా గుర్తించామని, వాటిని రానున్న రెండు నెలల్లో విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. సుమారు 25 వేల మంది ఓటర్లు కేవలం ఎన్యూమరేషన్ ఫారాలను మాత్రమే సమర్పించి, అవసరమైన వివరాలు నమోదు చేయకపోవడంతో మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారులు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీచేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు. బీఎల్‌వోలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వీలైనంత ఎక్కువ మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా అందరూ కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కాని ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభమవుతుందని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా కూడా ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. ఎవరికైనా ఫారం అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి ఫారం తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగ డిటి అన్సారీ, అధికారులు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, మంకెన రమేష్, కె. వెంకట్ రావు, బిఆర్ఎస్పి ప్రతినిధి లింగనబోయిన సతీష్‌బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఎం పార్టీ ప్రతినిధి సిహెచ్. వెంకటేశ్వర్లు, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఓటర్ల ఫారాల డిజిటలైజేషన్‌లో పార్టీల ఏజెంట్లు పాల్గొనాలి

**గడువు వారం రోజులే.. ప్రత్యేక దృష్టి సారించండి**

**ములుగు జిల్లా ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి**

**ములుగు, జూలై 15 (వుదయం ప్రతినిధి):**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ–2026లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. జిల్లాలో డిజిటలైజేషన్ పూర్తి చేయడానికి కేవలం వారం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందన్నారు. బీఎల్ఏలు, బీఎల్‌వోలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ వార్డుల వారీగా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ముఖ్యంగా ములుగు మున్సిపాలిటీ, పసర (గోవిందరావుపేట), ఏటూరునాగారం, కమలాపూర్ (మంగపేట) పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ చూపి, ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించి బీఎల్‌వోలకు అందజేయడం ద్వారా నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌వో, తహసీల్దార్ విజయభాస్కర్, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆర్డీఎఫ్ కల్లెడ విద్యార్థిని మారపాక భానుప్రియ ఎంపిక

**పర్వతగిరి, జులై 15 ( వుదయం ప్రతినిధి ):**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం : కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్–వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని మారపాక భానుప్రియ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న మారపాక భానుప్రియ ఈ నెల 15న హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన అండర్–16 బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో ఒక కిలోమీటర్ పరుగు పందెంలో ప్రతిభ కనబర్చి, ఈ నెల 18న మెదక్ జిల్లా ఇందిరా గాంధీ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు అర్హత సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని మారపాక భానుప్రియతో పాటు ఆమెకు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్



రాజును కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబర్చి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ హెడ్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎ. రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సతీష్, అధ్యాపకులు జయశంకర్, మహేశ్వర్, సైదులు, సంతోష్, దంజ్య, విల్సన్ బాబు, వేణు, గుంషావళి, ప్రవీణ్, శ్రీలత, ధనలక్ష్మి , తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యార్థులకు ఐఓసీఎల్ సేవలు అమోఘం – ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లాతేది. 15.7.2026.**



బుధవారం భువనగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఐఓసీఎల్, నిర్మాణ్ సంస్థల ఆధ్వర్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ ల్యాబ్‌తో పాటు పలు మౌలిక సదుపాయాలను ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపి మాట్లడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.3.65 కోట్ల వ్యయంతో యాదాద్రి భువనగిరి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో ఐ–స్పార్క్ ల్యాబ్‌లు, బంకర్ బెడ్స్, సోలార్ ఫెన్సింగ్, మెష్ డోర్లు, కిటికీలు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారు కోరుకున్న రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, నిర్మాణ్ సంస్థలు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొంటూ, సంస్థల ప్రతినిధులను అభినందించారు.ఐఓసీఎల్ ప్రతినిధులు ఎలిమరన్, కైలాష్ కాంత్ మాట్లాడుతూ ప్రభుత్వంతో కలిసి గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నిర్మాణ్ సంస్థ ప్రతినిధులు అనురాధ, నీరజ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో తమ వంతు సహకారంకొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేష్ చిస్తీ, సెక్టోరియల్ అధికారులు సీహెచ్ రాధ, పెసరు లింగారెడ్డి, మండల విద్యాధికారి సీహెచ్ రంగరాజన్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## మౌలిక వసతులు కరువైన ఎర్రంపాడు గిరిజన ప్రాథమిక పాఠశాల

**ఆకస్మిక తనిఖీ చేసిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మురళి..**

**చర్ల/భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15 :(వుదయం ప్రతినిధి)**

చర్ల మండలంలోని అటవీ ప్రాంత గ్రామమైన ఎర్రంపాడు గిరిజన ప్రాథమిక పాఠశాలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మురళి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో ఆప్యాయంగా మమేకమైన ఆయన, కొంతసేపు తరగతి గదిలోనే విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడి పాత్రను పోషించారు. చిన్నారులతో మాట్లాడుతూ వారి చదువుల స్థాయిని తెలుసుకుని, పలు ప్రశ్నలు అడిగి వారిని ప్రోత్సహించారు.తనిఖీ సందర్భంగా గ్రామస్తులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో శాశ్వత ఉపాధ్యాయుడు లేకపోవడంతో డిప్యుటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయుడిపైనే విద్యా బోధన కొనసాగుతోందని తెలిపారు. దీంతో విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పాఠశాలలో సరైన మౌలిక వసతులు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా త్రాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు వివరించారు. అటవీ ప్రాంతంలో పాఠశాల ఉండటంతో పిల్లల భద్రత కోసం ప్రహరీ గోడ నిర్మాణం అత్యవసరమని, ప్రస్తుతం ప్రహరీ లేకపోవడంతో అడవి జంతువుల భయం, ఇతర ప్రమాదాలపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.మధ్యాహ్న భోజనం తయారీ కోసం వంట షెడ్డు లేకపోవడంతో ఇంట్లోనే వంట చేసి తీసుకెళ్లడం చాలా ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. పాఠశాలకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని వారు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు.గ్రామస్తుల



సమస్యలను ఓపికగా విన్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మురళి, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్తులు సహకరించాలని సూచించారు. పాఠశాలలో ఉన్న అన్ని సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుస్తులు, స్కూల్ బ్యాగులు ఏర్పాటు చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన ప్రకటించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ స్వయంగా గ్రామానికి వచ్చి పాఠశాలను పరిశీలించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాఠశాలలో చాలా కాలంగా ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విద్యార్థులతో కలిసి కూర్చొని పాఠాలు చెప్పడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం అక్కడి చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపగా, గ్రామస్తుల ప్రశంసలను అందుకుంది. అటవీ ప్రాంతంలోని గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కెళ్ళపల్లిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

**ఖానాపురం, జూలై 15 (వుదయం ప్రతినిధి):**



బిఆర్ఎస్ పార్టీ నర్సంపేట డివిజన్ కోఆర్డినేటర్ ఉమ్మడి జిల్లా పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు తక్కలపెల్లి రవీందర్ రావు అనారోగ్యానికి గురై హైదరాబాదులోని యశోద హాస్పిటల్లో చికిత్స పొంది కోలుకొని హైదరాబాదులోని తన కూతురు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బిఆర్ఎస్ పార్టీ డివిజన్ కోఆర్డినేటర్ ను నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్డీవో శ్రీదేవి భేటీ

**చండూరు/ నల్లగొండ, జూలై 15 (వుదయం):**

ఓటర్ల జాబితా రూపకల్పన, డిజిటలైజేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, పక్కాగా సాగాలని చండూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఆర్డీవో ఆఫీస్‌లో ట్రైనీ కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి, చండూరు ఆర్డీవో వి. శ్రీదేవి ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లతో (బీఎల్ఏలు) ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగాఅధికారులు మాట్లాడుతూ.. ఎన్నికల ఫారమ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అత్యంత నాణ్యతతో వేగంగా పూర్తి



చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పోలింగ్కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు–చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనలో ఏ చిన్న పొరపాటుకూ తావివ్వకూడదని అధికారులను ట్రైనీకలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ.. నిర్ణీత గడువులోగా ఈ డిజిటల్ ప్రక్రియ పూర్తయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు పూర్తిస్థాయిలో అధికారులకుసహకరించాలని కోరారు. పరస్పర సమన్వయంతోనే క్షేత్రస్థాయిలోఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు ముగుస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసమావేశంలో చండూరు మండల పరిధిలోని పలు రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలి: కలెక్టర్



**ఆదిలాబాద్, జూలై 15 (ఉదయం ప్రతినిధి):**

విద్యార్థులు సోషల్ మీడియా, రీల్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం సోనాల మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.విద్యార్థులకు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం రాగి జావ వంటి పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినుల్లో రక్త హీనత నివారణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జంక్ ఫుడ్స్, చిప్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో వచ్చే ఫిర్యాదులను హెచ్‌ఎం, కమిటీ సభ్యులు పరిశీలించి పరిష్కరిస్తారని చెప్పారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం కోసం ఏపీజే అబ్దుల్ కలాం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఎస్.ఆర్. శంకరన్ వంటి మహనీయుల జీవిత విశేషాలను పాఠ్యాంశాల్లో చేర్చినట్లు వివరించారు.మొబైల్ ఫోన్లను కేవలం చదువు కోసమే వినియోగించాలని, క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులకు సూచించిన కలెక్టర్, డీఆర్డీఓ సహకారంతో పాఠశాలలో న్యూట్రీ గార్డెన్, ప్రహరీ గోడ, కిచెన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే సోనాల మండలంలో కొత్త ఎంఆర్ఓ కార్యాలయ భవన నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం పాఠశాల గ్రంథాలయం, న్యూట్రీ గార్డెన్‌ను ప్రారంభించి మొక్క నాటారు. అనంతరం కంప్లైంట్ బాక్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఎంఆర్ఓ మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్ రావు, ఎంఈఓ ఉస్సేన్, సర్పంచ్ బిందుజ, ప్రధానోపాధ్యాయుడు సచిన్, విద్యాశాఖ సిబ్బంది అజయ్, వీడీసీ సభ్యుడు తుల శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి.. కలెక్టర్



**ఆసిఫాబాద్ (ఉదయం ప్రతినిధి)**

ప్రభుత్వ ఆసుపత్రులకు చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని ఈజీగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీలో భాగంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను పరిశీలించిన కలెక్టర్, ఆసుపత్రిలోని వార్డులనుసందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మందుల నిల్వ గది, స్టాక్ రిజిస్టర్లను నిశితంగా పరిశీలించారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారికి సరైన చికిత్స అందుతుందా, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో సీజనల్, అంటువ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందినాదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రంగా ఉంచాలనిపరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు వైద్యులు వైద్య సిబ్బంది ఉద్యోగులు సమయపాలన పాటించాలని ముందస్తు అనుమతి లేకుండా విధులకు హాజరు కానట్లయితే అలాంటి వారిపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష



**కామారెడ్డి, జూలై 15 (ఉదయం ప్రతినిధి):**

కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.సమగ్ర ఇంటింటి సర్వేగ్రామీణ మండలాల్లో సర్వే ప్రక్రియ ఆశించిన మేరకు కొనసాగుతుందని, పట్టణ ప్రాంతాలలో వేగవంతం చేయాలని సూచించారు.కామారెడ్డి మున్సిపాలిటీలో సర్వేను వేగవంతం చేసి ఎన్యుమరేషన్ ఫారంలను త్వరగా డిజిటలైజేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో రేషనలైజేషన్ చేపట్టి కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ సిఫారసులను 20వ తేదీ లోపు కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని ఈఆర్ఓలు, ఏఆర్ఓలకు ఆదేశించారు.భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కి వచ్చే భూ సమస్యలను వెలువెంటనే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు.తహసీల్దార్, ఎస్ ఆర్ ఓ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించి, కేటాయింపును త్వరగా పూర్తి చేయాలని సూచించారు. షాదీ ముబారక్ & కళ్యాణ లక్ష్మి దరఖాస్తులను పరిశీలించి, లబ్దిదారులకు నిధులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టుపై ఆధారపడ్డ 14 మండలాలు, రెండు మున్సిపాలిటీలలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున నీటి పరిరక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచిం చారు. ఎంపీడీవోలు, పీడీ డీఆర్‌డీవో, సంబంధిత అధికారులు నీటి సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను వెంటనే ప్రారంభించి పనులను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు.గృహ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని, డెమో ఆథెంటికేషన్ వంటి సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గరిష్టంగా వ్యక్తి పని దినాలు కల్పించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటరు ఎన్యుమరేషన్ మీ సేవ కేంద్రాల్లో ఉచితంగా నమోదు చేయవచ్చు..కలెక్టర్



**పెద్దపల్లి, జూలై - 15 (ఉదయం ప్రతినిధి)**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన Special Intensive Revision (SIR) కార్యక్రమంలో భాగంగా ఓటరు ఎన్యుమరేషన్ ఆన్లైన్ ప్రక్రియను మీ సేవ కేంద్రాల్లో ఉచితంగా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ప్రజల సౌకర్యార్థం మీ సేవ కేంద్రాల్లో ఓటరు ఎన్యుమరేషన్ ఆన్లైన్ ప్రక్రియను పూర్తిగా ఉచితంగా చేసే ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సేవకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు లేదా స్వయంగా దరఖాస్తు చేయలేని వారు తమ సమీపంలోని మీ సేవ కేంద్రం లేదా బూత్ లెవల్ ఆఫీసర్ (BLO) సహాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్యుమరేషన్ సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఓటర్లు Voters Portal ద్వారా కూడా ఇంటి నుంచే స్వయంగా ఎన్యుమరేషన్ సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం పోర్టల్‌లో మొబైల్ నంబర్ లేదా EPIC నంబర్‌తో లాగిన్ అయి, Special Intensive Revision (SIR) – Fill Enumeration Form (EF) ఎంపికను ఎంచుకుని, రాష్ట్రం, ఓటరు వివరాలు నమోదు చేయాలని సూచించారు.అనంతరం 2002 ప్రత్యేక ఓటరు జాబితా (SIR)కు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు తమ అసెంబ్లీ నియోజకవర్గం (AC), పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ వివరాలను నమోదు చేయాలని, ఒకవేళ 2002లో ఓటరుగా లేకపోతే పోర్టల్‌లోని Search Your Name in Last SIR సదుపాయం ద్వారా తల్లి దండ్రులు లేదా అర్హత కలిగిన సమీప బంధువుల 2002 SIR వివరాలను గుర్తించి నమోదు చేయవచ్చని వివరించారు.వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా, మొబైల్ నంబర్ తదితర సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలించి అవసరమైతే సవరించాలని, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి వివరాలను మరోసారి ధృవీకరించిన అనంతరం ఆన్లైన్లో సమర్పించాలని తెలిపారు. ఆన్లైన్లో ప్రక్రియ పూర్తయిన వెంటనే Acknowledgement / Reference Numberను డౌన్‌లోడ్ చేసుకుని లేదా స్క్రీన్‌షాట్ రూపంలో భద్రపరచుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి అర్హ ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా ఎన్యుమరేషన్ ఆన్లైన్ లో సమర్పించాలని కోరారు. సందేహాలు ఉన్న వారు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (BLO),ఎన్నికల అధికారులను లేదా సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నాణ్యమైన దర్యాప్తే లక్ష్యం.. నేరస్తులకు శిక్షే గమ్యం

**రాజన్న సిరిసిల్ల, జూలై 15 {ఉదయం ప్రతినిధి}:**

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్‌ను అమలు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వేములవాడ సబ్‌డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ, పోలీస్‌స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ–సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి ఆధునిక సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు.దొంగతనం కేసులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో త్వరితగతిన ఛేదించి, దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అతివేగంగా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, మొగిలి, మధుకర్, ఆర్‌ఐలు మధుకర్, సురేష్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జూలై 31లోగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి.. కలెక్టర్

**జగిత్యాల జులై 15 (ఉదయం ప్రతినిధి)**



జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2027–28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ (జే ఎన్ వి ఎస్ టి –2027) కు జిల్లాలోని అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు జూలై 31 2026 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు జిల్లాలో ప్రభుత్వ స్థానిక సంస్థలు ఎయిడెడ్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు దరఖాస్తుల సమర్పణకు జూలై 31 2026 చివరి తేదీ కాగా ప్రవేశ పరీక్ష 2026 నవంబర్ 28న నిర్వహించనున్నట్లు తెలిపారు జిల్లాలోని ప్రతి అర్హులైన విద్యార్థికి ఈ ప్రవేశ పరీక్షపై పూర్తి అవగాహన కల్పించి అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు నమోదయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు జిల్లా విద్యాశాఖ అధికారులు మండల విద్యాధికారులు ప్రభుత్వ స్థానిక సంస్థలు ఎయిడెడ్ గుర్తింపు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవసరమైన సూచనలు జారీ చేసి అర్హులైన ప్రతి ఐదో తరగతి విద్యార్థికి సమాచారం అందించడంతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో తల్లిదండ్రులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు మండలాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షిస్తూ గరిష్ట నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు జిల్లా పంచాయతీ శాఖ అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీల ద్వారా ప్రతి గ్రామంలో నోటిఫికేషన్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి గ్రామీణ ప్రాంతాల అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాణ్యమైన ఉచిత వసతి విద్యను అందించే ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జూలై 31లోగా తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ కోరారు.

## కుల సంఘాల భవనాలకు త్వరలోనే శ్రీకారం

**వేములవాడ, జూలై 15 {ఉదయంప్రతినిధి}:**

**మంజూరైన నాలుగు భవనాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం**

**మూడో బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన విప్ ఆది**



వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంజూరైన బీసీ భవన్, అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్టీ భవన్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.బుధవారం పట్టణంలో ఆయా భవనాల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఒక్కో భవనానికి రూ.1.30 కోట్ల చొప్పున నిధులు మంజూరుకాగా, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల కేటాయింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సౌకర్యాలతో భవనాలను నిర్మిస్తామని పేర్కొన్నారు. అనంతరం తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూడో బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు.తిప్పాపూర్ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులభంగా వెళ్లేందుకు నిర్మిస్తున్న సర్వీస్ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వేములవాడ పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు తూము మధు ఇప్పపూల అజయ్, కాంగ్రెస్ నాయకులు నాగుల విష్ణు ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నియోజకవర్గ నమోదు అధికారి సమీక్ష

**ధర్మపురి,జూలై 15(ఉదయం ప్రతినిధి):**

**వేగవంతం కావాల్సిన గణన పత్రాల సేకరణ, డిజిటలీకరణ**

**వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**ధర్మపురి తహశీల్దార్ కార్యాలయంలోకీలక సమావేశం**

**మెట్పల్లి ఆర్డీఓ జి.నరసింహారావు**



తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బుధవా రం ధర్మపురిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2026 కార్యక్రమంపై కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. 022– ధర్మ పురి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్ని కల నియోజకవర్గ నమోదు అధికారి,మెట్పల్లి ఆర్డీఓ జి.నరసింహా రావు అధ్యక్షతన గుర్తింపు పొంది న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ నమోదు అధికారి మాట్లా డుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణ– 2026 కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. నియో జకవర్గ వ్యాప్తంగా గణన పత్రాల సేకరణ,వాటి డిజిటలీకరణ పురో గతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయ డానికి రాజ కీయ పార్టీలు సహకరించాలని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. గణన పత్రాల సేకరణ, డిజిటలీకరణ ప్రక్రియలో వెనుకబడిన పోలింగ్ కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నియో జకవర్గ నమోదు అధికారి ఆదేశిం చారు. ఆయా కేంద్రాల పరిధిలోని బూత్ స్థాయి అధికారులు, రాజకీ య పార్టీల బూత్ స్థాయిప్రతినిధులు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఓటర్ల జాబితా పారదర్శ కంగా రూపొందేలా గణన పత్రాల సేకరణ, క్షేత్రస్థాయి ధృవీకరణ మరియు అంత ర్జాల డిజిటలీకర ణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, పర్యవేక్షకులు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

**నిజామాబాద్, జూలై 15 :**

**జిల్లా విద్యాశాఖ సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి**

**ఎస్సెస్సీ టాపర్లకు సన్మానం, నగదు ప్రోత్సాహకాలు అందజేత**



ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. జిల్లాలో ఉత్తీర్ణత మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం జిల్లా విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, గురుకులాల నిర్వహణ తీరుతెన్నులు, సాధించిన ఫలితాలు, మౌలిక సదుపాయాల స్థితిగతులు తదితర అంశాలపై సమీక్ష జరిపి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారని అన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం రాజీ పడబోదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక్కో విద్యా సంస్థకు 200 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని, ఇవి కాకుండా అన్ని రకాల అధునాతన సదుపాయాలతో ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మిస్తోందని గుర్తు చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా సాంకేతిక విద్యకు తోడ్పాటును అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమ బాధ్యతను గుర్తెరిగి నాణ్యమైన విద్యను బోధిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశాలు గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఆయా సబ్జెక్టులలో వెనుకంజలో ఉన్న విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తాము కృషి చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత మాత్రం ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. పీఎంశ్రీ పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వెనక్కి మళ్లిపోకుండా, ప్రతి పైసా వినియోగంలోకి వచ్చేలా నిర్దిష్ట గడువులోగా అదనపు తరగతి గదులు, ఇతర సౌకర్యాల మెరుగుదలకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, విద్యా రంగంలో నిజామాబాద్ జిల్లా పనితీరు సంతృప్తికరంగా ఉందని అన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులు ప్రవేశాల విషయంలో రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ఐదవ స్థానంలో ఉందని, ఈ నెలాఖరు వరకు లక్ష్యానికి అనుగుణంగా ప్రవేశాలు పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలుపుతామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 21శాతం మేర ఎక్కువ ప్రవేశాలు జరిగాయని, నెలాఖరు నాటికి మరో 7శాతం ప్రవేశాలు పెంపొందించేలా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను మండల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్.సీ.ఓలు, జిల్లా అధికారులు సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా ప్రతి పాఠశాలలో ఆహార భద్రతా కమిటీలను ఏర్పాటు చేయించామని తెలిపారు.

## బాసర ఐఐఐటిలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

**నిర్మల్ జిల్లా 15 జూలై 2026 (ఉదయం ప్రతినిధి)**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం**



బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటి) విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా అధికారులు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం ఆయన వర్సిటీని సందర్శించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాంపస్‌లో విద్యార్థులకు నిరంతర విద్యుత్, సురక్షిత త్రాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఏ విద్యార్థీ చదువు మధ్యలో ఆపేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, చదువు పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యా బోధన తీరుపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యా ప్రమాణాలను పెంచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సంగారెడ్డి మున్సిపాలిటీలో జవాన్ ఆగడాలపై ఆరోపణలు

- సఫాయి కార్మికులకు బెదిరింపులు..
- కాలనీవాసితో దురుసు ప్రవర్తన



**సంగారెడ్డి, జూలై 15,(వుదయం):**

సంగారెడ్డి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న జవాన్ ఆంజనేయులుపై అధికార దుర్వినియోగం, సఫాయి కార్మికులను బెదిరించడం, కాలనీవాసులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.స్థానికుల కథనం ప్రకారం, 37వ వార్డులో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు "నేను చెప్పిన చోటే పని చేయాలి.. లేదంటే ఉద్యోగం నుంచి తీసేస్తాను" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు.వివేకానగర్ కాలనీలోని సీపీఎం కార్యాలయం సమీపంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండగా, స్థానికులు ఈ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పై అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ, కాలనీవాసి ఒకరు దీనిపై ఆంజనేయులను ప్రశ్నించగా, అతను దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. "ఏం చేసుకుంటావో చేసుకో..నేను ఎవరికీ వినే వ్యక్తిని కాదు.. నాకు నా నెట్‌వర్క్ ఉంది" అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా, సంబంధిత ఉద్యోగిపై గతంలో కూడా ఇలాంటి ఫిర్యాదులు వచ్చాయని, పలు మార్లు మందలించినట్లు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి, ఆరోపణలు నిజమైతే తగిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెల్లడించారు.

## గ్రామాల రీసర్వేకు లైసెన్స్ సర్వేయర్లు సహకరించాలి

**గద్వాల, జూలై 15 (వుదయం కరస్పాండెంట్):**

ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు జిల్లాలో మొదటి దశలో 70 గ్రామాలను ఎంపిక చేసిందని, లైసెన్స్ సర్వేయర్లకు సహకరించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రీసర్వేకు సంబంధించి జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్లతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల రీసర్వేకు నిర్ణయించినందున లైసెన్స్ పొందిన సర్వేయర్లకు పారితోషికం చెల్లించి సర్వే పనులు చేయించుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే పారితోషికం సరిపోదనే విమర్శలు చేయకుండా భవిష్యత్తులో లైసెన్స్ సర్వేయర్లకు మంచి అవకాశాలు వస్తాయనే ఆశాభావ దృక్పథంతో ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు లైసెన్స్ సర్వేయర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు సర్వేకు సంబంధించి శిక్షణ ఇచ్చి అర్హులైన వారందరికీ లైసెన్స్ సర్వేయర్లుగా గుర్తింపు ఇచ్చినప్పటికి తమకు స్థిరమైన ఉపాధి, ఆదాయ అవకాశాలు ఇవ్వనందున ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామాల రీసర్వేకు తమ సేవలందించాలంటే ప్రభుత్వం పారితోషికం పెంచాలని, టిఏ, డిఏ, తదితర అలవెన్స్ లు కల్పించాలన్నారు. లేదంటే ప్రతినెల కనీస వేతనంగా తమకు రూ.30000 చొప్పున చెల్లించాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో సర్వే ఏడి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.



## సివిల్స్ పరీక్షలు రాసేందుకు ఉచిత శిక్షణ

**గద్వాల, జూలై 15 (వుదయం బ్యూరో):**

బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ లో సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష 2027 రాసేందుకు అర్హులైన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు గద్వాల బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన 35 సంవత్సరాలలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఆగస్టు 16న నిర్వహించే రాత పరీక్ష ద్వారా ఎంపికైన 150 మంది అభ్యర్థులకు ఆగస్టు 24 నుంచి హైదరాబాదులో 10 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 17 నుంచి ఆగస్టు 7వ తేదీలోగా www.tgbcstudycircle.cgg.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతికై నెలకు రూ.5000 స్టైఫండ్ చెల్లిస్తారని, స్టడీ మెటీరియల్ కు రూ. 5000 ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత వాసులకు రూ.2.00 లక్షల లోపు మాత్రమే ఉండాలన్నారు. అర్హులైన వారిలో నుంచి 75 శాతం సీట్లు బీసీలకు, మిగిలిన 25 శాతం సీట్లు ఇతరులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల నిరుద్యోగులు వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు 08546293022, 9985434941 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## కుల అహంకారంతో మాట్లాడిన శివచరణ్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలి

- బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జి. రంగప్ప యాదవ్

**నారాయణపేట జూలై 15 (వుదయం ప్రతినిధి)**



గౌడ సమాజం పైన యాదవ మహిళ ఈశ్వరమ్మ ను బూతులు తిడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసి దూషించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేసి క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్రకోశాధికారి జి.రంగప్ప యాదవ్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు, 82 ఏళ్ల బీసీ యాదవ మహిళ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసిన అనుచిత, కుల అహంకారపూరిత వ్యాఖ్యలను బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించిందని వెంటనే ఆయనను కాంగ్రెస్ పార్టీ నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫ్లెక్సీలో తన తండ్రి ఫోటో లేదనే కారణంతో ఈశ్వరమ్మ యాదవ్ ని శివచరణ్ రెడ్డి దూషించడమే కాకుండా కుల అహంకారంతో మాట్లాడిన శివచరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని, ప్రాథమిక సభ్యత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా గౌరవించి బోర్డు సభ్యురాలిగా నియమిస్తే, దాన్ని ఓర్చుకోలేక ఒక వర్గం ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ లకు పదవులు వస్తే రెడ్డి నాయకులు ఎందుకు ఓర్చుకోలేకపోతున్నారు? కాంగ్రెస్ పార్టీ కేవలం రెడ్డిల పార్టీయా? బీసీలకు విలువ లేదా అని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు ప్రశ్నించారు. శివచరణ్ రెడ్డి వెంటనే బహిరంగంగా ఈశ్వరమ్మ యాదవ్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**మెదక్ జిల్లా వుదయం :**

నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ సమీర్ ఇటీవల చెరువులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటనను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు గౌస్, జిల్లా లక్ష్మణ్ గౌడ్, భాస్కర్, జెడ్ చెరువు గ్రామ సర్పంచ్ బాబు నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



- ముఖ్య అతిథులుగా రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశ్య పద్మ హాజరు
- నూతన కమిటీకి అభినందనలు తెలిపిన జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్

**వికారాబాద్ జులై 16 (వుదయం బ్యూరో)**

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, కమిటీ ఎన్నికకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశ్య పద్మ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సమావేశం జిల్లా కేంద్రంలో నిర్వహించారు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా జి. హనుమంతు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా లోకేష్ రాథోడ్, కె. అంజిలయ్య, విమలమ్మ, హుస్సేనప్ప, నర్సింలు, బోయిని రాజు, ఆంజనేయులు, మంగమ్మ, అంజిలప్ప, నరసింహులు, నందన్, అనంతయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, మాపై నమ్మకం ఉంచి నూతన జిల్లా కమిటీలోకి తీసుకున్న జిల్లా, రాష్ట్ర నాయకులకు నూతన కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన జిల్లా రైతు సంఘం కమిటీకి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ అభినందనలు తెలిపారు. రైతు సమస్యలపై నిరంతరం నూతన కమిటీ అధ్యయనం చేసి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి పాశ్య పద్మ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన నూనె కుమార్

**వుదయం న్యూస్, కొండపాక ప్రతినిధి జూలై 15:**

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పెద్ద వరం లాంటిది అన్నారు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్. బుధవారం రోజులబ్ధిదారులు అయిన మీసం నర్సింలు కు 46,500, పిల్లి అనిల్ కుమార్ కు 26000, బైరి యాదగిరి కి 14,500, జక్కుల మల్లయ్య కు 10500, చిలుముల ప్రియాంక కు 11000, పేర్ల కవిత కు 12000 రూపాయల చెక్కులను దుద్దెడ మాజీ సర్పంచ్ పెద్దంకుల శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకుడు గోనె శ్రీనివాసులతో కలిసి అందించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొండపాక మండలంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రతి ఒక్కరు కూడా సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైద్యం చేయించుకునే కంటే ముందు ఎల్వో సి ఇప్పించి కూడా వైద్యం అందేలా ప్రయత్నం చేస్తామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వందశాతం సహాయం అందేదని, కానీ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల ఆ సహాయం 30శాతానికి పడిపోయిందని, అదే కాకుండా కొంతమంది కాంగ్రెస్ నాయకుల వల్ల లబ్ధిదారులకు అందవలసిన ముఖ్యమంత్రి సహాయ నిధి అందని ద్రాక్ష లాగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని లబ్ధిదారులకు పూర్తిస్థాయిలోముఖ్యమంత్రి సహాయనిధి అందించాలని డిమాండ్ చేశారు.ఈ చెక్కులు మంజూరు కావడానికి సహాయ సహకారాలు అందించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి లకు లబ్ధిదారుల తరపునకృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆరెస్ పార్టీ యూత్ అధ్యక్షులు చిక్కుడు బాను ముదిరాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పల్లె బాబు, మైనార్టీ నాయకులు ఎండి మగ్దుమ్, విద్యార్థి నాయకులు పబ్బోజు వినయ్, నాయకులు ఎండి అస్లాం, చిలుముల వెంకటేష్, మీసం కరుణాకర్, పేర్ల రాజు, శివ, సంతోష్ పాల్గొన్నారు.





## న్యాయవాదిపై దాడికి నిరసనగా కోర్టు విడుదల బహిష్కరణ

- పేట ఎస్ పి ని కలిసిన న్యాయవాదులు

**నారాయణపేట, జూలై 15 (వుదయం ప్రతినిధి):**

న్యాయవాది ఉండేకొడ్ నీరజ్ పై దాడికి నిరసనగా బుధవారం నారాయణపేట జిల్లా కోర్టులో న్యాయవాదు లు కోర్టు విధులను బహిష్క రించారు.నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో బాధితునికి సహకరించక నిర్లక్ష్యం వహించిన పోలీస్ అధికారులుసంబంధిత ఎస్సై ,సీఐలను సస్పెండ్ చేయాలని జిల్లా ఎస్పీని కలిసిన సంగతి నారాయణపేట న్యాయవాదులు కోరారు.తన పట్టా భూమి పై సాగు చేసుకుంటున్న న్యాయవా ది నీరజ్ పై పక్క పట్టాదా రులు విచక్షణ రైతంగా లాఠీలతో కర్రలతో దాడి చేసి గాయపరిచిన వ్యక్తు లపై నామమాత్రపు కేసు వేసి వారి వైపే మద్దతు ఇస్తున్న సంబంధిత ఎస్ఐ సీఐలను సస్పెండ్ చేయాల ని న్యాయవాదిని తీవ్రంగా గాయపరిచి వారిపై హత్యాయత్నం చేసిన నిందితులపై బి ఎన్ ఎస్ హత్యాయత్నం కేసును చేయాలని నారాయణపేట న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో దామోదర్ గౌడ్ అధ్యక్షతన తమ విధులను బహిష్కరించి కోర్టు నుండి ఎస్పీ ఆఫీసు వరకు పాదయాత్రగా బయ లుదేరి వారికి చట్టపరమైన చర్యల గురించి ఎస్పి కి వినతి పత్రాన్ని నారాయ ణపేట న్యాయవాదులు సమర్పించారు. ఈ విష యంలో బాధితునికి బాధిత న్యాయవాదికి పూర్తి న్యాయం జరిగే విధంగా ఎలాంటి పక్షపాతం లేకుండా నిర్ణయాలు ఉంటాయని నారాయణపేట న్యాయవాదులకు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం న్యాయవాది రఘువీర్ యాదవ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం చెన్నారెడ్డి, కార్యదర్శి అమీరుద్దీన్, న్యాయవాదులు కురుమన్న గౌడ్ , నరసింహులు యాదవ్, టి రామచంద్రయ్య, ప్రవీణ్ కుమార్ నామాజీ, వినోద్ ,ఆడెం శ్రీనివాస్, దత్తాత్రేయ ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంలో న్యాయవాదికి పూర్తి న్యాయం చేసే వరకు నారాయణపేట తో సహా ఉమ్మడి పాలమూరు జిల్లా న్యాయవాద సంఘాలన్నీ మద్దతు తెలిపాలని నారాయణపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ కోరారు. జిల్లా ఎస్పీ ఇచ్చిన హామీ మేరకు వారు తీసు కొనే తదుపరి చర్యలు అనంతరము న్యాయవాద సంఘాలు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు.

## గాలికొదిలేసిన 'ఇంటింటి సర్వే'.. పంచాయతీల వద్దే ఓటర్ల వివరాల సేకరణ!

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్.. క్షేత్రస్థాయికి వెళ్లని బీఎల్వోలు
- ఆన్‌లైన్ చేయడానికి సమయం సరిపోవడం లేదని సిబ్బంది ఆవేదన
- ఓట్లు గల్లంతవుతాయేమోనని గ్రామీణ ప్రజల ఆందోళన

**సిద్దిపేట, జులై 15 (వుదయం బ్యూరో):**

ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR) ప్రక్రియ సిద్దిపేట జిల్లాలో గందరగోళంగా మారింది. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలు, ఓటర్ల సమాచారాన్ని సేకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు తప్పులను సరిదిద్దాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు) కలెక్టర్ ఆదేశాలను పక్కనబెట్టి తమకు తోచినట్లు వ్యవహరిస్తున్నారు.

**గ్రామ పంచాయతీల వద్దే తంతు :**

నిబంధనల ప్రకారం బీఎల్వోలు ప్రతి ఇంటికీ తిరిగి ఫారాలు నింపాలి. కానీ, జిల్లాలోని మెజారిటీ గ్రామాల్లో అధికారులు ఇళ్ల వద్దకు వెళ్లడం లేదు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్దో లేదా ఒకే చోట కూర్చొని ఓటర్లను అక్కడికే పిలిపించుకుంటున్నారు. ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తూ.. "మీరే వచ్చి వివరాలు చెప్పండి" అంటూ ప్రజలపై భారం వేస్తున్నారు. దీనివల్ల వృద్ధులు, మహిళలు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు బీఎల్వోలు ఫారాలు నింపడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




**సమయం సరిపోవడం లేదు: బీఎల్వోల వాదన**

ఈ విషయమై కొందరు బీఎల్వోలను వివరణ కోరగా.. తమపై ఉన్న పని భారాన్ని సాకుగా చూపుతున్నారు. "ఒక్కో బీఎల్వో వందలాది కుటుంబాల వివరాలు సేకరించాలి. ఈ వివరాలన్నింటినీ మళ్లీ డిజిటల్ (ఆన్‌లైన్) చేయడానికి సమయం అస్సలు సరిపోవడం లేదు. ఒకవైపు ఆన్‌లైన్ గడువు ముంచుకొస్తుంటే, మరోవైపు ప్రతి ఇంటికీ తిరగడం ఇబ్బందిగా మారింది" అని వారు వాపోతున్నారు. తగినంత సమయం ఇవ్వకపోవడం వల్లే ఇలా ఒకే చోట కూర్చొని వివరాలు సేకరించాల్సి వస్తోందని క్షేత్ర స్థాయి సిబ్బంది చెప్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ఈ అరకొర సర్వేల వల్ల తమ ఓట్లు ఎక్కడ గల్లంతవుతాయోనని జిల్లా ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇంటికి రాకుండా కేవలం పిలిపించుకుని రాసుకోవడం వల్ల చాలామంది వివరాలు నమోదు కాకుండా పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, గడువు పొడిగించడమో లేదా అదనపు సిబ్బందిని నియమించడమో చేసి, కచ్చితంగా ఇంటింటి సర్వే జరిగేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



## పాత బస్టాండ్‌లోనే ఎమ్మార్వో కార్యాలయ భవన నిర్మాణం చేపట్టాలి

**మెదక్ జిల్లా ,వుదయం:**

నిజాంపేట మండల కేంద్రంలో నూతన ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని గతంలో కార్యాలయానికి దానంగా ఇచ్చిన స్థలంలోనే నిర్మించాలని మండల వాసులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామానికి చెందిన చిన్నపైడి శ్రీనివాస్ రెడ్డి సర్వే నంబర్ 4,5,6, లో గల 1 ఎకరం 20 గుంటల స్థలాన్ని ఎమ్మార్వో కార్యాలయ నిర్మాణం కోసం గతంలో దానంగా అందజేశారు.ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవతో నూతన ఎమ్మార్వో కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేసింది.ఈ నేపథ్యంలో ఇప్పటికే కార్యాలయానికి కేటాయించిన స్థలంలోనే భవన నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.మండల కేంద్రం ఏర్పడి దాదాపు పదేళ్లు గడిచినా పాత బస్టాండ్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత బస్టాండ్ సమీపంలో ఎమ్మార్వో కార్యాలయంతో పాటు ఆర్టీసీ బస్టాండ్‌కు కేటాయించిన స్థలాల్లో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడుతున్నారు.

## పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సమగ్ర సమీక్షా సమావేశం

**వికారాబాద్,జూలై 15; (వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, నేడు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూ.ఐ. (UI), లాంగ్ పెండింగ్, అరెస్ట్ పెండింగ్, పోక్సో, ఎఫ్ఎస్ఎల్ (FSL) పెండింగ్ నివేదికలు, గ్రేవ్ యూ.ఐ. కేసులు, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలు, రోడ్డు ప్రమాదాలు, మిస్సింగ్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, సీసీటీఎన్ఎస్ (CCTNS), ఈసాక్ష్య (eSakshya), సీసీటీవీ ఏర్పాటు, స్టేషన్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి పోలీస్ స్టేషన్‌లోని పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలించిన ఎస్పీ గారు, దర్యాప్తు అధికారులు ఆలస్యం లేకుండా నాణ్యమైన విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదికలు, సీసీటీవీ ఫుటేజ్, డిజిటల్ సాక్ష్యాలు, సాంకేతిక విశ్లేషణ వంటి ఆధునిక దర్యాప్తు పద్ధతులను వినియోగించి బలమైన సాక్ష్యాధారాలతో కేసులను కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు.మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో, అత్యాచార, హత్య కేసులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అరెస్ట్ పెండింగ్ కేసుల్లో నిందితులను త్వరగా అరెస్ట్ చేసి, లాంగ్ పెండింగ్ కేసులను ప్రత్యేక కార్యాచరణతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.మూఢనమ్మకాల పేరుతో జరిగే బాణామతి, చేతబడి వంటి చట్టవిరుద్ధ చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే బ్యాంకులు, ఏటీఎంలు, బంగారం దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో నిఘా పెంచి ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టాలని సూచించారు. పొలాల చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి కరెంట్ ప్రవహింపజేయడం వల్ల మానవ ప్రాణాలు, వన్య ప్రాణులకు ప్రమాదం ఏర్పడుతున్న నేపథ్యంలో అలాంటి ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. PDS బియ్యం అక్రమ రవాణా, గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ ఇసుక రవాణా, గేమింగ్/జూదం, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్‌లోడ్ వాహనాలపై నిరంతర ఎన్ఫోర్స్‌మెంట్ కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో CCTNS, eSakshya అప్‌డేట్లు, కేసు డాక్యుమెంటేషన్‌ను సకాలంలో పూర్తి చేసి, స్టేషన్‌లను ప్రజలకు అనుకూలంగా నిర్వహించాలని సూచించారు. "వికారాబాద్ రక్షణ నేత్రం" ద్వారా జిల్లాలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటును మరింత విస్తరించాలని, "వికారాబాద్ సురక్ష మిత్ర" కార్యక్రమం ద్వారా డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, మహిళాశిశు భద్రత, రోడ్డు భద్రతపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.సమీక్షా సమావేశంలో భాగంగా NDPS, హత్య, పోక్సో, అత్యాచార, రోడ్డు ప్రమాదాలు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద నమోదయ్యే కేసుల దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, కేసు డాక్యుమెంటేషన్, కోర్టు విచారణ విధానాలపై పోలీసు అధికారులకు పిపిటి ల ద్వారా ప్రత్యేక శిక్షణ కూడా నిర్వహించారు.ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాస్ (డీటీసీ), జనయ్య (డీసీఆర్‌బీ), అంజయ్య (వికారాబాద్), ఎన్. యాదయ్య (తాండూరు), శ్రీనివాస్ (పరిగి), జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ, వివిధ విభాగాల అధికారులు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.




## రోడ్డు ప్రమాదాల మీద అవగాహన



- రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి
- క్రీడలు వికాసం తో
- యువతకు గుర్తింపు తెస్తాయి.
- జిన్ గుర్తి లో శ్రీనివాస్ స్మారకార్తం హెల్మెట్ లో పంపిణీ చేసిన మహేందర్ రెడ్డి

**తాండూరు 15 జూలై వుదయం ప్రతినిధి:**

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలిని, రోడ్డు ప్రమాదాల మీద ప్రతీ ఒక్కరికీ అవగాహన పెంచుదామని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం జినుగుర్తి ప్రభుత్వ పాఠశాలలో శ్రీనివాస్ గ్రామీణ వాలీబాల్ టోర్నమెంట్ను నిర్వహించిన తండ్రి పందుకొట్టే రాములు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ చీఫ్ విప్, శాసనమండలి సభ్యులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక,మానసిక వికాసం కోసం ఎంతో తోడ్పడుతుందని అన్నారు.జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రాణిస్తే యువతకు గుర్తింపు వస్తుందని వెల్లడించారు.దివంగత తమ సోదరుడు పట్నం రాజేందర్ రెడ్డి పేరు పైన ప్రతి ఏటా యువతకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.తాండూర్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రజలు అవకాశం కల్పించారని, అభివృద్ధికి తపించానని, ఎంతో అభివృద్ధి చేశామని ఆయన వివరించారు. టీపీసిసి ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తమరావు, సీనియర్ నాయకుడు డాక్టర్ సంపత్, మాజీ ఎంపీపీ రామలింగారెడ్డి, వడ్డెర సంఘం నేతబీ . రాములు, ఎమ్మార్పీఎస్ నాయకుడు నరసింహులు, సర్పంచులు శరణయ్య, పరుశురాం, మాజీ ఎంపీటీసీ శామప్ప, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి , రత్నమ్మ లు, శేఖర్, వెంకట్ రెడ్డి శ్రీధర్ గౌడ్ , గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కన్న కొడుకు జ్ఞాపకార్థం

- పదిమంది బిడ్డల ప్రాణాలు కాపాడే 'రక్షా కవచం'!
- స్వర్గీయ శ్రీనివాస్ స్మారకార్థం గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్
- యువతకు హెల్మెట్లు అందించి కన్నీటి నివాళులర్పించిన తల్లిదండ్రులు, తెలంగాణ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి

**తాండూర్, జూలై 15 వుదయం ప్రతినిధి:**

కన్న కడుపు తీపి కంటే లోకంలో బలమైనది ఏదీ లేదు. గుండెల మీద పెరిగి, కళ్ల ముందే తిరుగుతూ.. అనంత లోకాలకు వెళ్లిన కొడుకు జ్ఞాపకాలు ఆ కన్నవారిని క్షణం కూడా ప్రశాంతంగా ఉండనివ్వవు. కానీ, "మా బిడ్డ దూరమైనా పర్వాలేదు.. ఊరిలోని ఏ తల్లిదండ్రులకూ ఈ కడుపు కోత మిగలకూడదు" అనుకున్నారు ఆ తల్లిదండ్రులు. తమ ముద్దుల కొడుకు శ్రీనివాస్ జ్ఞాపకార్థం వారు చేసిన సంకల్పం.. గ్రామంలోని ఎందరో యువకులకు రక్షణ కవచంగా నిలిచింది.

**కన్నీటి నివాళి.. క్రీడా స్ఫూర్తిగా!**

కన్న కొడుకు శ్రీనివాస్ జ్ఞాపకాలను సజీవంగా ఉంచేందుకు బుధవారం జినుగుర్తి ప్రభుత్వ పాఠశాలలో గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రీడా సంబరాన్ని తండ్రి రాములు తన భుజాలపై వేసుకుని, శ్రీనివాస్ తల్లిదండ్రుల ఆశయాలకు రూపకల్పన చేస్తూ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆటస్థలమంతా శ్రీనివాస్ చిరునవ్వులు చిందిస్తున్న ఫ్లెక్సీలు చూసి, ఆటగాళ్లతో పాటు గ్రామస్థుల కళ్లు కూడా చెమర్చాయి.'ఏ తల్లీ కన్నీరు కార్చకూడదు'.. హెల్మెట్లు పంపిణీ చేసిన చీఫ్ విప్ మహేందర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి శ్రీనివాస్ తల్లిదండ్రుల బాధను చూసి చలించిపోయారు. "- మహేందర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్శ్రీనివాస్ జ్ఞాపకార్థం చీఫ్ విప్ మహేందర్ రెడ్డి చేతుల మీదుగా గ్రామంలోని వందలాది మంది యువతకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఆ హెల్మెట్లను అందుకుంటున్నప్పుడు.. కన్న కొడుకు రూపంలోనే శ్రీనివాస్ మళ్లీ తమ ముందుకు వచ్చి తమను కాపాడుతున్నట్లుగా తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమములో డాక్టర్ సంపత్ కుమార్, గ్రామ సర్పంచ్ శరన్ స్వామి, రామ్ లింగారెడ్డి, ప్రవీణ్ గౌడ్, మల్కాపూర్ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి పండరి, వడ్డే వెంకటయ్య, వడ్డే బందప్ప,, కుటుంబ సభ్యులు సిరియాల శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ నర్సిములు, శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు వల్లెపు శివకుమార్ రాష్ట్ర వడ్డెర సంఘం మహిళా అధ్యక్షురాలు భవాని వడ్డెర సంఘం మండల అధ్యక్షులు బందన్న, సిరిగిరిపేట మొగులప్ప, మల్కాపూర్ సర్పంచ్ పండరి, మైనుద్దీన్ మల్కాపూర్, ఉపాధ్యాయులు నాగప్ప సార్.



## ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి




- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, జూలై 15; (వుదయం జిల్లా ప్రతినిధి):**

ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు పంట నిర్వహణ, ఆధునిక సాగు పద్ధతులు, వాతావరణ మార్పుల ప్రభావంపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు ఎప్పటికప్పుడు అందించాలని, గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించాలని, పంటలో ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి కవిత , ఉద్యానవన శాఖ అధికారి మహమ్మద్ సత్తార్,ఇరుగేషన్ అధికారి అశోక్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ వెంచర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల దుర్వినియోగం

**ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం**

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ**

భూపాలపల్లి జులై 15(వుదయం విలేకరి) భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలో ప్రజాధనం దుర్వినియోగమవుతోందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు గ్రామంలోని ఓ అగ్రవర్గానికి చెందిన కాలనీ అని పిలిచే ఓ ప్రైవేట్ వెంచర్‌లో ఎన్ఆర్ఈజీఎస్ కు చెందిన నిధులతో సిసి రోడ్ నిర్మిస్తున్నారని పేర్కొన్నారు గ్రామ ప్రజల సంక్షేమానికి, ఉపాధి కల్పనకు ఉపయోగించాల్సిన ప్రభుత్వ నిధులను ప్రైవేట్ వ్యక్తుల లాభం కోసం వెంచర్లలో రోడ్ల నిర్మాణానికి మళ్లించడం సరికాదన్నారు కొంతమంది ప్రభుత్వ అధికారులు స్థానిక నాయకులు కుమ్మక్కై ఈ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆవేదనతో ఆరోపించారు ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు ప్రజాధనం దుర్వినియోగంపై వెంటనే ఉన్నతాధికారులు విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టైక్వాండోలో విద్యార్థికి ‘గిన్నిస్ వరల్డ్ రికార్డ్’

వరంగల్ టౌన్, జూలై 15 (వుదయం ప్రతినిధి) : హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన మెగా అచీవ్మెంట్ పోటీల్లో వరంగల్ కొత్తవాడకు చెందిన విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచాడు. దేశవ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో, 40 నిమిషాల పాటు ఏకధాటిగా ‘కిక్స్ అండ్ పంచెస్’ చేసి సత్తా చాటిన 1,212 మంది క్రీడాకారులు గిన్నిస్ రికార్డుకు క్వాలిఫై అయ్యారు. ఇందులో వరంగల్ కొత్తవాడలోని ‘గోల్డెన్ కిడ్స్ హై స్కూల్’లో 9వ తరగతి చదువుతున్న మహ్మద్ ఇర్ఫాన్ పాల్గొని, గిన్నిస్ వరల్డ్ రికార్డుతో పాటు గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు.?పాఠశాలలో ఘన సన్మానం:వరల్డ్ రికార్డు సాధించి నగరానికి తిరిగి వచ్చిన ఇర్ఫాన్‌ను గోల్డెన్ కిడ్స్ హై స్కూల్ కరస్పాండెంట్ సుజాత, ప్రిన్సిపాల్ మాధవి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదలను అలవర్చుకుని క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. గిన్నిస్ రికార్డు సాధించిన ఇర్ఫాన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొని ఇర్ఫాన్‌కు అభినందనలు తెలిపారు.



## కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు మృతి.


**శ్రద్ధాంజలి ఘటించిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఎల్లగౌడ్.**



ఖానాపురం, జులై 15 (వుదయం ప్రతినిధి):మండలంలోని బుధరావుపేట గ్రామ శివారు రామలింగయ్య పల్లెకి చెందిన కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు గోదెల కిరణ్ (25) మృతి చెందగా మృతదేహాన్ని యువజన కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్ సందర్శించి హృదయంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, నాయకులు షేక్ యాకుబ్, అబ్బడి శ్రీనివాస్, పాషా, జబ్బర్, నజీర్, నగరబోయిన మహేష్, అక్రమ్, జాగిళ్ల సాగర్ జిలానీ, పరిటాల వరుణ్,ఆఫ్రోజ్, తదితరులు పాల్గొనారు.

## వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా నీమ్మాని శేఖర్‌రావు

వర్ధన్నపేట జులై 15 (వుదయం ప్రతినిధి): వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వర్ధన్నపేట నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీమ్మాని శేఖర్‌రావును పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ నాయకత్వం అధికారికంగా ప్రకటించింది.ఆయన నియామకంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది.



ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి నీమ్మాని శేఖర్‌రావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, ప్రజా సమస్యలపై పార్టీ తరఫున సమర్థవంతంగా స్పందించడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తానని చెప్పారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి నాయకులు, కార్యకర్తలతో సమన్వయంగా పనిచేస్తానని, పార్టీ ప్రతిష్ఠను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.నీమ్మాని శేఖర్‌రావు నియామకాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రేమించినందుకు దళిత యువకుడి దారుణ హత్య

**కుల పరువు పేరుతో హత్య చేశారని ఎమ్మార్పీఎస్ ఆగ్రహం..**



వర్ధన్నపేట జులై 15 (వుదయం ప్రతినిధి): మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సిన్నపల్లి భాస్కర్ (మాదిగ) , యాదవ సామాజిక వర్గానికి చెందిన తమ్మడబోయిన నికిత పరస్పరం ప్రేమించుకున్నారని గ్రామస్థులు తెలిపారు. ఈ ప్రేమ వ్యవహారాన్ని నికిత తండ్రి తమ్మడబోయిన రాజు వ్యతిరేకించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కులాంతర ప్రేమను అంగీకరించకుండా, భాస్కర్‌ను ప్రేమించవద్దని కుమార్తెకు చెప్పినా ఆమె అంగీకరించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఒక హోటల్‌లో పనిచేస్తున్న సిన్నపల్లి భాస్కర్‌ను తమ్మడబోయిన రాజు మరికొందరితో కలిసి హత్య చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనను కుల పరువు హత్యగా పేర్కొంటూ ఎమ్మార్పీఎస్ గ్రామ, మండల నాయకత్వంలో ఉప్పరపల్లి గ్రామంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ, ఈ ఘటనలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించిన వారందరిపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకోవాలని, పోలీసులు ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని కోరారు. హత్యకు గురైన దళిత యువకుడు సిన్నపల్లి భాస్కర్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గోలి సుధాకర్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు చాడ కరుణాకర్ మాదిగతో పాటు గ్రామస్తులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారూ.

## డీసీసీ ఉపాధ్యక్షుడుగా వేముల సాంబయ్య గౌడ్.

**దొంతి మాధవ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన వేముల.**



నర్సంపేట వుదయం : వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఉపాధ్యక్షుడిగా నియమించేందుకు సిఫారసు చేసి అవకాశం కల్పించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి వేముల సాంబయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఖాన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులకు కూడా ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వేముల సాంబయ్య గౌడ్ ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా ఉండటంతో పాటు, నర్సంపేట మున్సిపాలిటీలో మాజీ ఫ్లోర్ లీడర్‌గా కూడా సేవలందించారు.

## పర్వతగిరి మండల కేంద్రం లో పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించి,ఆర్థిక సహాయం అందచేత

**మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు.**

పర్వతగిరి, జులై 15 ( వుదయం ప్రతినిధి ):పర్వతగిరి మండల కేంద్రంలో బుధవారం పలువురు మృతుల కుటుంబసభ్యులను మాజీ జడ్పీటీసీ, సీనియర్ రాజకీయ నేత మేడిశెట్టి రాములు పరామర్శించి ఓదార్చారు. తొలుత తన డ్రైవర్ గా పనిచేసిన బైరబోయిన బిక్షపతి తల్లి లచ్చమ్మ ఇటీవల మృతిచెందగా పరామర్శించి ఆర్థిక సాయం చేసి,మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రావుల రాజు మాతృమూర్తి మరణించగా ఓదార్చారు. తదుపరి మంచాల అశోక్ ఇటీవల మరణించగ పరామర్శించి, బీజేపీ సీనియర్ నాయకులు నాయకులు గడదాసు వీరాస్వామి దశదినఖర్మ లో హాజరై ఆయన కుమారులను ఓదార్చారు.



ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాతూత్ శ్రీనివాస్ నాయక్,ప్యాక్స్ వైస్ ఛైర్మన్ సందేల నవీన్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు మాజీ జిల్లా పరిషత్ సభ్యులు మహమ్మద్ సర్వర్, ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, నాయకులు గోనె సంపత్, జూలపెల్లి సురేందర్ రావు, కొండా వెంకన్న,జంగా సాంబయ్య,బోట్ల వెంకన్న,బోట్ల కనకరాజు తదితర నేతలు పాల్గొన్నారు.

## జాతీయ ప్రాంతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం



పరకాల, జూలై 15: (వుదయం ప్రతినిధి): ముఖ్య ఎన్నికల అధికారి, హైదరాబాద్ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహించే సమీక్షా సమావేశంలో భాగంగా బుధవారం పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమంపై గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీ డి.ఎస్. వెంకన్న అధ్యక్షత వహించారు. జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఆన్‌లైన్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణల పై చేపడుతున్న చర్యలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాలోని డూప్లికేట్ ఓట్లు, అలాగే వెయ్యి మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన పలు సందేహాలను వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, డూప్లికేట్ ఓట్ల గుర్తింపు, తొలగింపు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతోందని తెలిపారు. అలాగే 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రేషనలైజేషన్ ద్వారా రెండు భాగాలుగా విభజించే అవకాశం ఉందని వివరించారు.అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి సహకరించాలని ఆర్డీవో కోరారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎన్నికల శాఖ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ రూంను తనిఖీ చేసిన సీపీ ఎన్. శ్వేత



వరంగల్ క్రైం, జూలై 15 (వుదయం ప్రతినిధి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ రూంను కమిషనర్ ఎన్. శ్వేత బుధవారం రోజున క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అత్యవసర కాల్స్ స్వీకరణ, సీసీటీవీ కెమెరాల నిఘా, సాంకేతిక వ్యవస్థల పనితీరును ఆమె సమీక్షించారు.?ప్రజలకు అత్యవసర సేవలు మరింత వేగవంతంగా అందేలా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.?ఈ తనిఖీల్లో అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్. ఐ సతీష్, క్లూస్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, ఎస్. ఐ రోహిత్, ఆర్. ఎస్. ఐ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో ఎస్ఐఆర్ పూర్తి చేసి తిమ్మంపేటను జిల్లాలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలి

**సర్పంచ్ మోడెం శ్రీలత.**



వరంగల్ జిల్లా వుదయం:దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి వరంగల్ జిల్లాలో గ్రామాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టాలని గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలత పిలుపునిచ్చారు. గ్రామ జీపీఓ శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఎస్ఐఆర్ సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్క అర్హత ఓటరికి ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయించడం ప్రభుత్వ అధికారులు, బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ కన్వీనర్లు, సీఏలు, గ్రామ పెద్దలందరి బాధ్యత అని అన్నారు. గ్రామంలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి వివరాలను వెల్లడించారు. 36వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 735 ఓటర్లు. మరణించిన వారు 11 మంది, డబుల్ ఓట్లు 10, ఫారం అందాల్సిన ఓటరు ఒకరు. ఎస్ఐఆర్ పూర్తి అయినవి 503, పెండింగ్ 211.

37వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 739 ఓటర్లు. మరణించిన వారు 25 మంది, డబుల్ ఓట్లు 23. పూర్తి అయినవి 494, పెండింగ్ 197.

38వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 846 ఓటర్లు. మరణించిన వారు 17 మంది, డబుల్ ఓట్లు 8, ఫారం అందాల్సిన వారు ముగ్గురు. పూర్తి అయినవి 587, పెండింగ్ 234.

39వ పోలింగ్ కేంద్రం: మొత్తం 485 ఓటర్లు. మరణించిన వారు 14 మంది, డబుల్ ఓట్లు 8, ఫారం అందాల్సిన వారు ముగ్గురు. పూర్తి అయినవి 337, పెండింగ్ 126.మొత్తంగా గ్రామంలో ఇంకా 768 మంది ఓటర్ల ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందరూ సమన్వయంతో పనిచేసి రెండు రోజుల్లోనే ప్రక్రియను పూర్తిచేసి తిమ్మంపేటను వరంగల్ జిల్లాలో మొదటి స్థానంలో నిలపాలని సర్పంచ్ కోరారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు, బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల నాయకులు, బూత్ కన్వీనర్లు, సీఏలు తమకు కేటాయించిన ఓటర్ల వివరాలను సేకరించి నిర్ణీత గడువులోపు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆనుమాన్ల దిలీప్ రెడ్డి, భూమా అశోక్, రొట్టె రమేష్, బోనగాని ఆగయ్య, కోమండ్ల సురారెడ్డి, తిమ్మంపేట ఎస్ఐఆర్ ఇన్‌చార్జి రాజ్‌కుమార్, వార్డ్ సభ్యులు బొంత రఘు, భాష, బోయిన సురేష్, బీఎల్‌వోలు, గ్రామ పెద్దలు పోశాల నాగరాజు, గొర్రె జనార్దన్ రెడ్డి, సంఘీ సుమన్, దండు సంతోష్, ఉంద్రాతి నరేష్, గంగాడి అశోక్ రెడ్డి, రమాదేవి, శారద, తెప్ప సుమలత, కొంద్ర సూరయ్య, గొల్లెన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధనకు సమరశంఖం..

***జూలై 17న సచివాలయం ఎదుట భారీ సమావేశానికి పిలుపు..***



రాయపర్తి జూలై 15 (వుదయం ప్రతినిధి) తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ పిలుపు మేరకు ఈ నెల 17వ తేదీ శుక్రవారం హైదరాబాద్‌లోని నూతన తెలంగాణ సచివాలయం ఎదుట అమర జ్యోతి ప్రాంగణంలో తెలంగాణ ఉద్యమకారుల భారీ సమావేశం నిర్వహించనున్నట్లు రాయపర్తి మండల ఉద్యమకారుల మండల అధ్యక్షులు ఎనగందుల శ్యాంసుందర్ తెలిపారు.ఈ సమావేశానికి రాయపర్తి మండలం నుంచి అత్యధిక సంఖ్యలో ఉద్యమకారులు హాజరై తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని, ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి గుర్తింపు కార్డు, 250 చదరపు గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమకారుల జీవన భద్రత కోసం రూ.10 వేల కోట్ల ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని, ఉద్యమకారుల కుటుంబాలకు ఉద్యోగాలు, విద్య, వైద్యం తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు.

## ఐనవోలు మండల కేంద్రం లో బెల్ట్ షాపుల నిర్మూలనకు భారీ అవగాహన ర్యాలీ



ఐనవోలు, జులై 15 ( వుదయం ప్రతినిధి ):ఐనవోలు మండల కేంద్రం లో బెల్ట్ షాపుల నిర్మూలనకు గ్రామ సర్పంచ్ గడ్డం రఘువంశీ గౌడ్ మరియు గ్రామ పాలక మండలి ఆధ్వర్యంలో మహిళలు, యువత, గ్రామ ప్రజాప్రతినిధులు కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రఘు వంశీ గౌడ్ మాట్లాడుతూ, బెల్ట్ షాపుల వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ముఖ్యంగా యువత మద్యం బారిన పడి వారి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించి మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ర్యాలీలో పాల్గొన్న మహిళలు, యువత మరియు గ్రామ ప్రజాప్రతినిధులు బెల్ట్ షాపులు మూసివేయాలని నినాదాలు చేస్తూ గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

**రైతుల ఇబ్బందులపై గ్రీన్ వుడ్ విద్యార్థుల సంప్రదాయ ప్రదర్శన**

**రైతులు ప్రజల్లో హర్షం**





భూపాలపల్లి జులై 15(వుదయం విలేకరి)వర్షాలు లేక ఇబ్బందులేదుకొంటున్న రైతుల కష్టాలపై గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులు మంగళవారం చేసిన సంప్రదాయ ప్రదర్శన చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అంటున్న క్రమంలో రైతులు ప్రజల్లో హర్షం వ్యక్తమౌతుంది వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా సరైన వర్షాలు లేక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వర్షం కోసం ఎదిరిచూస్తూ పంటలను కాపాడుకొనుటకు రైతులు చేసే ప్రయత్నాలు పురాతన సంస్కృతులు ఆచారాలను విద్యార్థులకు అర్థం అయ్యేవిధంగా తెలియచేయాలనే ఉద్దేశంతో గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థులతో వివిధ సాంస్కృతిక సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించి వర్షాలు సంవృద్ధిగా కురిసి అధిక పంట దిగుబడులు వచ్చి రైతుల కండ్లల్లో ఆనందం వికసించాలని ప్రదర్శనతో విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.ఈ క్రమంలో వర్షాలు సకాలంలో పడక, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు సహజ సిద్ధమైన వర్షపాతం లేకపోవడం మరియు ఎల్‌నినో లాంటి వాతావరణ మార్పుల ప్రభావంతో చాలా ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి?దీనివల్ల వ్యవసాయ రంగంలో అన్నదాతలు అనేక కష్టాలు పడుతున్నారు. వానకాలం సీజన్ ప్రారంభమై చాలా సమయం గడుస్తున్నా వర్షాలు పడకపోవడంతో రైతులు వేసిన నార్లు, విత్తనాలు మొలకెత్తక ఎండిపోతున్నాయి కొన్ని ప్రాంతాల్లో రైతులు ట్యాంకర్ల ద్వారా, బిందెలతో నీరు పోసి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు భూగర్భ జలాలు అడుగంటడం వర్షాలు లేక చెరువులు, కుంటలు, బావులు ఎండిపోతున్నాయి. దీనివల్ల భూగర్భ జలమట్టం భారీగా పడిపోయి, బోరుబావులు కూడా మొరాయిస్తున్నాయి రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. వర్షాలు లేక పంట నష్టపోతే ఆ అప్పులు తీర్చడం భారంగా మారుతుంది దీంతో వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు, కూలీలకు ఉపాధి దొరక్క ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రీన్ వుడ్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులచే.విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఎప్పటికప్పుడు పరిస్థితులను కళ్లకు కట్టేలా ప్రదర్శనలు చేయడంలో భాగంగా మంగళవారం చేసిన ప్రదర్శన వీడియో వైరల్ కావడంతో హర్షం వ్యక్తమౌతుంది దానితోపాటు పాఠశాల యాజమాన్యానికి ఉపాధ్యాయుల బృందంపై సోషల్ మీడియాలో అభినందనలు వెలువెత్తుతున్నాయి.

# చక్కని ఆరోగ్యం

## నిద్ర పట్టడం లేదా?



అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు ప్రశాంతంగా నిద్ర పోవడం ముఖ్యం. కానీ ప్రస్తుతం వివిధ కారణాల వల్ల చాలామందికి సుఖనిద్ర కరువవుతోంది. అందుకే రాత్రుళ్లు నిద్రకు ఉపక్రమించే ముందు కొన్ని పానీయాలు తాగితే సుఖంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..సాధారణంగా నిద్ర సరిగ్గా పట్టకపోవడానికి మెగ్నీషియం లోపం కూడా ఓ కారణమే. కాబట్టి నిద్రకు ఉపక్రమించడానికి ముందు అరటిపండు స్మూతీ తీసుకో వడం వల్ల సుఖంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. దీని కోసం ఒక అరటి పండు, రెండు చెంచాల ఆల్మండ్ బటర్, కప్పు పాలు బ్లెండర్‌లో వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గ్లాసులోకి తీసుకొని నేరుగా తాగేయచ్చు. అరటి పండు, ఆల్మండ్ బటర్‌లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. ఇది కేవలం ప్రశాంతమైన నిద్రకే కాదు.. కండర, నాడీ వ్యవస్థల పనితీరును మెరుగుపరిచేం దుకూ సహకరిస్తుందని చెబుతున్నారు. ఇందులో క్యాలరీలు ఎక్కు వగా ఉంటాయి. కాబట్టి బరువు తగ్గాలనుకునేవారు నిపుణుల సలహామేరకు తీసుకోవాలని సూచిస్తున్నారు. వేడి పాలలో కొద్దిగా వెనీలా ఎసెన్స్, తేనె వేసి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని పడుకునే ముందు కొద్దికొద్దిగా సిప్ చేయాలి. పాలల్లో ఉండే అమైనో ఆమ్లాలు శరీరంలోకి ప్రవేశించిన తర్వాత సెరటోనిన్, మెలటోనిన్ అనే హార్మోన్లు విడుదల య్యేలా చేస్తాయంటున్నారు నిపుణులు. ఫలితంగా నిద్ర బాగా పడుతుందని చెబుతున్నారు. మార్కెట్లో దొరికే చామొమైల్ బ్యాగ్స్‌ని కాసేపు వేడి నీటిలో ఉంచడం వల్ల చామొమైల్ డ్రింక్‌ని సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పానీయాన్ని నిద్ర పోవడానికి ముందు తాగడం వల్ల చక్కని నిద్ర సొంతమ వుతుందంటున్నారు నిపుణులు. ఒక కప్పు బాదం పాలు తీసుకొని అందులో చిటికెడు యాలకుల పొడి, కొద్దిగా అల్లం వేసి మరిగించాలి. ఈ మిశ్రమం గోరువెచ్చగా అయ్యాక అందులో కొద్దిగా తేనె వేసి కలుపుకోవాలి. ఈ పాలను పడుకునే ముందు తాగితే హాయిగా నిద్రలోకి జారుకోవచ్చని చెబుతున్నారు. రోజూ ఉదయం, రాత్రి వేళల్లో గ్లాసు చెర్రీ జ్యూస్ తాగడం వల్ల ప్రశాంతంగా నిద్ర పడుతుందంటున్నారు నిపుణులు. చెర్రీల్లో ఉండే మెలటోనిన్ అనే పదార్థమే ఇందుకు కారణమట! కేవలం పైన పేర్కొన్న పానీయాలు మాత్రమే కాకుండా.. ప్రతిరోజూ ఒకే సమయంలో నిద్రపోవడం.. స్క్రీన్ టైమ్ తగ్గించడం.. సాయంత్రం తర్వాత కెఫీన్ ఉండే పదార్థాలు తీసుకోక పోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. అలాగే పడకగది వాతావరణాన్ని సుఖనిద్రకు అనుగుణంగా మార్చుకోవాలంటు న్నారు. ఒకవేళ నిద్రలేమి సమస్య దీర్ఘకాలం ఉంటే మాత్రం తప్పకుండా వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

## రెండు వారాలు చాలట!

అందా నికి కొలమానాలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. కానీ, వయసు ఎంతైనా సరే... ప్రకాశవంతమైన, ఆరోగ్యకర మైన చర్మాన్ని కోరుకోని అమ్మాయిలు ఎవరు? అందుకు రకరకాల సౌందర్య ఉత్పత్తులు వాడుతూ వేల రూపాయలు ఖర్చు చేసేవారూ ఉన్నారు. కానీ అవి పై మెరుగులు మాత్రమే. తక్కువ ఖర్చులో అంతకంటే మెరుగైన ఫలితాలు రావాలంటే ఏం చేయాలో తెలుసా? ద్రాక్ష పళ్లను తినాలి. అవును...ద్రాక్ష చర్మానికి 'సూపర్ ఫుడ్'లా పనిచే స్తుందని 'వెస్ట్రన్ న్యూ ఇంగ్లండ్ యూనివర్సిటీ' తాజా అధ్యయనం చెబుతోంది. ఇవి సూర్యరశ్మి వల్ల దెబ్బతిన్న చర్మాన్ని కాపాడతాయి. అది కూడా పైపైన కాకుండా జన్యువుల్లో మార్పు తీసుకొచ్చి చర్మ రక్షణ వ్యవస్థను మెరుగుప రుస్తాయని చెబుతున్నారు పరిశోధ కులు. అదీ రెండువారాల్లోనే... ఇంకేం ఎప్పుడైనా చర్మం డల్‌గా అనిపిస్తే, ద్రాక్ష తిని చూడండి. తక్కువ ఖర్చు, ఎక్కువ లాభం.



## మౌత్‌వాష్.. ఆరోగ్యకరంగా..

మన నోట్లో మంచి బ్యాక్టీరియానే కాదు.. చెడు బ్యాక్టీరియా కూడా ఉంటుంది. ఈ చెడు బ్యాక్టీరి యాను తొలగించడానికి చాలామంది మౌత్‌వాష్‌లు ఉపయోగిస్తుంటారు. అయితే మార్కెట్లో లభించే మౌత్‌వాష్‌లలో రసాయనాలు నిండి ఉంటాయి. కాబట్టి, వీలైతే ఇంట్లోనే దీన్ని సహజసిద్ధంగా తయారు చేసుకోవడం మేలంటున్నారు నిపుణులు.

కావాల్సిన పదార్థాలు:

మరిగించిన నీళ్లు – రెండు కప్పులు

పెద్ద దాల్చిన చెక్క ముక్క – ఒకటి

లవంగాలు – ఒక టేబుల్ స్పూన్

అనాస పువ్వులు – మూడు

తయారీ:

మరిగించిన నీటిలో దాల్చిన చెక్క, లవంగాలు, అనాస పువ్వులు వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని సీసాలో నింపి.. రెండు రోజుల పాటు గది ఉష్ణోగ్రత వద్ద ఉంచాలి. ఆ తర్వాత వడకట్టుకుని మరో గాలి చొరబడని సీసాలో నిల్వ చేసుకోవాలి. ఇలా తయారుచేసు కున్న మౌత్‌వాష్‌తో రోజుకోసారి 30 నుంచి 40 సెకన్ల పాటు పుక్కిలిస్తే ప్రయోజనం ఉంటుందంటున్నారు నిపుణులు.

సహజసిద్ధమైన పదార్థాలతో తయారుచేసిన ఈ మౌత్‌వాష్ పంటి నొప్పిని, నోటి దుర్వాసనను దూరం చేసి.. నోటిని శుభ్రపరుస్తుందని చెబుతున్నారు నిపుణులు. అయితే ఇతర దంత, చిగుళ్ల సమస్యలతో దీర్ఘకాలం పాటు బాధపడే వారు మాత్రం దంత వైద్య నిపుణుల్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.



## నటించనిద్దాం!


'నేను అమ్మని, నువ్వు పాపవి... ఆడుకుం దామా' ఇలా అడగని పిల్లలు ఉండరేమో! అయితే, సవాలక్ష పనులతో అలసి పోయే తల్లులు మాత్రం కొన్నిసార్లు మావల్ల కాదు బాబోయ్ అనేస్తారు కదా... కానీ, ఇలాంటి ఆటలు పిల్లల్లో సృజనాత్మకత, ఊహా శక్తిని పెంచుతాయి. అవొక్కటే కాదు, పిల్లలకు మానసిక ఆరోగ్యాన్నీ ఇస్తాయంటోంది యూనివర్సిటీ ఆఫ్ సిడ్నీ తాజా అధ్యయనం. వీటి ద్వారా స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తపరచడం, ఇతరుల పట్ల సానుభూతి చూపించడం, వాళ్ల దృక్కోణాన్ని అర్థం చేసుకోవడం, ఒకరికొకరు సహకరించుకోవడం వంటివి అల వడతాయట. ఇలా ఆటలాడే పిల్లల్లో మానసిక సమస్యలు, ప్రవ ర్తనాలోపాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు పరిశోధ కులు. ముఖ్యంగా రెండుమూ డేళ్ల పిల్లలను ఈ విధంగా ప్రోత్సహిస్తే స్కూలుకెళ్లే వయసొచ్చేసరికి మంచి ప్రవర్తనతో ఆరోగ్యం గా ఉంటారట. అందుకే, పిల్లలు ఓ బొమ్మని తీసుకొచ్చి అన్నం తినిపించమంటే తినిపించేయండి. లేదా ఇప్పుడు 'మీరంతా డైనోసార్లు' అంటే.. అలానే నటించండి. వాళ్లనీ నటించని వ్వండి. బొమ్మలు చిందరవం దర చేసే స్తున్నారా? చేయని వ్వండి. ఏం చేసినా అది వాళ్ల ఎదు గుదలకే సాయపడుతుందట. వస్తు వులను మళ్లీ తెచ్చివ్వగలం. కానీ, బాల్యాన్ని కాదు. అందుకే, వీలైనం తగా ఆడనివ్వండి.

'అమ్మా, నేను డాక్టర్... నువ్వేమో పేషెంట్‌వి'...



## 'జాగర్స్ నిపుల్'.. ఏమిటీ సమస్య?

సాధారణంగా వ్యాయామం చేసేటప్పుడు పెట్టుకున్న లక్ష్యాన్ని చేరుకో వడం పైనే దృష్టి పెడతారు చాలామంది. ఈ క్రమంలో ఆయా వర్కవుట్స్ వల్ల శరీరంపై పడే ఒత్తిడి, అయ్యే గాయాల గురించి పట్టిం చుకోరు. ఈ నిర్లక్ష్యమే కొన్ని శరీర భాగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. 'జాగర్స్ నిపుల్' సమస్య కూడా ఇలాంటిదే! పరుగు, జాగింగ్ వల్ల నిపుల్స్ విషయంలో కలిగే ఒక రకమైన అసౌకర్యమే ఇది. దీనివల్ల చనుమొనల్లో తీవ్రమైన నొప్పి రావడం, కొన్నిసార్లు రక్తం కారడం.. వంటివీ గమనించచ్చు. మరి, ఈ సున్నితమైన సమస్యను ఎలా పరిష్కరించుకోవాలి? నిపుణులు చెబుతున్న విషయాల గురించి తెలుసుకుందాం రండి.. పరుగు, జాగింగ్‌తో పాటు శరీరంపై ఒత్తిడి కలిగించే కొన్ని రకాల వ్యాయామాలు చేసినప్పుడు కొంత మందిలో చనుమొనల్లో నొప్పి రావడం గమ నించచ్చు. 'జాగర్స్ నిపుల్'గా పిలిచే ఈ సమస్యకు వ్యాయామాల తీవ్రతే కారణమను కుంటారు చాలామంది. కానీ పరిగెత్తేట ప్పుడు, శరీరాన్ని వేగంగా కదిలించే వ్యాయా మాలు చేసినప్పుడు.. దుస్తులకు, నిపుల్స్‌కు మధ్య రాపిడి జరిగి ఈ సమస్య తలెత్తుతుంది అంటున్నారు నిపుణులు. ఇదొక్కటే కాదు.. బిగుతైన దుస్తులు ధరించడం, చెమట పట్టడం, ధరించే దుస్తుల మెటీరి యల్.. వంటివీ ఈ సమస్యను తెచ్చిపెడ తాయంటున్నారు. ఈ రాపిడి వల్ల చనుమొ నలు ఎరుపెక్కడం, వాపు రావడం, పగుళ్లు ఏర్పడడం, కొంతమందిలో రక్తం కారడం.. వంటి లక్షణాలు గుర్తించచ్చంటున్నారు. తీవ్రమైన నొప్పితో పాటు అసౌకర్యాన్ని కలిగించే ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే వ్యాయామం పైనే కాదు.. రోజువారీ పనుల పైనా దృష్టి పెట్టలేమంటున్నారు. శరీరాన్ని వేగంగా కదిలించే వ్యాయామాలు చేసే వారిలో, రన్నర్స్‌లో ఎక్కువగా తలెత్తే ఈ సమస్యను కొన్ని సులభమైన చిట్కాలతో దూరం చేసు కోవచ్చంటున్నారు నిపుణులు. చనుమొనల్లో నొప్పిని తగ్గించుకోవడానికి నిపుల్ లూబ్రికెంట్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని అప్లై చేసుకోవచ్చు. లేదంటే ఇంట్లో ఉండే పెట్రోలియం జెల్లీని వాడినా ఫలితం ఉంటుంది. ఇవి ఒక లేయర్‌లా ఏర్పడి.. నిపుల్స్‌కి, దుస్తులకు మధ్య రాపిడి జరగకుండా రక్షణ కల్పిస్తాయని చెబుతున్నారు నిపుణులు. దుస్తుల్లోని చెమట, తడిదనం వల్ల నిపుల్స్‌లో నొప్పి, అసౌకర్యం తీవ్రమవుతాయి. కాబట్టి కాటన్ దుస్తులకు బదులుగా.. సులభంగా ఆరిపోయే సింథటిక్ స్పోర్ట్స్ ఫ్యాబ్రిక్‌లు ధరించడం మంచిదంటున్నారు నిపుణులు. అలాగే ఈ సమస్య నుంచి స్పోర్ట్స్ బ్రా ఉపశమనం కలిగిస్తుందట. కాబట్టి ధరించేవి వదులైన దుస్తులైనా, లేదంటే బిగుతై నవే అయినా.. లోపల స్పోర్ట్స్ బ్రా వేసుకోవడం వల్ల చనుమొనలు–దుస్తులకు మధ్య రాపిడి జరగకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు నిపుణులు. చనుమొనలకు రక్షణ కవచంలా ఉండే ప్రత్యేకమైన బ్యాండేజీలు, నిపుల్ కవర్స్ మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటిని వాడడం వల్ల కూడా సమస్యను దూరం చేసుకోవచ్చట. టాల్కం పౌడర్ చనుమొనల వద్ద ఉండే చెమట, తడిని పీల్చుకొని.. ఆ ప్రదేశాన్ని పొడిగా ఉంచుతుంది. కాబట్టి నిపుల్స్‌పై ఓ లేయర్ మాదిరిగా టాల్కం పౌడర్ అప్లై చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. రాపిడికి గురైన నిపుల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పొడిగా ఉంచుకోవాలి. ఆపై డాక్టర్ సలహా మేరకు యాంటీబ యోటిక్ క్రీమ్‌ని అప్లై చేసుకుంటే సమస్య నుంచి త్వరగా ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు.



## తల్లీబిడ్డకి ఏఐ రక్ష!



ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. కానీ, గర్భధారణ సమయంలో కొందరిలో వచ్చే ప్రీ–ఎక్లాంప్సియా ఆ ఆకాంక్షకు అడ్డుకట్ట వేస్తుంది. సరైన సమయంలో దీన్ని గుర్తించి, చికిత్స అందించకపోతే తల్లీబిడ్డా ఇద్దరికీ ప్రమాదమే మరి. అయితే, ఏఐ సాంకేతికత ఉపయోగించి ఈ ప్రమాదాన్ని ముందే కని పెట్టొ చ్చని 'పబ్‌మెడ్ సెంట్రల్' జర్నల్ తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. 'ప్రాంప్ట్' అనే ఏఐ మోడల్‌తో కంటి రెటీనా ఫొటో తీసి, సూక్ష్మ రక్తనాళాల నమూనాలను విశ్లేషించారు శాస్త్రవే త్తలు. దాంతోపాటు వారి క్లినికల్ డేటానూ పోల్చిచూశారు. దీంతో ఎలాంటి ముందస్తు లక్షణాలు కని పించకముందే గర్భధారణ జరిగిన 14వారాల్లోపే ప్రీ–ఎక్లాంప్సియా వచ్చే ప్రమాదాన్ని అంచనా వేయ గలిగారు. పైగా ఈ పద్ధతి ఇప్పుడున్న వాటిలో సురక్షితం, చౌక అయినది కూడా అట. అందుకే, ఈ ప్రక్రియను అన్ని ప్రసూతి కేంద్రాల్లో వినియోగించొ చ్చని సూచిస్తున్నారు పరిశోధకులు.

## టీ, కాఫీలకు బదులుగా!

ఉదయం లేవగానే కాఫీ లేదా టీ తాగడం చాలామందికి అలవాటు. కానీ, మన రోజు ఆరోగ్యంగా మొదలవ్వాలంటే... వాటికి దూరంగా ఉంటేనే మంచిదని చెబుతున్నారు నిపుణులు. కాఫీ, టీలకు బదులుగా కొబ్బరి నీళ్లతో రోజుని ప్రారంభిం చమంటున్నారు. ఇలా ఖాళీ కడుపుతో వీటిని తీసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయని చెబుతు న్నారు. రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరం డీహైడ్రేట్ అవుతుంది. కాబట్టి ఉదయాన్నే ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు, ఖనిజాలు అంది రోజంతా కావాల్సిన శక్తి లభిస్తుంది. ఇందులో ఉండే సహజ ఎంజైమ్స్ జీర్ణ వ్యవస్థను మెరుగుపరిచి కడుపులో మంట, ఎసిడిటీ, గ్యాస్ సమస్యల్ని దూరం చేస్తాయి. వీటిని పరగడుపున తీసుకుంటే కిడ్నీలు, కాలేయంలో ఉన్న వ్యర్థాలన్నీ బయటికి పోయి, కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం తగ్గుతుంది. వీటిలో ఉండే పొటాషి యం శరీరంలో ఉండే సోడియం శాతాన్ని సమతుల్యం చేసి, రక్తపోటుని అదుపులో ఉంచు తుంది. బరువు నియంత్రణలో ఉండాలన్నా.. మెరిసే చర్మం మన సొంతం కావాలన్నా రోజూ ఒక గ్లాసు కొబ్బరి నీళ్లు తాగితే సరి. వీటిలో కెలోరీలు, చక్కెర తక్కువగా ఉండి బరువు తగ్గడంలో సాయపడ తాయి. అయితే ఆరోగ్యపరంగా ఇది ఎంత మేలు చేసినప్పటికీ... కిడ్నీ సమస్యలు, మధుమేహం ఉన్న వాళ్లు వైద్యుల సలహా మేరకే తీసుకోవాలని సూచిస్తున్నారు.



## ప్రత్యక్ష పన్నుల్లో 16% వృద్ధి



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు ఈనెల 13 వరకు రూ.6.51 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వం తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో వసూలైన మొత్తం కంటే ఇది 16% ఎక్కువ. కార్పొరేట్ పన్ను వసూళ్లు పెరగడం ఇందుకు ఉపకరించింది. కార్పొరేట్ పన్ను నికర వసూళ్లు 22% అధికమై రూ.2.40 లక్షల కోట్లకు చేరాయి. వ్యక్తిగత, అవిభక్త హిందూ కుటుంబాలు సంస్థల నుంచి వసూలైన మొత్తం 12% పెరిగి రూ.3.84 లక్షల కోట్లుగా నమోదైంది.

# బిజినెస్

# ఒక్కరోజే రూ.6.7 లక్షల కోట్లు ఆవిరి.. ఐబీఎంకు ఏమైంది..?



అమెరికా టెక్ దిగ్గజం ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్) షేర్లు ఒక్క రోజే కుప్పకూలాయి. దాదాపు 25 శాతం పతనమయ్యాయి. దీంతో కొన్ని గంటల వ్యవధిలోనే కంపెనీ మార్కెట్ విలువలో దాదాపు 70 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.6.7లక్షల కోట్లకు పైమాటే) మేర సంపద ఆవిరైంది. ఐబీఎం (IBM) కంపెనీ షేరు విలువ ఒక్క రోజులో ఇంత దారుణంగా పడిపోవడం గత 58 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. త్రైమాసిక ఫలితాలు, ఏఐపై కంపెనీ సీఈఓ చేసిన వ్యాఖ్యలే షేర్ల పతనానికి కారణమ య్యాయి. మంగళవారం నాటి (అమెరికా కాలమానం ప్రకారం) వాల్ స్ట్రీట్ ట్రేడింగ్‌లో ఐబీఎం కార్పొరేషన్ షేరు విలువ ఏకంగా 25.21 శాతం కుంగి 217.07 డాలర్లకు పడిపోయింది. దీంతో మార్కెట్ విలువలో దాదాపు 70 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. కంపెనీ షేరు విలువ ఒక రోజు వ్యవధిలో ఈ స్థాయి లో పడిపో వడం 1968 జనవరి 3 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి గానూ ప్రాథమిక ఫలితాల వివ రాలను ఐబీఎం ప్రకటించింది. అనంతరం షేర్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన ఫలితాలను ఐబీఎం వచ్చేవారం విడుదల చేయనుంది. అంతకంటే ముందు తాజాగా ప్రాథమిక వివరాలను వెల్లడిం చింది. ఈసారి కంపెనీ ఆదాయం అంచనాల కంటే తక్కువగా కేవలం ఒకే ఒక్క శాతం పెరిగి 17.2 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని ఐబీఎం పేర్కొంది. సాఫ్ట్‌వేర్ విభాగ ఆదాయం 5శాతం పెరగొచ్చని, అయితే ఐబీఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం మాత్రం 7శాతం నష్టాలను చవిచూసిందని ప్రకటించింది. ఈ క్రమంలోనే మదుపర్లకు రాసిన లేఖలో ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. ''కృత్రిమ మేధపై దృష్టిపెట్టిన కంపెనీలు.. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా వెచ్చిస్తున్నాయి. రాబోయే కాలంలో ధరలు పెరుగుతాయన్న ఆందోళ నలతో ఈ మధ్య సర్వర్లు, స్టోరేజ్ వ్యవస్థలు, నెట్‌వర్క్ పరికరాలు, మెమొరీ చిప్‌ల కొనుగోళ్లకే ఎక్కువగా మొగ్గుచూపాయి. దీంతో ఐబీఎం ఉత్పత్తులకు గిరాకీ తగ్గింది. ఈ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో మేం విఫలమయ్యాం. వేగంగా స్పందించడంలో తడబడ్డాం. మార్పులను అందిపుచ్చుకోలేకపోయాం. కస్టమర్ల వ్యయ ప్రాధాన్యతలు ఎంత వేగంగా మారుతాయో గ్రహించలేకపోయాం'' అని సీఈఓ వెల్లడించారు. ఏఐ తర్వాత కంపెనీలు సైబర్ సెక్యూ రిటీపై దృష్టి పెట్టడం కూడా తమ వ్యాపారాన్ని దెబ్బతీ సిందని అరవింద్ పేర్కొన్నారు.

# మొబైల్ తయారీకి కేంద్రం దన్ను..



దేశీయంగా మొబైల్ తయారీని ప్రోత్సహించే దిశగా కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.62,500 కోట్లతో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం 2.0కు బుధవారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడిం చారు. దీంతో పాటు సెమీకండక్టర్లు, ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి పలు ప్రాజెక్టులను క్యాబినెట్ ఆమోదించింది. గతంలో మొబైల్ ఫోన్ల కోసం భారత్ ఇతర దేశాల నుంచి వచ్చే దిగుమతులపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ క్రమంలోనే దేశీయంగా ఉత్పత్తిని పెంచేందుకు కేంద్రం పీఎల్ఐ పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో ఇప్పుడు దేశవ్యాప్తంగా 300 మొబైల్ తయారీ కేంద్రాలతో మన దేశం నుంచే ఫోన్ల ఎగుమతులు జరుగుతున్నాయి. గతేడాది రూ.2.62లక్షల కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను భారత్ ఎగుమతి చేసింది. వీటిలో అత్యధికం యాపిల్ ఫోన్లే. ఇక, దేశీయంగా మొబైల్ ఫోన్ల తయారీ కూడా గతంలో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2.14లక్షల కోట్లు విలువైన ఫోన్లు దేశీయంగా తయార వ్వగా.. 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి ఆ మొత్తం రూ.5.5లక్షల కోట్లకు పెరిగింది. ఇక, భారత్ అంతర్జాతీయ చిప్ తయారీ హబ్‌గా మార్చే దిశగా కేంద్రం చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే రూ.1.27లక్షల కోట్లతో సెమీకాన్ 2.0 ప్రోగ్రామ్‌ను ఆమోదించింది. చిప్ డిజైన్, తయారీ, సెమీ కండక్టర్ల (Semiconductors) సరఫరా, అధ్యయనాలు, ప్యాకేజింగ్ సామర్థ్యం వంటి వాటికి దీర్ఘకాల మద్దతు అందించేందుకు ఈ ప్రోగ్రామ్‌ను తీసు కొచ్చింది. ఈ సందర్భంగా వారణాసిలో రెండు మెగా కారిడార్లకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వారణాసి రింగ్ రోడ్, 31వ జాతీయ రహదా రిని కలుపుతూ 43.21 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌కు క్యాబినెట్ అనుమతిలి చ్చింది. రూ.10,998 కోట్లతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. ఇక, ఎన్‌హెచ్ 19-వారణాసి రింగ్‌రోడ్ మధ్య రూ.14,467 కోట్లతో 6 వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎలివేటెడ్ కారిడార్‌ను కేంద్రం ఆమోదించింది.

# స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీ లు స్వల్ప లాభాలతో ముగి శాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరుగుదల వంటి ఆందోళ నలు ఉన్నా.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొను గోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తక్కువగా నమోదైనట్లు గణాంకాలు వెలువడడంతో వడ్డీ రేట్ల పెంపు భయాలు కాస్త తగ్గు ముఖం పట్టాయి. దీనికి తోడు హర్మూజ్ జలసంధిపై 20 శాతం సుంకాల డిమాండ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తీసుకోవడమూ కాస్త కలిసొచ్చింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 130 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 24వేల మార్కు ను నిలబెట్టుకుంది. సెన్సెక్స్ 130.49 పాయింట్ల లాభంతో 77,185.43 వద్ద ముగి సింది. నిఫ్టీ 26.45 పాయింట్ల లాభంతో 24,078.50 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 96.29గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రా సిమెంట్, ఎటర్నల్, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, ఇండి గో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. పవర్ గ్రిడ్, టాటాస్టీల్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 85.55 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,033 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## 3+5 అప్‌డేట్స్‌తో మోటో ఎడ్జ్ 70 మ్యాక్స్

లెనోవోకు చెందిన మొబైల్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ మోటోరొలా తన ఎడ్జ్ సిరీస్‌ను మరింత విస్తరించింది. ఎడ్జ్ 70 సిరీస్‌లో కొత్తగా ఐదో మోడల్ ఎడ్జ్ 70 మ్యాక్స్‌ను (Motorola Edge 70 Max) దేశీయంగా లాంచ్ చేసింది. వన్‌ప్లస్ 15R, ఐకూ 15Rకు పోటీగా ఈ ఫోన్‌ను తీసుకొ చ్చారు. బిగ్‌బ్యాటరీతో వస్తున్న ఈ ఫోన్ వివరాలు.. మోటోరొలా ఎడ్జ్70 మ్యాక్స్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత హెలో యూఐతో పనిచేస్తుంది. మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్లు, ఐదేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్లు ఇస్తామని కంపెనీ చెబుతోంది. 6.8 అంగుళాల క్యూహెచ్‌డీ+ ఎక్స్‌ట్రీమ్ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 7000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్ ఇచ్చారు. క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 8 జన్ 5 ప్రాసెసర్ అమర్చారు. ఐపీ 68, ఐపీ69 రేటింగ్ ఉంది. ఈ ఫోన్‌లో 50 ఎంపీ ప్రధాన కెమెరా, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా, ముందువైపు 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు.

# స్థిరాస్తి కుబేరుల్లో గౌతమ్ అదానీ టాప్




ఈ ఏడాది దేశీయ స్థిరాస్తి రంగంలో భారీ విలువను సృష్టించిన కంపెనీగా అదానీ ప్రాపర్టీస్ నిలిచింది. దేశీయ అతిపెద్ద స్థిరాస్తి సంస్థ డీఎల్ఎఫ్ ఛైర్మన్ రాజీవ్ సింగ్‌ను అధిగమించి గౌతమ్ అదానీ, కుటుంబం దేశంలోనే అత్యంత ధనవంతులైన స్థిరాస్తి రంగ కంపెనీ యజమానులుగా నిలిచారు. విలువ తగ్గినా.. దేశంలో అత్యంత విలువైన స్థిరాస్తి కంపెనీగా డీఎల్ఎఫ్ నిలిచింది. ఈ ఏడాదిలో అదానీ ప్రాపర్టీస్ రూ.38,000 కోట్ల విలువను జత చేయడంతో గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం గ్రోహే-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ రిచ్ లిస్ట్‌లో తొలిసారిగా అగ్రస్థానంలో నిలిచారు. 2025 ఇదే సమయం కంటే 72.5% వృద్ధితో అదానీ ప్రాపర్టీస్ విలువ రూ.90,400 కోట్లకు చేరుకుంది. దీంతో నాలుగు స్థానాలు మెరుగుపరచుకుని దేశంలోనే అత్యంత విలువైన నాలుగో స్థిరాస్తి కంపెనీగా ఇది నిలిచింది. అత్యంత విలువైన, అన్‌లి స్టెడ్ స్థిరాస్తి డెవలపర్‌గా కొనసాగింది.జాబితాలోని మొత్తం 150 కంపెనీల విలువ మొత్తం మీద 2 శాతమే (రూ.34,300 కోట్ల) పెరిగి రూ.16.5 లక్షల కోట్లకు చేరుకుంది. తొమ్మిదేళ్ల కిందట స్థిరాస్తి సంస్థలకు ర్యాంకింగ్‌లు ఇవ్వడం మొదలుపెట్టాక.. ఇంత తక్కువ వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి. బీఎస్ఈ రియాల్టీ సూచీ 20% కుంగడాన్ని ఇది ప్రతి ఫలిస్తోంది. గతేడాది జాబితాలోని కంపెనీలు 14% వృద్ధి (రూ.1.4 లక్షల కోట్ల)ని నమోదు చేశాయి. ఈసారి 31 కంపెనీలే తమ విలువ పెంచుకోగా, 74 కంపెనీలు విలువ విషయంలో వెనకడుగు వేశాయి. ప్రస్తుత జాబితాలో అదానీ ప్రాపర్టీస్, ఓయో కలిసి మొత్తం విలువ జోడింపులో మూడో వంతును కలిగి ఉన్నాయి.

# క్రీడలు

## ఆసియా నం.1గా ధీరజ్




భారత యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర తాజా ర్యాంకింగ్స్‌లో ఆసియా నంబర్‌వన్‌గా నిలిచాడు. ఈ విజ యవాడ కుర్రాడు పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో 225.5 పాయింట్లతో ఆసియా స్థాయిలో అగ్రస్థా నాన్ని దక్కించుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 3 స్థానాలు మెరుగుపరుచుకున్న అతడు ఎనిమిదో ర్యాంకును సొంతం చేసుకున్నాడు. టాప్-10లో భారత్ నుంచి ధీరజ్‌కు మాత్రమే స్థానం దక్కింది. ప్రపం చకప్ స్టేజ్-3 టోర్నీలో వ్యక్తిగత స్వర్ణం, మిక్స్‌డ్ స్వర్ణం గెలుచుకున్న ధీరజ్.. స్టేజ్-4 టోర్నీలో మిక్స్‌డ్ విభాగంలో కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. కొద్దిలో పతకాన్ని చేజార్చుకున్నాడు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో జ్యోతి సురేఖ (291.25) ఒక ర్యాంకు కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచింది. తానిపర్తి చికిత (81) రెండు స్థానాలు చేజార్చుకుని 52వ ర్యాంకును దక్కించుకుంది.

# ప్రపంచ కప్ నుంచి అర్జెంటీనాను తొలగించండి..

ఫిఫా ప్రపంచ కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెం టీనా సెమీస్‌లో ఇంగ్లాండ్‌ను ఢీకొట్టనుంది. అయితే, మ్యాచ్ కు ముందే అర్జెంటీనాపై ప్రజాగ్రహం వ్యక్తం కావడం గమ నార్హం. ఆ జట్టుకు రిఫరీలు అనుకూలంగా మారిపోయార నేది ప్రధాన ఆరోపణ. అర్జెంటీనాను ఫిఫా ప్రపంచ కప్ నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ దాదాపు 75 లక్షల మందికిపైగా ఫుట్‌బాల్ అభిమానుల సంతకాలతో ఆన్‌లైన్ పిటిషన్ చక్కర్లు కొడుతున్నట్లు ఓ అంతర్జాతీయ పత్రికా కథ నం పేర్కొంది. క్వార్టర్స్‌లో ఈజిప్ట్‌తో మ్యాచ్‌లో అర్జెంటీనా పట్ల పక్షపాతంతో రిఫరీ వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ''లియోనెల్మెస్సి నాయకత్వంలోని అర్జెంటీనాకు ఫిఫా, రిఫరీలు పూర్తిస్థాయిలో అనుకూలంగా మారిపోయా రు. విజేత ఎవరో ముందే నిర్ణయం అయిపోతే మిగతా జట్లు ఎందుకు పోటీ పడాలి? అందుకే, అర్జెంటీనాను వరల్డ్ కప్ నుంచి తప్పించాలి. ప్రతి ఒక్కరికీ సరైన అవకాశం కల్పిం చాలి'' అని నెట్టింట పోస్టు వైరల్‌గా మారింది. అర్ధరాత్రి ఇంగ్లాండ్ – అర్జెంటీనా జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరగ నుంది. ఇందులో గెలిచిన టీమ్ ఫైనల్‌లో స్పెయిన్‌ను ఢీకొట్ట నుంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్ బలమైన జట్టే. కెప్టెన్ హ్యారీ కేన్ బెల్లింగ్‌హామ్‌తోపాటు ఇతర ప్లేయర్లు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు అర్జెంటీ నాపై గెలిచి ఫైనల్‌కు వెళ్లాలనేదే ఇంగ్లాండ్ లక్ష్యం. అలా జరగాలంటే మెస్సిని అడ్డుకోవాల్సిందే. అందు కోసం తమ వద్ద ప్రణాళికలు ఉన్నాయని ఇంగ్లాండ్ మేనేజర్ థామస్ టచెల్ వెల్లడించాడు. ''లియోనెల్ మెస్సిని ఎదుర్కోవాలంటే పాత పద్ధతిని అనుసరిస్తే ఎలా ఉంటుందో ఆలోచిస్తున్నాం. మైదానంలో మెస్సి చాలా వేగంగా కదులుతూ ఉంటాడు. ఎక్కడికి బంతి పంపిస్తాడో అంచనా వేయొచ్చు. అయితే, మిగతావారికంటే ముందుగానే పరిస్థితులను త్వరగా అర్థం చేసుకుంటాడు'' అని టచెల్ తెలిపాడు.



# కెప్టెన్సీపై స్మృతి మంధాన ఆసక్తి



భారత మహిళా జట్టుకు వన్డే ప్రపంచ కప్ కలను నెరవేర్చిన సారథి హర్మన్‌ప్రీత్ కౌర్. అయితే, కప్పును సాధించడంలో ఓపెనర్ స్మృతి మంధాన అద్భుత ఆటతీరు కూడా కీలకమే. కానీ, గత టీ20 వరల్డ్ కప్‌లో భారత మహిళా జట్టు గ్రూప్ స్టేజ్‌కే పరిమితమైంది. తాజాగా లార్డ్స్ వేదికగా జరిగిన మొదటి టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను చిత్తు చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అవును.. నేను సిద్ధమే: కెప్టెన్సీపై స్మృతి మంధాన ఆసక్తిరెండు ఇన్నింగ్స్‌ల్లోనూ హాఫ్ సెంచరీలు చేసి సత్తా చాటింది. ఈ క్రమంలో 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ ఆటకు వీడ్కోలు పలికే అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో తదుపరి టీమ్‌ఇండియా సారథి రేసులో స్మృతి మంధాన ముందు వరుసలో ఉంది. ''అవును.. నేను పూర్తిస్థాయి సారథ్యం చేపట్టేందుకు సిద్ధంగానే ఉన్నా'' అని మంధాన తెలిపింది. గత పదేళ్లుగా హర్మన్‌తో కలిసి స్మృతి భారత జట్టుకు పిల్లర్‌గా మారింది. డ్యాషింగ్ ఓపెనింగ్‌తో అభిమానులను అలరిస్తోంది. హర్మన్ గైర్హాజరీలో మంధాన ఇప్పటికే 18 టీ20లు, నాలుగు వన్డేల్లో టీమ్‌ఇం డియాను నడిపించింది. రెండు ఫార్మాట్లలో కలిపి మొత్తం 15 మ్యాచుల్లో భారత జట్టును గెలిపిం చింది. 'లార్డ్స్ వేదికగా జరిగిన తొలి మహిళా టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. ఈ జట్టులో భాగస్వామ్యం కావడం అద్భుతంగా అనిపిస్తోంది. ఇందులో నా వంతు సహకారం ఉండటం మరింత సంతోషాన్ని స్తోంది. లార్డ్స్‌లో టెస్టు క్రికెట్ అనేది చిన్నప్పటి కల. ఇప్పుడు మేం గెలిచి చూపించాం. ఎప్పటికీ మరిచిపో లేని జ్ఞాపకం'' అని స్మృతి మంధాన తెలిపింది.

# సమన్వయ లోపంతోనే మేం ఓడాం:

ఫిఫా ప్రపంచ కప్ నెగ్గాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన ఫ్రాన్స్‌కు సెమీస్‌లో చుక్కెదురైంది. స్పెయిన్ చేతిలో 2-0 తేడాతో ఓటమిని చవిచూసింది. ఇక మూడో స్థానం కోసమే పోరాడాలి. తాము ఫైనల్‌కు చేరుకోవడంలో విఫలం కావ డానికి ప్రధాన కారణం ఏంటో స్టార్ ప్లేయర్ క్లియాన్ ఎంబాపె వెల్లడించాడు. సహచరుల ఆటతీరుపై అసహనం వ్యక్తం చేశాడు. గోల్డెన్ బూట్ రేసులో ఉన్న ఎంబాపె ఈ మ్యాచ్‌లో ఒక్క గోల్ చేయలేకపోయాడు. తొలి వన్డేలో సూపర్ ఇన్నింగ్స్.. ఆ ఇద్దరి సరసన అక్షర్ పటేల్ ''మేం అనుకున్నట్లుగా ఆడలేకపోయాం. వ్యూహాలు, సాంకేతికంగానూ ఘోరంగా విఫల మయ్యాం. మా స్థాయి ఆట కాదు ఇది. వరల్డ్ కప్ సెమీస్‌లో దూకుడుగా ఆడలేకపోతే విజయం సాధించడం అసాధ్యం. ప్రత్యర్థిపై ఒత్తిడి తెచ్చి వారిని కుదురుకోనీయకుండా చేయాలి. అప్పుడు మ్యాచ్ మన చేతుల్లో ఉంటుంది. కానీ, మేం అలా చేయలేకపోయాం. మిడ్‌ఫీల్డ్‌లో 3 ఆన్ 2 వ్యూహంతో బరిలోకి దిగాం. అయితే, ఆటగాళ్ల మధ్య సమన్వయలోపంతో అనుకున్న ఫలితం సాధించలేకపోయాం. మా అజాగ్రత్తతోనే ఈ ఓటమి. అయితే.. ఫుట్‌బాల్ ఎవరి కోసమూ వేచి ఉండదు. వైఫల్యాల నుంచి నేర్చుకుని కొత్తగా ఆరంభించాలి'' అని ఎంబాపె వెల్లడించాడు. ప్రస్తుతం ఫ్రాన్స్ ఫైనల్‌కు చేరుకోక పోయినా.. ఎంబాపె మాత్రం గోల్డెన్ బూట్ రేసులోనే నిలిచాడు. ప్రస్తుతం 8 గోల్స్, 3 అసిస్ట్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడి తర్వాత లియోనెల్ మెస్సి (8 గోల్స్, 2 అసిస్ట్స్), ఇర్లింగ్ హాలాండ్ (7 గోల్స్) ఉన్నారు. వీరిలో నార్వే ప్లేయర్ ఇర్లింగ్ హాలాండ్ ఇప్పటికే ఇంటిముఖం పట్టిన సంగతి తెలిసిందే. మెస్సి సెమీఫైనల్ మ్యాచ్‌ను ఆడాల్సి ఉంది. ఇంగ్లాండ్‌పై మెస్సి మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తే అతడే గోల్డెన్ బూట్ రేసులో ముందుకొస్తాడు.



# నాలో బ్యాటింగ్ సామర్థ్యాన్ని వెలికి తీసింది ఆ ఇద్దరే: వాషింగ్టన్ సుందర్

ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో భారత ఆటగాళ్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలతో మెరిశారు. యూకే పర్యటనలో టీమ్‌ఇండియా తొలి విజయంలో వీరిద్దరిది కీలక పాత్రే. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రిటైర్డ్ హర్ట్ కావడంతో.. సుందర్ (52★) థర్డ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. కేఎల్ రాహుల్ విఫలమైనా.. అక్షర్ (57★)తో కలిసి మ్యాచ్‌ను ముగించాడు. తన ఆటతీరు వెనక ఇద్దరు వ్యక్తులు ఉన్నారని సుందర్ వెల్ల డించాడు. ''భిన్నమైన పరిస్థితుల్లో.. భిన్నమైన ప్లేస్‌మెంట్‌లో బ్యాటింగ్‌కు వస్తున్నా. ఇలాంటి అవకాశం అందరికీ రాదు. జట్టు విజయం కోసం నావంతు సహకారం అందించేందుకు ప్రయత్నిస్తున్నా. రెండేళ్ల కిందటే గంభీర్ నా బ్యాటింగ్ పాత్రపై ఓ స్పష్టత ఇచ్చాడు. నేనేం చేయగలనో అర్థమ య్యేలా చెప్పాడు. గుజరాత్ టైటాన్స్ కోచ్ ఆశిశ్ నెహ్రా కూడా అంతే. నేను మెరుగైన ఆటతీరు ప్రదర్శించడానికి వీరిద్దరే ప్రధాన కారణం. ఆల్‌రౌండర్‌గా ప్రతి రోజూ మెరుగు కావడా నికి ప్రయత్నిస్తా. పరిస్థితు లకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉంటుంది. నా నైపుణ్యంపై నమ్మకం ఉంచిన మేనేజ్‌మెంట్‌కు ధన్యవాదాలు. శుభ్‌మన్ – శ్రేయస్ మంచి భాగస్వామ్యం అందించారు. అక్షర్ పటేల్‌తో కలిసి దానిని ముందుకు తీసుకెళ్లా. గిల్ గాయంపై నాకైతే సమాచారం లేదు'' అని సుందర్ తెలిపాడు.



# వుదయం సినిమా

MOVIE TIME!

## కిరణ్ అబ్బవరం పుట్టినరోజు సందర్భంగా 'జాయ్ ఫిల్మ్స్'

వుదయం సినిమా

#KA13 'బిహైండ్‌దిసీన్స్' (BTS) వీడియో రిలీజ్ అందరినీ అలరిస్తోన్న ఎమోషన్ & ఫుల్ ఫన్ వీడియో'క', 'కెర్యాంప్' వరుస విజయాలతో అదరగొడుతున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ అయిన #KA13తో బిజీగా ఉన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, హీరోగా అన్ని బాధ్యతలను స్వయంగా స్వీకరించారు. ప్రముఖ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి 'జాయ్ ఫిల్మ్స్' బ్యానర్‌పై నిర్మాతగా పరిచయమవుతూ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సురేష్ ఎర్ర సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దీనికి సంబంధించిన అనౌన్స్మెంట్ పోస్టర్ అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది.



## 'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రీ రిలీజ్ వేడుక

**వుదయం:** ప్రముఖ జానపద గాయని కోమలి నిర్మాతగా మారుతూ నిర్మించిన భావోద్వేగ కుటుంబ కథా చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' జూలై 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ కుమార్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం వహించారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దర్శకుడు దశరథ్, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. "చిన్న సినిమాలకు మా పార్టీ అండగా ఉంటుంది" – కల్వకుంట్ల కవితముఖ్య అతిథి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ఫోక్ సింగర్ కోమలి ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని నిర్మించారని ప్రశంసించారు. సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, చిన్న సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలని సూచించారు. తెలంగాణ లో చిన్న సినిమాల అభివృద్ధికి తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలుగు సినిమాల మాదిరిగానే తెలుగు ప్రజలు కూడా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. "కుటుంబ భావోద్వేగాలతో కూడిన అద్భుతమైన సినిమా" – దర్శకుడు దశరథ్దర్శకుడు దశరథ్ మాట్లాడుతూ, కోమలి ఎంతో అంకితభావంతో ఈ చిత్రాన్ని నిర్మించారని అన్నారు. కుటుంబ బంధాలు, భావోద్వేగాలతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుందని, బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. మానవ సంబంధాల విలువను గుర్తు చేసే కథఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు ప్రేక్షకులతో పాటు సినీ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. మానవ సంబంధాలు, తల్లిదండ్రుల విలువ, కుటుంబ బంధాలు, తండ్రి–పిల్లల అనుబంధం వంటి అంశాలను హృద్యంగా ఆవిష్కరించిన ఈ చిత్రం ప్రతి కుటుంబాన్ని ఆలోచింపజేసేలా ఉంటుందని చిత్రబృందం తెలిపింది.



## "చెన్నై లవ్ స్టోరీ"తో కిరణ్ కి చాలా మంచి పేరొస్తుంది

**వుదయం:** హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫొటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా "చెన్నై లవ్ స్టోరీ". ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు "చెన్నై లవ్ స్టోరీ" మూవీ రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా గ్రాండ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం పుట్టినరోజు వేడుకలు సందడిగా జరిపారు. ఈ సందర్భంగానటి సిరి హన్మంతు మాట్లాడుతూ – "చెన్నై లవ్ స్టోరీ" మూవీలో నటించే అవకాశం దక్కడం హ్యాపీగా ఉంది. ఈ నెల 24న మీరంతా మా సినిమాతో ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ చూడబోతున్నారు. ఇలాంటి మంచి మూవీలో భాగమయ్యే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు థ్యాంక్స్ చెబుతున్నా. అన్నారు.హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ – ఈరోజు బర్త్ డే జరుపుకుంటున్న కిరణ్ గారికి హ్యాపీ బర్త్ డే చెబుతున్నా. మా మూవీ నుంచి గ్లింప్స్ రిలీజ్ చేసి ఏడాది అవుతోంది. ఇప్పటిదాకా మీరు ఆ గ్లింప్స్ ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. అప్పటి నుంచి మీరు మాకు సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. మరో వారం రోజుల్లో మా సినిమా రిలీజ్ కు వస్తోంది. ఇప్పుడు మీ సపోర్ట్ ఇంకా అవసరం. సినిమా మొత్తం హార్ట్ హిట్టింగ్ గా ఉంటుంది. ఈ సినిమాలో వదలనే సాంగ్ లీడ్ సీన్ చాలా బాగుంటుంది. అలాగే సెకండాఫ్ లో కొన్ని సీన్స్ మెమొరబుల్ గా ఉంటాయి. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ లో అనేక లేయర్స్ ఉంటాయి. మీరు ఇప్పటిదాకా రిలీజ్ చేసిన నాలుగు పాటలు చూస్తే నాలుగు పాటల్లో ఒక్కోలా కనిపిస్తా. మీరు స్వచ్ఛమైన ప్రేమ ఎలా ఉంటుందో మా సినిమాలో చూస్తారు.



## 'మిస్టర్ మిడిల్ క్లాస్' ప్రీరిలీజ్ ఈవెంట్



**వుదయం:** శ్రీకాంత్, లయ హీరో హీరోయిన్స్ గా నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు జి. నాగేశ్వర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ మిస్టర్ మిడిల్ క్లాస్. జీకే & సిఎన్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జూలై 17న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ వేడుకకు వివి వినాయక్, దశరథ్, కోన వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. ముందుగా పద్మశ్రీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారికి హృదయపూర్వక అభినందనలు. నిజానికి ఇది ఆయన సినిమానే. వెంకటేశ్వర స్వామి పాత్ర లేకపోతే ఈ సినిమా ఉండేది కాదు. అలాంటి గొప్ప పాత్ర ఆయనకు రావడం అదృష్టం. ఈ సినిమాలో ఆయన పాత్ర ఒక పెద్ద హైలైట్‌గా నిలుస్తుంది. మనమందరం కూడా ఏదో ఒక సమయంలో మిడిల్ క్లాస్ నుంచే వచ్చిన వాళ్లమే. ఈరోజు ధనవంతులుగా ఉన్న వాళ్లు ఒకప్పుడు మిడిల్ క్లాస్ జీవితాన్నే గడిపారు. మిడిల్ క్లాస్ వాళ్లు పడే కష్టాలను వినోదాత్మకంగా చెప్పడం ఒక గొప్ప కళ. ఆ విషయంలో నాగేశ్వర్ రెడ్డి గారు అద్భుతంగా విజయం సాధించారు. మనకు కష్టాలు వచ్చినప్పుడు దేవుడికే చెప్పుకుంటాం. ఇలాంటి ఎంటర్‌టైనింగ్ సబ్జెక్ట్‌లో నటించే అవకాశం రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. దర్శకుడు నాగేశ్వర్ రెడ్డి గారికి, నిర్మాత చందు గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. ఈ సినిమా నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇలాంటి పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్ చేసి చాలా కాలమైంది. ఇందులో ఉన్న ప్రతి ఆర్టిస్ట్‌తో గతంలో నేను కలిసి పనిచేశాను. మళ్లీ వాళ్లందరితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం పాత రోజులు గుర్తుకు తెచ్చింది. రఘుబాబు, సునీల్, వెన్నెల కిషోర్... ఇలా ఎంతో మంది అద్భుతమైన నటీనటులు ఈ సినిమాలో ఉన్నారు.

## "ఆపరేషన్ అరుణారెడ్డి" ప్రీ రిలీజ్ ఈవెంట్

**వుదయం:** ప్రముఖ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "ఆపరేషన్ అరుణారెడ్డి". ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్ బాధ్యతలు కూడా పోసాని కృష్ణమురళి వహిస్తుండటం విశేషం. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్, బీజేపీ నేత రఘునందన్ రావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 17న "ఆపరేషన్ అరుణారెడ్డి" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమ్యూజిక్ డైరెక్టర్ మహదేవ్ ఏలేందర్ మాట్లాడుతూ – ఈ చిత్రాన్ని పోసాని గారు ఎంతో ప్లానింగ్ తో రూపొందించారు. ఎన్నో వెర్షన్స్ స్క్రిప్ట్ రాసుకున్నారు. ఆ స్క్రిప్ట్ లో డైలాగ్స్ తో పాటు లిరిక్స్ కూడా రాసుకున్నారంటే ఆయన ఎంత పక్కాగా ఈ స్క్రిప్ట్ చేశారో అర్థం చేసుకోవచ్చు. కథ విన్నప్పుడే ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందని అనిపించింది. ఇది పోసాని కి 2.ఓ గా మారుతుందని చెప్పగలను అన్నారు. డీవోపీ సుధాకర్ మాట్లాడుతూ – ఇందాక మా మ్యూజిక్ డైరెక్టర్ చెప్పినట్లు "ఆపరేషన్ అరుణారెడ్డి" సినిమా పోసాని గారికి 2.ఓ అవుతుంది. ఈ సినిమాకు వర్క్ చేసేప్పుడు పోసాని గారి దగ్గర ఎంతో నేర్చుకున్నాను. ఆయనతో నాలుగేళ్లుగా ట్రావెల్ చేస్తున్నా. నాతో కలిసి ఎప్పటికీ మూవీస్ చేయాలని పోసాని గారు ఇటీవల చెప్పారు. ఆ మాట నాకెంతో సంతోషాన్నిచ్చింది. అన్నారు.హీరోయిన్ హిందోళ చక్రవర్తి మాట్లాడుతూ –"ఆపరేషన్ అరుణారెడ్డి" సినిమాలో ప్రధాన పాత్రలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది. నవ్విస్తుంది, ఆలోచింపజేస్తుంది, మన సొసైటీని రిఫ్లెక్ట్ చేసేలా ఉంటుంది. ఈ నెల 17న థియేటర్స్ కు వెళ్లి మా సినిమా చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు.



## 'రాజా ది రాజా' చాలా ప్యాషన్ తో తీసిన సినిమా

**వుదయం:** రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన 'రాజా ది రాజా' చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్ కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. బృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారిక దాసరి నిర్మించిన ఈ చిత్రాన్ని కె. శ్రీలత రెడ్డి సమర్పిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా సినిమా భారీ స్థాయిలో జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో రుత్విక్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.




**మీ తొలి సినిమా విడుదలకు వస్తోంది. ఎలా అనిపిస్తోంది?**

–చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. అదే సమయంలో కొంచెం టెన్షన్ కూడా ఉంది.

**యాక్టర్ కావడానికి మీరు చేసిన గ్రౌండ్ వర్క్ ఏమిటి?**

చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉంది. స్కూల్‌లో, నాటకాల ప్రదర్శనల్లో పాల్గొనేవాడిని. షేక్స్పియర్ నాటకంలో డ్యూక్ పాత్ర కూడా చేశాను.

**ఈ సినిమా చేయడానికి ముందు ఎన్ని కథలు విన్నారు?**

దాదాపు ఏడు కథలు విన్నాను. అందులో 'మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో ఒక కథ వుంది. నిజానికి దాంతోనే హీరోగా పరిచయం కావాలనుకున్నాను.

**తొలి సినిమాకే రెండు గెటప్స్ చేయడం ఎలా అనిపించింది?**

నాకు ఎప్పుడూ ఛాలెంజింగ్ పాత్రలు చేయడమే ఇష్టం. ఈ సినిమాలోని రెండు గెటప్స్ కోసం పూర్తిగా ప్రిపేర్ అయ్యాను. కాస్ట్యూమ్స్ కూడా స్వయంగా చూసుకున్నాను.

**సాయికుమార్ గారు, నరేష్ గారితో కలిసి నటించడం ఎలా అనిపించింది?**

–నరేష్ గారు నా తండ్రి పాత్రలో కనిపిస్తారు. ఆయనతో నటించడం చాలా ఎంజాయ్ చేశాను. ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించారు. సెట్స్‌లో చాలా సరదాగా ఉంటారు.

**డైరెక్టర్ అనిల్ బోయిడపు గురించి?**

–తనకి సినిమా అంటే చాలా పాషన్. పలు సూపర్ హిట్ సినిమాలకు ఆయన అసోసియేట్ గా పని చేశారు. చాలా క్లారిటీ వున్న డైరెక్టర్. చాలా మంచి డైరెక్టర్ అవుతారు.

## 'ఓ.! సుకుమారి' వినోదం, ఎమోషన్స్‌తో కూడిన పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

**వుదయం:** యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'ఓ.! సుకుమారి'తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్, టీజర్, సాంగ్స్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. జూలై 17న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో తిరువీర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.




**మీ నుంచి వరుసగా సినిమాలు విడుదల కావడం ఎలా అనిపిస్తోంది?**

నటుడిగా చాలా ఆనందంగా ఉంది. అలాగే మనతో సినిమా చేసిన నిర్మాత బాగుండాలి, దర్శకుడికి మంచి పేరు రావాలి, ప్రేక్షకులు ప్రతి సినిమాను ఆదరించాలని కూడా ఒక బాధ్యత ఉంటుంది.

**ఐశ్వర్య రాజేష్ గారితో కలిసి నటించడం ఎలా అనిపించింది?**

మన కో–స్టార్స్ మంచి పెర్ఫార్మర్స్ అయితే మనం కూడా ఇంకా బాగా నటించడానికి ప్రయత్నిస్తాం. ఒక నటుడికి ఎదుటి నటుడి రియాక్షన్‌ను బట్టి కూడా నటించే అవకాశం పెరుగుతుంది.

**ఈ కథను తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కించడానికి కారణం?**

మా దర్శకుడు భరత్ దర్శన్ గారు సిద్దిపేటకు చెందినవారు. ఈ మధ్యకాలంలో చాలామంది దర్శకులు తమ ప్రాంతాల కథలు, పాత్రలను చెప్పడానికి ఆసక్తి చూపుతున్నారు.

**'ఓ.! సుకుమారి' కథను ఒక్క లైన్‌లో చెప్పాలంటే?**

ఒక అమ్మాయి గుండె వేగం సాధారణ స్థాయిని దాటితే ఆమె శరీరం నుంచి ఎలక్ట్రిక్ షాక్ జనరేట్ అవుతుంది. అలాంటి అమ్మాయి జీవితంలోకి ప్రేమించిన అబ్బాయి వచ్చిన తర్వాత ఏం జరిగింది? ఆమె ప్రేమ సక్సెస్ అయ్యిందా లేదా? అనేదే కథ. చాలా కొత్తగా, ఆసక్తికరంగా ఉంటుంది.

**ఈ సినిమా ఎలా ఉండబోతోంది?**

–ఇది పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఎంత నవ్విస్తుందో, అంతే భావోద్వేగానికి గురి చేస్తుంది.

## "1=100" టీజర్ లాంచ్

**వుదయం:** శకుంతల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాబా మైలవరం దర్శకత్వంలో హీరో కృష్ణ కుమార్ మరియు హీరోయిన్ అర్పిత లోహి చిత్రం "1=100" టీజర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ నిర్మాత రిజ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై టీజర్‌ను ఆవిష్కరించి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.వెస్ట్రన్ స్టైల్ విజువల్స్, యాక్షన్ ఎలిమెంట్స్, అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో కూడిన ఈ టీజర్ ప్రేక్షకులను, సినీ ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. అనిల్ కుమార్ వేగూరు సినిమాటోగ్రఫీ, కెన్నీ చైతన్య సంగీతం, నందమూరి హరి ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయి. రాజు ఎంటర్‌టైనర్స్, స్పార్కిల్ డాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఇప్పటికే టీజర్‌కు వస్తున్న భారీ రెస్పాన్స్ తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని, త్వరలోనే సినిమా మరిన్ని వివరాలను వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.



## దళపతి విజయ్ చివరి సినిమా 'జన నాయగన్'..

**వుదయం:** దళపతి విజయ్ హీరోగా నటించిన చిత్రం 'జన నాయగన్'. ఇది ఆయన చివరి చిత్రం. ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా జూలై 23, 2026న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. భారతదేశంలో సినీ ప్రేమికులందరూ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'జన నాయగన్' ఒకటి. దళపతి విజయ్ అద్భుతమైన సినీ ప్రయాణంలో ఇదొక కీలకమైన మైలురాయిగా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఆయన చివరి సినిమాను ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, భారతీయ సినీ పరిశ్రమపై చెరగని ముద్ర వేసిన ఆయన కెరీర్‌కు ఈ చిత్రం సరైన నివాళిగా నిలుస్తుందని అందరూ భావిస్తున్నారు.హెచ్.వినోద్ దర్శకత్వంలో కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో రూపొందిన 'జన నాయగన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని అందించేందుకు ప్రతిభావంతమైన టీమ్‌ను ఒకేచోట చేర్చింది. ఈ సందర్భంగా..నిర్మాత వెంకట్ కె.నారాయణ మాట్లాడుతూ ..“సినిమా చరిత్రలో నిజంగా చారిత్రాత్మకంగా అనిపించే క్షణాలు చాలా అరుదు. 'జన నాయగన్' కూడా అలాంటి ప్రత్యేకమైన క్షణం. దళపతి విజయ్ తన చివరి సినిమాతో సిల్వర్ స్క్రీన్పై సందడి చేయనున్నారు. ఈ ప్రయాణంలో భాగమైనందుకు గౌరవంగా భావిస్తున్నాం.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.